అనుదినం... జనస్వరం

www.navatelangana.com

నవతెలంగాణ

ఆదివారం 22-10-2023

సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 9 | సంచిక : 292 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | 14 పేజీలు + (వేబ్‌లో సోపతి) | వెల : 8.00



పూల పండుగకు ధరాఘాతం

రెండింతలు పెరిగిన పూల ధరలు

- ఉమ్మడి మెదక్ జిల్లాలో పెరిగిన బంతి పూల సాగు
- బంతి మినహా మండుతున్న అన్ని రకాల పూల ధరలు
- ఖరీదైనదిగా మారిన బతుకమ్మ ఆటాపాట

నేడు సద్దుల బతుకమ్మ

ప్రకృతిని ఆరాధించే బతుకమ్మ పండుగ సందడి చివరి అంకానికి చేరింది. ఆదివారం జరగనున్న చివరి.. పెద్ద బతుకమ్మ పండుగ సద్దుల బతుకమ్మ కోసం మార్కెట్లు పూలతో నిండాయి. పుడమితో జలంతో పూలతో మానవులకున్న అనుబంధంతో జరుపుకునే పండుగ బతుకమ్మ. తొమ్మిది రోజులపాటు తీరొక్క పూలతో జరుపుకునే బతుకమ్మ పండుగ తెలంగాణ ప్రత్యేక సంస్కృతిని చాటుతోంది. ప్రకృతిలో సహజంగా దొరికే పూలతో పేర్చి ఆరాధిస్తూ ఆడిపాడే బతుకమ్మ పండుగకు ఈసారి పూల ధరలు భారంగా మారాయి.

నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

ఊరూ వాడా యాడ చూసినా బతుకమ్మల సందడే కనిపిస్తోంది. పట్టణాల్లో మార్కెట్లన్నీ పూలరాసులతో నిండిపోయాయి. కానీ,పూల ధరలు పెరగడంతో కిలోల కొద్దీ కొనే పరిస్థితి లేదని మహిళలు వాపోతున్నారు.

తొమ్మిది రోజులు.. తీరొక్క పూలు

తొమ్మిది రోజుల పాటు జరుపుకునే బతుకమ్మ పండుగ ఎంగిలిపూలతో ప్రారంభమై సద్దుల బతుకమ్మతో ముగుస్తుంది. ప్రతి ఏటా దసరా పండుగకు ముందు వచ్చే బతుకమ్మ పండుగ తెలంగాణ ...6లో

24 గంటల్లో 9.69 కోట్లు స్వాధీనం

భారీగా బంగారం, నగదు జప్తు



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

ఎన్నికల సందర్భంగా నిర్వహిస్తున్న తనిఖీల్లో భారీగా డబ్బు, బంగారం, మత్తుపదార్థాలు పట్టుబడుతున్నాయి. అక్టోబర్ 20వ తేదీ ఉదయం 9 నుంచి 21వ తేదీ ఉదయం 9 గంటల వరకు 24 గంటల్లో రూ.9.69 కోట్ల నగదు పట్టుబడింది. దీనితో ఎలక్షన్ కోడ్ అమల్లోకి వచ్చిన అక్టోబర్ 9 నుంచి 21వ తేదీ వరకు స్వాధీనం చేసుకున్న మొత్తం నగదు రూ.105.58 కోట్లకు చేరింది. అలాగే గడచిన 24 గంటల్లో అక్రమంగా సరఫరా చేస్తున్న ...13లో

త్యాగాలతోనే విజయాలు సాధ్యం

పోలీసు అమరవీరుల సంస్మరణ సభలో డీజీపీ

- పోలీసు అమరవీరుల స్థూపం వద్ద శ్రద్ధాంజలి ఘటించిన ఐపీఎస్ అధికారులు



నవతెలంగాణ-ప్రత్యేక ప్రతినిధి :

త్యాగాలతోనే విజయాలను సాధించగలమనీ, ఈ విషయాన్ని అనేక మంది పోలీసు అమరవీరులు తమ త్యాగాలతో నిరూపించారని రాష్ట్ర డీజీపీ అంజనీకుమార్ ఉద్ఘాటించారు. శనివారం గోషామ హల్ పోలీసు స్టేడియంలో పోలీసు ...13లో

మేమే ముందుంటాం

కాంగ్రెస్‌కు 40 స్థానాల్లో అభ్యర్థుల్లేరు..

యుద్ధానికి ముందే బీజేపీ చేతులెత్తేసింది...
దాని దుకాణం బంద్ అయింది..కథ ఒడిసిపోయింది...

- మీడియాతో ఇష్టాగోష్టిలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తమ పార్టీ తొలి జాబితా ప్రకటించి అరవై రోజులైందనీ, కానీ ప్రతిపక్ష పార్టీలకు ఇప్పటికీ అభ్యర్థుల విషయంలో స్పష్టత లేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర మంత్రి కేటీఆర్ వ్యాఖ్యానించారు. కాంగ్రెస్‌కు 40 స్థానాల్లో అభ్యర్థులే లేరని ఆయన చెప్పారు. ఆ పార్టీ చరిత్ర, దాని ట్రాక్ రికార్డే కాంగ్రెస్‌కు గుదిబండగా మారనుందని జోస్యం చెప్పారు.. బీజేపీ యుద్ధానికి ముందే చేతులెత్తేసిందనీ, దాని దుకాణం బంద్ అయిందనీ, రాష్ట్రంలో ఆ పార్టీ కథ ఒడిసిపోయిందని ఎద్దేవా చేశారు. 2018 ముందస్తు ఎన్నికల్లో బీజేపీ 105 స్థానాల్లో డిపాజిట్ కోల్పోయిందనీ, ఈసారి 110 స్థానాల్లో ధరావతు కోల్పోనుందని చెప్పారు. అభ్యర్థుల జాబితా విడుదలతోపాటు ప్రచారంలోనూ అన్ని పార్టీల కంటే బీఆర్ఎస్ ముందుందనీ, అదే తరహాలో ఎన్నికల ఫలితాల్లోనూ తాము ముందుంటామని ధీమా వ్యక్తం చేశారు. శనివారం హైదరాబాద్‌లో కేటీఆర్ మీడియా ప్రతినిధులతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. తెలంగాణ ఆవిర్భావా నికి ముందు వ్యవసా యం, పరిశ్రమలు, కరెంటు, ...14లో

> వామపక్షాలంటే గౌరవం లేకకాదు.. లెక్క కుదరలేదంతే...
>
> వారికి దూరం కావటం దురదృష్టకరం

ఇజ్రాయిల్ వెనుక అమెరికా

ప్రపంచంలో ప్రతి యుద్ధం వెనుకా సామ్రాజ్యవాదమే

- పాలస్తీనా ప్రజలపై దశాబ్దాలుగా క్రూరత్వం : యూకె లేబర్ పార్టీ నేత జెరెమీ కార్బిన్
- ముంబయిలో ఏఐకేఎస్ నేతలతో భేటీ



వివరాలు 13లో

కోట్లు ఖర్చు పెట్టి ఫేక్ ప్రచారం

డ్రామారావు ఇందులో రాటుదేలాడు

- తప్పుడు ప్రచారాలెన్ని చేసినా గెలిచేది కాంగ్రెస్ : రేవంత్



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

బీజేపీ దగ్గర శిష్యరికంతో ఈ డ్రామారావు ఫేక్ ప్రచారాల్లో రాటుదేలిండు. తెలంగాణలో కాంగ్రెస్ సునామిని చూసి కేటీఆర్‌కి ఏం చేయాలో అర్థం కావడం లేదు. అందుకే ఇప్పుడు కోట్ల రూపాయలు ఖర్చు పెట్టి 'ఫేక్ ప్రచారాలకు దిగిండు' అంటూ టీపీసీసీ అధ్యక్షులు రేవంత్‌రెడ్డి శనివారం ట్వీట్ చేశారు. 'నిన్న మొన్నటి దాకా కర్నాటక లో అధికారంలో ఉన్న వీళ్ల మిత్ర పార్టీ బీజేపీ, 40శాతం కమిషన్లతో రాష్ట్రాన్ని పూర్తిగా దివాలా తీయించింది. అలాం టి పరిస్థితుల్లో అధికారం చేపట్టిన కాంగ్రెస్ 100 రోజుల్లోపే ఇచ్చిన గ్యారంటీలను అమలు చేసి, రాష్ట్రాన్ని మళ్లీ అభివృద్ధి వైపు నడిపిస్తున్నది. ఇప్పుడు తెలంగాణాలోనూ కాంగ్రెస్ దూసుకెళ్తుంటే, ఇన్ని రోజులు నింపుకు న్న జేబులను ఇప్పుడు దులుపుతు న్నారు. మీరెన్ని తప్పుడు ప్రచారాలు చేసినా, కోట్లు కుమ్మరించి నా, తెలంగాణ ప్రజలు మీ తోడు దొంగల దుమ్ము దులపడం ఖాయం! కాంగ్రెస్ వస్తుంది! తెలంగాణ గెలుస్తుంది' అని ధీమా వ్యక్తం చేశారు.

వామపక్షాలతో
చర్చలు జరుగుతున్నాయి

స్క్రీనింగ్ కమిటీ భేటీ తర్వాత మురళీధరన్ వెల్లడి

- తుది జాబితాపై కాంగ్రెస్ కసరత్తు...
- వీలైనంత త్వరగా రెండో జాబితా ప్రకటిస్తాం : మాణిక్ రావ్ ఠాక్రే

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి తుది జాబితాను వీలైనంత త్వరగా ప్రకటిస్తామని కాంగ్రెస్ నేతలు తెలిపారు. ఇప్పటికే 55 స్థానాలకు అభ్యర్థులను ప్రకటించిన ఆ పార్టీ, మిగిలిన స్థానాలకు అభ్యర్థుల ఎంపికపై శనివారం నాడిక్కడ కీలక భేటీ జరిగింది. కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి (సంస్థాగత) కేసీ వేణుగోపాల్ ...3లో



ఉద్యోగాలు తగ్గుతున్నాయ్

14లో..

పీఎఫ్ చందాదారుల్లో పతనం

ఆగస్టులో 13.3 శాతం క్షీణత

ఊరికి దారేదీ..!

ఏడాది హామీకి ఐదేండ్లు..

పూర్తికాని గుర్రంగడ్డ బ్రిడ్జి... నది మధ్యలో ఊరు

ఏడాదిలో పూర్తి చేస్తామన్న గుర్రంగడ్డ బ్రిడ్జి హామీకి ఐదేండ్లు గడిచాయి.. బ్రిడ్జి పనులు మాత్రం ఎక్కడేసిన గొంగడి అక్కడే అన్న చందంగా ఉంది. 2018 ఎన్నికల ప్రచారంలో భాగంగా గద్వాలకు వచ్చిన ముఖ్యమంత్రి కేసీఆర్.. కృష్ణానది మధ్యలో ఉన్న గుర్రంగడ్డకు బ్రిడ్జి ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. 24 గంటల్లో జీవో ఇస్తానని చెప్పారు. 9 నెలల్లో బ్రిడ్జిని పూర్తి చేసి ఏడాదిలో గుర్రంగడ్డ ప్రజల కష్టాలు తీరుస్తానన్నారు. ఆ హామీకి ఐదేండ్లు పూర్తయ్యాయి. బ్రిడ్జి నిర్మాణం పనులు ముందుకు సాగలేదు. మళ్లీ ఎన్నికలు వచ్చిన నేపథ్యంలో దానిపై నవ తెలంగాణ ప్రత్యేక కథనం.



నవతెలంగాణ - మహబూబ్‌నగర్ ప్రాంతీయ ప్రతినిధి

చుట్టూ కృష్ణమ్మ.. మధ్యలో ఊరు.. నదికి వరదలు వస్తే గ్రామానికి రాకపోకలు ఆగిపోతాయి. ఎక్కడికి వెళ్లాలన్నా పుట్టిలోనే ప్రయాణం.. ఓ వైపు సకాలంలో వైద్యం అందక ఇబ్బందులు పడుతుంటే.. మరోవైపు దారిలేని గుర్రంగడ్డ యువతకు పెండ్లిళ్లు కావడం లేదని గ్రామస్తులు ఆవేదన చెందుతున్నారు.

ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలోని గద్వాల మండలం కృష్ణా నది మధ్యలో 2500 ఎకరాల విస్తీర్ణంలో గుర్రంగడ్డ అనే ఊరు ఉంది. ఆ గ్రామంలో 850 మంది జనాభా ఉంది. 44వ నేషనల్ హైవే దగ్గర్లో ఉన్న ఈ గ్రామం నుంచి ఇతర ప్రాంతాలకు వెళ్లాలంటే పుట్టిలో నదిని దాటాలి. పిల్లలు స్కూల్‌కి వెళ్లాలన్నా ఈ సాహసం చెయ్యాల్సిందే. ఈ జీవన చక్రంలో ఇప్పటికే అనేకమంది నదిలో మునిగి చనిపోయిన ఘటనలున్నాయి.

ఏటా జులైలో కృష్ణా నదికి వరదలు వచ్చాక.. అప్పటి నుంచి ఫిబ్రవరి వరకు శ్రీశైలం ప్రాజెక్టు బ్యాక్ వాటర్ గుర్రంగడ్డ గ్రామం చుట్టూ నిలిచి ఉంటుంది. పుట్టిలో కిలోమీటర్లు ప్రయాణిస్తే తప్ప బయటి ప్రపంచంలోకి అడుగుపెట్టలేరు. వరద సమయంలో పుట్టిలో ప్రయాణం కూడా కష్టమే. అందువల్ల గ్రామస్తులకు ఇతర ప్రపంచంతో ...13లో

కరెంట్ కట్ చేశారని..
లైన్‌మెన్‌పై కత్తితో దాడికి యత్నం

నవతెలంగాణ-ధూల్ పేట్

బకాయి ఉండటంతో కరెంట్ సరఫరా కట్ చేసినందుకు లైన్‌మెన్‌పై ఓ వ్యక్తి కత్తితో బెదిరిస్తూ దాడికి యత్నించాడు. ఈ ఘటన హైదరాబాద్ మీర్‌చౌక్ పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పురానా హవేలీ ప్రాంతంలోని మహమ్మద్ ఉమర్ చౌదరి ఈ ఏడాది మార్చి నుంచి కరెంట్ బిల్లు చెల్లించట్లేదు. ప్రతినెలా కరెంట్ బిల్లు చెల్లించాలని లైన్‌మెన్ అబ్దుల్ సలీం రోహి అతనికి చెబుతూ వచ్చాడు. అయినా చెల్లించకపోవడంతో శుక్రవారం ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆ ఇంటికి కరెంటు సరఫరా బంద్ చేశారు. ఆ ఇంటి వాళ్ళు బిల్లు కడతామని చెప్పడంతో తిరిగి కరెంట్ కనెక్షన్ ఇచ్చేందుకు వెళ్లిన లైన్‌మెన్‌ను యజమాని ఉమర్ తోసేశాడు.

కనెక్షన్ ఎలా తొలగిస్తావంటూ తన జేబులో ఉన్న కత్తిని తీసి తల తీసేస్తానంటూ బెదిరించాడు. వెంటనే అక్కడ ఉన్న ఏఈ లైన్‌మెన్‌ను తీసుకెళ్లారు. దీనిపై స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

తెలంగాణకు ఇద్దరు ప్రత్యేక పరిశీలకులు

- నియమించిన కాంగ్రెస్ హైకమాండ్

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

త్వరలో తెలంగాణ లో జరగనున్న అసెంబ్లీ ఎన్నికలకు కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఇద్దరు ప్రత్యేక పరిశీలకులను నియమించారు. ఇందులో అశోక్ శంకర్ రావు చౌహాన్, ఎస్ ఎస్ బోస్ రాజులకు చోటు కల్పించారు. ఈ మేరకు శనివారం కాంగ్రెస్ జాతీయ ప్రధాన కార్యదర్శి(సంస్థాగత) కేసీ వేణుగోపాల్ ప్రకటన విడుదల చేశారు. అలాగే మీడియా సన్నాహక పరిశీలకులుగా డాక్టర్ అజయ్ కుమార్ లను నియమించారు. ఈ ఉత్తర్వులు తక్షణమే అమలులోకి వస్తాయని ప్రకటనలో పేర్కొన్నారు.

ఎన్నికల వేళ..
ఛత్తీస్‌గఢ్‌లో బీజేపీ కార్యకర్త హత్య

రాయ్‌పూర్: ఛత్తీస్‌గఢ్‌లో బీజేపీ కార్యకర్త దారుణ హత్యకు గురయ్యారు. రాష్ట్రంలోని నక్సల్స్ ప్రభావిత ప్రాంతమైన మోహ్లా మన్‌పూర్ అంబగఢ్ చౌకీ జిల్లాలో ఈ ఘటన చోటు చేసుకొంది. పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం.. ఔంధీ గ్రామానికి చెందిన భాజపా కార్యకర్త బిర్జు తారమ్(60) సాయంత్రం వేళ బయటకు వెళ్లారు. ఈ క్రమంలో కొందరు గుర్తు తెలియని దుండగులు ఆయనపై దాడికి దిగారు. తుపాకీతో కాల్పులు జరిపి అక్కడి నుంచి పారిపోయారు. ఈ ఘటనలో తారమ్ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఎన్నికల ముందు ఈ హత్య జరగడం రాష్ట్ర రాజకీయాల్లో కలకలం రేపింది. దీనిపై రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు అరుణ్ సావో స్పందిస్తూ.. కాంగ్రెస్‌పై విమర్శలు గుప్పించారు. బీజేపీ కార్యకర్తలను లక్ష్యంగా చేసుకుని ఈ హత్యలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఇలాంటి చర్యలకు బీజేపీ నేతలు భయపడరని అన్నారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్‌ను గద్దె దించుతామన్నారు. ఛత్తీస్‌గఢ్‌లో ఈ హత్య చోటు చేసుకోవడం తొలిసారి కాదు. గతంలో బీజాపుర్, బస్తర్ డివిజన్, నారాయణపుర్ జిల్లాల్లో బీజేపీ నేతలు హత్యకు గురయ్యారు.

బీజేపీతో రాజ్యాంగానికి ప్రమాదం..

- దళితుల సమస్యలను ఎన్నికల ఏజెండాలో చేర్చాలి : కేవీపీఎస్ రాష్ట్ర అధ్యక్షులు జాన్ వెస్లీ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్



బీజేపీతో భారత రాజ్యాంగానికి ప్రమాదం పొంచి ఉన్నదనీ, దాని స్థానంలో మను ధర్మ శాస్త్రాన్ని అమలు చేయాలని చూస్తున్నదని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం(కేవీపీఎస్) రాష్ట్ర అధ్యక్షులు జాన్‌వెస్లీ తెలిపారు. శనివారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో దళిత బహుజన ఫ్రంట్ అధ్యక్షులు శంకర్ అధ్యక్షతన దళిత, ప్రజాసంఘాలు సంయుక్తంగా నిర్వహించిన సమావేశంలో వెస్లీ మాట్లాడారు. బీజేపీని అధికారంలోకి రాకుండా ఓడించటం ద్వారానే రాజ్యాంగాన్ని కాపాడుకోగలమన్నారు. అట్టడుగు వర్గాలైన దళితుల్లో చైతన్యం కల్పించడం కోసం ప్రజా సంఘాలు, సామాజిక సంఘాల ఆధ్వర్యంలో కోటి సంతకాల సేకరణ చేయాలని పిలుపునిచ్చారు. దళితుల మీద దాడులు, దౌర్జన్యాలు పెరిగాయని ఆవేదన వ్యక్తం చేశారు. బాధితులకు రక్షణగా నిలవాల్సిన ప్రభుత్వం పెత్తందారులకు కొమ్ముకాస్తున్నదని విమర్శించారు. రాజ్యాంగ హక్కులను అమలు చేయడానికి మోడీ ప్రభుత్వానికి ఏ మాత్రం ఇష్టం లేదని చెప్పారు. ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ చట్టాన్నే ఎత్తేయాలని కుట్ర చేస్తున్నదని ఆరోపించారు. కార్పొరేట్, బహుళజాతి కంపెనీల ఒత్తిడికి తలొగ్గి ప్రభుత్వ రంగ సంస్థలను ప్రయివేటీకరించడం, ప్రభుత్వ రంగ పెట్టుబడులను ఉపసంహరించుకోవడం చేస్తుందని తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగుల ప్రమోషన్లలో రిజర్వేషన్లను అమలు చేయడం లేదన్నారు. విస్తారమైన ప్రయివేట్ రంగంలోని ఉపాధిలో రిజర్వేషన్లను అమలు చేయకపోవడం వలన ఉన్నత విద్య చదివిన దళిత విద్యార్థులు ఉపాధికి దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అభివృద్ధి పేరుతో జరుగుతున్న భూసేకరణలో దళితుల చేతుల్లో ఉన్న అసైన్డ్ భూములను లాక్కుంటున్నారనీ, ఇదేనా? దళితుల అభివృద్ధి అంటే అని ప్రశ్నించారు. గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసేందుకు కుట్రలు చేస్తున్నదన్నారు. పెత్తందారుల ఒత్తిడి వలన ఆ చట్టానికి నిధులు తగ్గించారని తెలిపారు. దళితులకు మూడెకరాల భూమి ఎటుపోయిందని ప్రశ్నించారు. పేదలకు ఇండ్లు, ఇండ్ల స్థలాలు ఇవ్వడానికి ఈ ప్రభుత్వానికి చేతులు రాలేదని తెలిపారు. కులాంతర వివాహాలు చేసుకున్న వారిపై నడిరోడ్డు మీద పెత్తందార్లు నరికి చంపుతున్నా ప్రభుత్వం పట్టించుకోవటం లేదని విమర్శించారు. అంటరాని తనం, కుల వివక్షను పాలకులే పెంచి పోషిస్తున్నారని ఆరోపించారు. ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ చట్టాన్ని అమలు చేయడానికి సిద్ధపడటం లేదన్నారు. జస్టిస్ పున్నయ్య కమిషన్ సిఫార్సులు, మంత్రి కోనేరు రంగారావు కమిటీ భూ సిఫార్సులను అమలు చేయడం కోసం తెలంగాణ ప్రభుత్వం ముందుకు రావటం లేదని తెలిపారు.

దళితుల సమస్యలను ఎన్నికల ఏజెండాలలో చేర్చి వాటి పరిష్కారానికి కృషి చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ వెంకటరాములు, రాష్ట్ర ఉపాధ్యక్షులు బి ప్రసాద్, దళిత హక్కుల పోరాట సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అనిల్, డీబీఎస్‌యూ రాష్ట్ర నాయకులు నరసింహ, పీపుల్స్ మానిటరింగ్ కమిటీ తెలంగాణ కోఆర్డినేటర్ శివలింగం, డీబీఎఫ్ రాష్ట్ర నాయకురాలు పులి కల్పన తదితరులు పాల్గొన్నారు

వామపక్షాలతో చర్చలు జరుగుతున్నాయి

(మొదటిపేజీ తరువాయి)

నివాసంలో రాష్ట్ర నేతలు భేటీ అయ్యారు. ఈ భేటీలో స్క్రీనింగ్ కమిటీ చైర్మన్ మురళీధరన్, రాష్ట్ర ఇన్‌చార్జి మాణిక్ రావ్ ఠాక్రే, పీసీసీ రేవంత్ రెడ్డి, ఎంపీ ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఇతర నేతలు హాజరయ్యారు. సాయంత్రం 4 గంటలకు ప్రారంభమైన ఈ భేటి... రాత్రి 10 గంటల వరకు సాగింది. దాదాపు ఆరు గంటల పాటు సాగిన ఈ భేటిలో పెండింగ్ లో ఉన్న 64 స్థానాలతో పాటు, వామపక్ష పార్టీలతో పొత్తులపై చర్చించారు. భేటీకి ముందు స్క్రీనింగ్ కమిటీ చైర్మన్ మురళీధరన్ మీడియాతో మాట్లాడారు. రెండో విడత అభ్యర్థుల జాబితాపై చర్చించబోతున్నట్లు వెల్లడించారు. ఏ సమయంలో అయినా తుది జాబితా రావచ్చన్నారు. వామపక్ష పార్టీలతో పొత్తు, సీట్ల కేటాయింపుపై చర్చలు జరుగుతున్నాయని చెప్పారు.

కాంగ్రెస్ పార్టీ నుంచి ఒక్కో సీటు కోసం అనేక మంది ఆశావాహులు పోటీపడుతున్నారని రాష్ట్ర ఇన్‌చార్జి మాణిక్ రావ్ ఠాక్రే అన్నారు. తెలంగాణలో బిజెపి పరిస్థితి ఎలా ఉందో అందరికి తెలుసునని, బిజెపి నుంచి పోటీ చేసేందుకు అభ్యర్థులే లేరని విమర్శించారు. స్క్రీనింగ్ కమిటీ నివేదికను కాంగ్రెస్ ఎలక్షన్ కమిటీ(సీఈసీ) ముందు పెడతామన్నారు. త్వరలోనే సీఈసీ భేటీ ఉంటుందని, వీలైనంత త్వరగా అభ్యర్థుల జాబితా ప్రకటిస్తామని అన్నారు. అయితే సీఈసీ తరువాత మరో జాబితా ఉంటుందా లేదా అన్నది స్పష్టత వస్తుందన్నారు. వామపక్ష పార్టీతో ఉత్తమ్ కుమార్ రెడ్డి చర్చలు జరుపుతున్నట్లు చెప్పారు. తెలంగాణలో మరోసారి రాహుల్, ప్రియాంక గాంధీల పర్యటనలు ఉండేలా ప్రయత్నిస్తున్నట్లు వివరించారు. కాంగ్రెస్‌లో రెబెల్స్ లేరని, అధిష్ఠానం నిర్ణయం మేరకు అభ్యర్థుల ప్రకటన ఉంటుందని అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రాబోతుందని ధీమా వ్యక్తం చేశారు.

కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో ఆర్టీసీ కార్మికుల సమస్యలు చేర్చండి



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో


కాంగ్రెస్‌పార్టీ ఎన్నికల మ్యానిఫెస్టోలో టీఎస్‌ఆర్టీసీ కార్మికుల సమస్యల్ని చేర్చాలని ఎంప్లాయిస్ యూనియన్ విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు శనివారం యూనియన్ ప్రధాన కార్యదర్శి కే రాజిరెడ్డి, కార్యదర్శి జక్లయ్య, హైదరాబాద్ రీజినల్ అధ్యక్షులు రంగ కిషన్ గౌడ్ తదితరులు కాంగ్రెస్ మ్యానిఫెస్టో కమిటీ చైర్మెన్ డీ శ్రీధర్‌బాబును కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆర్టీసీ కార్మికులు, రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలతో కూడిన మూడు పేజీల వినతిపత్రాన్ని అందచేశారు.

అధికారంలోకి వస్తే స్థలమే కాదు...
ఇండ్లు కట్టిస్తాం : డీజేహెచ్‌ఎస్ ప్రతినిధులకు శ్రీధర్ బాబు హామీ

తాము అధికారంలోకి వస్తే జర్నలిస్టులకు ఇంటి స్థలమే కాకుండా ఇండ్లు కూడా కట్టించి ఇస్తామని కాంగ్రెస్ ఎన్నికల మ్యానిఫెస్టో కమిటీ చైర్మెన్ శ్రీధర్‌బాబు హామీ ఇచ్చారు. ఎన్నికల ప్రణాళికలో జర్నలిస్టుల ఇంటి స్థలం అంశాన్ని పొందుపరుస్తామని పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం డెక్కన్ జర్నలిస్ట్ హౌసింగ్ సొసైటీ (డీజేహెచ్‌ఎస్) ప్రతినిధులు ఆయనకు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు బొల్లోజు రవి, ట్రెజరర్ చిలుకూరి అయ్యప్ప, డైరెక్టర్లు ప్రతాప్ రెడ్డి, నాగరాజు తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా డీజేహెచ్‌ఎస్ అధ్యక్షులు బొల్లోజు రవి మాట్లాడుతూ తెలంగాణ ఏర్పడిన తర్వాత హైదరాబాదులో మొదటగా డెక్కన్ జర్నలిస్ట్ హౌసింగ్ సొసైటీ ఏర్పడిందని పేర్కొన్నారు. హైదరాబాదులో పని చేసే జర్నలిస్టులు ఇంటి స్థలానికి నోచుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. జర్నలిస్టుల సమస్యలు, సంక్షేమంపై కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో పొందుపరచాలని కోరుతూ జర్నలిస్టుల అధ్యయన వేదిక ఆధ్వర్యంలో కాంగ్రెస్ మ్యానిఫెస్టో కమిటీ చైర్మెన్ శ్రీధర్‌బాబును కలిసి వినతిపత్రం సమర్పించారు. వేదిక అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వేణుగోపాల్‌రెడ్డి, సాధిక్, నాయకులు కె. శ్రీనివాస్‌రావు, జె వెంకటేశ్వర్లు, మధు, కోశాధికారి సురేష్, కంచరాజు తదితరులు ఉన్నారు.

ఓలా, ఉబర్ దోపిడీ భరించలేకున్నాం

- ప్యాసింజర్ల మద్దతు కోరుతూ బ్రోచర్ ఆవిష్కరణ



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

ఓలా, ఉబర్ సంస్థల తీరుతో క్యాబ్ యజమానులు, డ్రైవర్లు ఆర్థిక దోపిడీకి గురవుతున్నారని తెలంగాణ గిగ్ అండ్ ప్లాట్‌ఫాం వర్కర్స్ యూనియన్ (టీజీపీడబ్ల్యుయూ) వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు షేక్ సలావుద్దీన్ అన్నారు. ఈ దోపిడీని ప్యాసింజర్లకు తెలుపుతూ, వారి మద్దతు కోరుతూ రూపొందించిన ప్రత్యేక బ్రోచర్‌ను శనివారంనాడిక్కడ ఆవిష్కరించారు. ఈ బ్రోచర్లను క్యాబ్‌లో సీట్ల వెనుక ఉంచి, వాటిపై ప్యాసింజర్ల అభిప్రాయాలను ట్విట్టర్ వేదికగా వెల్లడించాలని కోరతామన్నారు. యాప్ ఆధారిత క్యాబ్ సర్వీసుల వల్ల దాదాపు పదివేల మంది నిరుద్యోగ డ్రైవర్లు నానా అవస్థలు పడుతున్నారని తెలిపారు. డ్రైవర్లకు కనీస వేతనం హామీ లేదనీ, పెట్రోల్, డీజిల్ రేట్లు పెరిగినప్పుడు ప్రోత్సాహకాలను తగ్గిస్తున్నారనీ, డ్రైవింగ్ నిర్వహణ ఖర్చులు, ప్రమాదబీమా వంటి ఎలాంటి రక్షణ చర్యలు యాప్ ఆధారిత కార్పొరేట్ సంస్థలు ఇవ్వట్లేదని వివరించారు. దీనిపై ఆక్స్‌ఫర్డ్‌కు చెందిన ఫెయిర్‌వర్క్ అనే సంస్థ 2020లో చేసిన అధ్యయనం వివరాలను ఈ బ్రోచర్లలో పొందుపర్చామన్నారు.

వాచాతి గ్రామ వీర మహిళలకు జేజేలు

- ఆ పోరాటం దేశానికే స్ఫూర్తిదాయకం
- మద్రాస్ హైకోర్టు తీర్పును అమలు చేయాలి : అభినందన కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకుల డిమాండ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్



తమిళనాడులోని ధర్మపురం జిల్లా వాచాతి గ్రామ గిరిజన మహిళల పోరాట విజయానికి ప్రజాసంఘాల నాయకులు జేజేలు చెప్పారు. 31 ఏండ్లపాటు సాగిన ఆ పోరాటం దేశానికే స్ఫూర్తిదాయకమని అభివర్ణించారు. మహిళలకు అనుకూలంగా మద్రాస్ హైకోర్టు ఇచ్చిన తీర్పును తమిళనాడు ప్రభుత్వం అమలు చేయాలని డిమాండ్ చేశారు. శనివారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రం వద్ద తెలంగాణ రైతుసంఘం, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం, కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం, ఐద్వా, తెలంగాణ గిరిజన సంఘం, తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో అభినందన ప్రదర్శన కార్యక్రమాన్ని నిర్వహించారు. 'పోరాడదాం వాచాతి గ్రామ మహిళల స్ఫూర్తితో, కొనసాగిద్దాం వాచాతి గ్రామ మహిళల పోరాట స్ఫూర్తిని, మద్రాస్ హైకోర్టు తీర్పును అమలు చేయాలి'అంటూ నినాదాలు చేశారు. తెలంగాణ రైతుసంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి సాగర్, తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ శ్రీరాంనాయక్, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ వెంకట్రాములు, కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి స్కైలాబ్‌బాబు, ఐద్వా రాష్ట్ర అధ్యక్షులు ఆర్ అరుణజ్యోతి మాట్లాడుతూ వాచాతి గ్రామంలో గత 31 ఏండ్ల క్రితం రెవెన్యూ, అటవీ అధికారులు, పోలీసులు కలిసి ఆ గ్రామం మీద దాడి చేసి 18 మంది మహిళలపై సామూహికంగా లైంగిక దాడికి పాల్పడ్డారని చెప్పారు. ఈ సంఘటనలో మద్రాసు హైకోర్టు దోషులను కఠినంగా శిక్షించడంతోపాటు లైంగిక దాడి బాధిత కుటుంబాలకు రూ.10 లక్షల నష్టపరిహారం, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలంటూ ఈ ఏడాది సెప్టెంబర్ 29న తీర్పునిచ్చిందని గుర్తు చేశారు. సుదీర్ఘ కాలంపాటు వీరోచితంగా పోరాడి న్యాయస్థానంలో విజయం సాధించిన వీర మహిళలకు జేజేలు చెప్పారు. ఈ విజయం దేశంలోని దళితులు, గిరిజనులు, పేద వర్గాలపై దాడులు, లైంగిక దాడులు చేసే వారికి ఒక హెచ్చరిక అని అన్నారు. గిరిజన ప్రాంతాల్లోని అటవీ సంపదను బడా కార్పొరేట్లకు కట్టబెడుతూ అక్కడున్న గిరిజనులను అడవుల నుంచి గెంటేసే ప్రయత్నాలు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం చేస్తున్నదని విమర్శించారు. రాష్ట్రంలోనూ గిరిజన ప్రాంతాల్లో అటవీ భూములను, సంపదను కాపాడుకునేందుకు పోరాటం చేస్తున్న గిరిజనులు, పేదలపై అటవీ అధికారులు, పోలీసులు దాడులు చేస్తూ భయభ్రాంతులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అక్రమ కేసులు పెట్టి జైళ్లకు పంపి నిర్బంధాన్ని ప్రయోగిస్తున్నారని చెప్పారు. వారికి తగిన బుద్ధి చెప్పాలని హెచ్చరించారు. అమాయక ప్రజలపై ప్రభుత్వాల అండతో అరాచకాలకు పాల్పడే శక్తులకు మద్రాసు హైకోర్టు తీర్పు ఒక చెంపపెట్టని అన్నారు. అమాయక గిరిజనులపై అటవీ, పోలీసు, రెవెన్యూ అధికారులు సాగించే దాడులు, నిర్బంధాలకు హెచ్చరిక లాంటిదన్నారు. 31 ఏండ్లపాటు చారిత్రాత్మక పోరాటంలో బాధిత ప్రజలకు అండగా నిలిచిన తమిళనాడు రైతు, ట్రైబల్ అసోసియేషన్, ఐద్వా, వ్యవసాయ కార్మిక సంఘం, ఇతర ప్రజా సంఘాలకు వారు కృతజ్ఞతలు చెప్పారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతుసంఘం నాయకులు సారంపల్లి మల్లారెడ్డి, అరిబండి ప్రసాదరావు, మూడు శోభన్ తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఉపాధ్యక్షులు బి ప్రసాద్, తెలంగాణ గిరిజన సంఘం అధ్యక్షులు ఎం ధర్మానాయక్, ఐద్వా రాష్ట్ర ఉపాధ్యక్షులు కెఎన్ ఆశాలత, కేవీపీఎస్ నాయకులు బి సుబ్బారావు, బాలపీర్, ఎం ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ, బీఆర్ఎస్, ఎంఐఎంలు ఒక్కటే

- సీఎం అవినీతిపరుడంటూ చర్యలు తీసుకోరు?
- ఎంఐఎం అధినేతను నిఘా సంస్థలు ముట్టుకోవు : ప్రజా సంఘాల మ్యానిఫెస్టోల విడుదల సందర్భంగా జస్టిస్ చంద్రకుమార్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్



బీజేపీ, బీఆర్ఎస్, ఎంఐఎం పార్టీలు ఒక్కటేనని జస్టిస్ చంద్రకుమార్ విమర్శించారు. తెలంగాణ సమాఖ్య (సంఘాలు) ఆర్గనైజింగ్ కన్వీనర్ కరుణాకర్ దేశాయి అధ్యక్షతన శనివారం హైదరాబాద్ బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన తెలంగాణ సమాఖ్య సంఘాల ఉమ్మడి మ్యానిఫెస్టో, ప్రజా సంఘాల మ్యానిఫెస్టోల విడుదల కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాని మోడీ, కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షాలు పదే పదే సీఎం కేసీఆర్‌కు కాళేశ్వరం ఏటీఎంలాగా మారిందని విమర్శలు చేస్తారే తప్ప...చర్యలెందుకు తీసుకోరని ప్రశ్నించారు. ఎంఐఎం అధినేత ఓవైసీ మైనార్టీల భద్రత, సంక్షేమం కోసం ఉన్నానంటూ చెప్పుకుంటూ వివిధ రాష్ట్రాల్లో స్వల్ప మెజారిటీతో బీజేపీ ఓడిపోయే స్థానాల్లో కమలాన్ని గెలిపించేందుకు అక్కడికెళుతుంటారని విమర్శించారు. ఇప్పటి వరకు ఎంఐఎం పార్టీ పోటీ చేసిన వివిధ రాష్ట్రాల నియోజకవర్గాలను పూర్తిగా పరిశీలిస్తే ఇదే విషయం స్పష్టమైందని తెలిపారు. ఈ మూడు పార్టీలు బయటికి మాత్రమే విమర్శలు చేసుకుంటూ, లోపల లోపాయికారీ ఒప్పందాలు చేసుకున్నాయని చెప్పారు. మతోన్మాద బీజేపీని ఓడించేందుకు తాము ప్రయత్నిస్తున్నట్టు తెలిపారు. ఆ పార్టీకి సహకరిస్తున్న బీఆర్ఎస్, ఎంఐఎంలను కూడా ఓడించేందుకు ఓట్ల చీలిక జరగకుండా ప్రజాసంఘాలు ప్రయత్నించాలని ఆయన సూచించారు. బీఆర్ఎస్ అభ్యర్థులకు ప్రత్యామ్నాయంగా నిలబడ్డ ప్రజాస్వామిక అభ్యర్థులను, వారూ లేని చోట కాంగ్రెస్‌ను గెలిపించాలని పిలుపునిచ్చారు. బీజేపీ మనుష్యుల మధ్య విద్వేషాలు పెంచుతూ, ప్రజాస్వామ్యాన్ని ప్రమాదంలో పడేసిందని విమర్శించారు. పెట్రోల్, డీజిల్‌తో పాటు నిత్యావసర వస్తువుల ధరలు పెంచేసిందనీ, ప్రభుత్వ రంగ సంస్థలను కారుచౌకగా అమ్మేస్తున్నదనీ, బ్యాంకుల నుంచి లక్షల కోట్ల రూపాయలు తీసుకుని ఎగవేసిన వారిని వదిలేసిందనీ, నల్లడబ్బు బయటికి వెలికి తీయలేదని విమర్శించారు. ప్రొఫెసర్ కోదండరామ్ మాట్లా డుతూ పాలకులతో పాటు పాలనా విధానం కూడా మారాలని ఆకాంక్షించారు. రాష్ట్రంలో ఆర్థిక దోపిడీతో ప్రభుత్వ ఆదాయం తగ్గిందన్నారు. విచ్చలవిడి జరిమానాలతో ప్రజలను చితకబాదుతున్నారని తెలిపారు. అప్పులు తెచ్చినా కాళేశ్వరం పూర్తి చేయలేదనీ, దక్షిణ తెలంగాణ పెండింగ్ సాగునీటి ప్రాజెక్టులను పక్కన పడేశారని విమర్శించారు. ప్రజా సంఘాల కార్యక్రమాలకు ఎన్నికల కోడ్ అడ్డు కాదని స్పష్టం చేశారు. 40 రోజులు ప్రజల మధ్యకు ఐక్యంగా వెళ్లి బీఆర్ఎస్ ప్రభుత్వంతో జరిగిన నష్టాన్ని వివరించాలని సూచించారు. సుప్రీంకోర్టు న్యాయవాది నిరూప్ రెడ్డి మాట్లాడుతూ కర్నాటకలో ప్రజా సంఘాలు ప్రత్యామ్నాయ పాలన రావడానికి చేసిన ప్రయత్నాలను వివరించారు. ప్రధాని మోడీ ప్రచారం చేసిన ప్రతి నియోజకవర్గంలో బీజేపీ ఓడిపోయిందని గుర్తుచేశారు. రాష్ట్రంలో ప్రజలు కోరుకుంటున్న ప్రత్యామ్నాయం రావడానికి ఇక్కడి ప్రజా సంఘాల అలాంటి క్రియాశీలక పాత్ర పోషించాలని సూచించారు. ఈ కార్యక్రమలంలో సీనియర్ జర్నలిస్ట్ పాశం యాదగిరి, కాంగ్రెస్ పార్టీ నాయకులు రవళి రెడ్డి తదితరులు పాల్గొన్నారు. తెలంగాణ సమాఖ్య ఉమ్మడి మ్యానిఫెస్టో 28 ప్రజాసంఘాల మ్యానిఫెస్టోలను విడుదల చేశారు.

అమరుల త్యాగాల స్ఫూర్తి

- సైబరాబాద్ సీపీ స్టీఫెన్ రవీంద్ర
- సైబరాబాద్ కమిషరేట్‌లో పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం

నవతెలంగాణ-మియాపూర్



పోలీసు అమరుల త్యాగాలను స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగాలని సైబరాబాద్ సీపీ స్టీఫెన్ రవీంద్ర అన్నారు. శనివారం సైబరాబాద్ కమిషరేట్‌లో పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం నిర్వహించారు. ముందుగా అమరవీరుల స్మారక స్థూపానికి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. పోలీసులు జాతి సేవకు పునరంకితం కావాలన్నారు. విధి నిర్వహణలో అసువులుబాసిన పోలీసుల త్యాగాలను నిత్యం స్మరించుకోవడం అందరి బాధ్యత అన్నారు. దేశ భద్రత చూసుకునే బాధ్యత సైనికులదైతే, దేశంలోని అంతర్గత భద్రత చూసుకునే బాధ్యత పోలీసులదని చెప్పారు. సమాజంలో ఎవరికి ఏ కష్టం, నష్టం, వచ్చినా ముందుగా గుర్తుకు వచ్చేది పోలీసేనని అన్నారు. ప్రపంచమంతా నిద్రలో ఉంటే పోలీసులు ప్రజారక్షణ, శాంతి పరిరక్షణ కోసం నిరంతరం ప్రాణ త్యాగానికైనా సిద్ధంగా ఉండి విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు. ప్రజల కోసం జీవించి, మరణించే పోలీసులకి.. ప్రాణాలని పణంగా పెట్టి ప్రజల కోసం చేసిన త్యాగానికి గౌరవం చూపించడం మనందరి బాధ్యత అన్నారు. పోలీసులు విధి నిర్వహణలో క్రమశిక్షణతో పని చేయాలన్నారు. ఈ ఏడాది దేశవ్యాప్తంగా దాదాపు 189 మంది పోలీసులు విధి నిర్వహణలో అమరులయ్యారని తెలిపారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సైబరాబాద్ అడిషనల్ సీపీ అడ్మిన్ అవినాష్ మహంతి, సైబరాబాద్ ట్రాఫిక్ జాయింట్ సీపీ నారాయణ్‌నాయక్, డీసీపీ అడ్మిన్ రవిచందన్‌రెడ్డి, బాలానగర్ డీసీపీ శ్రీనివాసరావు, మాదాపూర్ డీసీపీ సందీప్, శంషాబాద్ డీసీపీ నారాయణరెడ్డి, రాజేంద్రనగర్ డీసీపీ జగదీశ్వర్‌రెడ్డి, మేడ్చల్ డీసీపీ శబరీష్, డీసీపీ రోడ్ సేఫ్టీ ఎల్‌సి నాయక్, సీఏఆర్ హెడ్ క్వార్టర్స్ ఏడీసీపీ షమీర్, సీసీడబ్ల్యు ఏడీసీపీ శ్రీనివాస్ రావు, ఏడీసీపీలు, ఏసీపీలు, సీఏఓ అకౌంట్స్ చంద్రకళ, సీఏఓ అడ్మిన్ గీత, ఇన్‌స్పెక్టర్లు, ఆర్ఐలు పాల్గొన్నారు.

జూనియర్, రికార్డు అసిస్టెంటు, ఆఫీసు సబార్డినేటర్లుగా గుర్తించండి

- వీఆర్ఏలకు ఐడీ కార్డులను కేటాయించండి : ట్రెసా



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

హైకోర్టులో కేసు ముగిసినందున వీఆర్ఏలకు జూనియర్ అసిస్టెంట్లు, రికార్డు అసిస్టెంట్లు, ఆఫీసు సబార్డినేట్లుగా ఐడీ కార్డులు కేటాయించాలనీ, వెంటనే జీతాలు చెల్లించాలని ట్రెసా రాష్ట్ర అధ్యక్షులు వంగ రవీందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి కె.గౌతమ్ కుమార్ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. శనివారం హైదరాబాద్‌లో ఈ మేరకు సీసీఎల్ఏ, రెవెన్యూ ముఖ్య కార్యదర్శి నవీన్ మిట్టల్‌ను వారు కలిశారు. మిట్టల్ సానుకూలంగా స్పందించారనీ, తగు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారని వారు తెలిపారు. కార్యక్రమంలో ట్రెసా ఉపాధ్యక్షులు బాణాల రాంరెడ్డి, రమేష్ పాక, నిజామాబాద్ జిల్లా అధ్యక్షులు రమన్‌రెడ్డి, మేడ్చల్ జిల్లా అధ్యక్షులు సుధాకర్, జగిత్యాల్ జిల్లా అధ్యక్షులు వకీల్, వీఆర్ఏలు, ఆఫీస్ సభార్డినేట్లు తదితరులు పాల్గొన్నారు.

లండన్‌లో ఆరుగ్యారంటీల పథకాలపై ఎన్ఆర్ఐల ప్రచారం

- టీపీసీసీ ఎన్నారై సెల్ కన్వీనర్ గంప వేణుగోపాల్

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

ఆరు గ్యారంటీ పథకాలపై నూరు గ్యారంటీ సీట్ల లక్ష్యంతో లండన్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నట్టు టీపీసీసీ ఎన్నారై సెల్ యూకే కన్వీనర్ గంప వేణుగోపాల్ తెలిపారు. టీపీసీసీ మ్యానిఫెస్టో కమిటీ చైర్మెన్, మంథని ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు ఈమేరకు శనివారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఎన్నికల ప్రచారానికి సంబంధించి ఎన్నారైలకు మార్గదర్శనం చేశారు. యువత, మహిళ, రైతులకు కాంగ్రెస్ ఇవ్వబోయే వివిధ సంక్షేమ పథకాలను వివరించారు. విద్యార్థుల కోసం రూ.5 లక్షల ఏటీఎం కార్డు, రూ.10 లక్షల రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ప్రభుత్వంలోకి రాగానే మెగా డీఎస్సీ ఏర్పాటు చేసి, ఏకకాలంలో భారీ సంఖ్యలో ఉద్యోగ భర్తీ నింపడం వంటి పథకాలు వివరించారు. గల్ఫ్ సంక్షేమం బోర్డు, ఎన్నారై సెల్ ఏర్పాటుపై మ్యానిఫెస్టోలో పొందుపరిచే అంశాన్ని పరిశీలిస్తామని తెలిపారు. రాబోయే ఎన్నికల్లో ఆరు గ్యారంటీ పథకాలతో ప్రజల్లోకి వెళ్లి 100 సీట్లు గెలిచే లక్ష్యంతో ముందుకు వెళ్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కో కన్వీనర్లు రంగుల సుధాకర్ గౌడ్, రాకేష్ బిక్కుమండ్ల, మంగళారపు శ్రీధర్ అడ్వైజరరీ బోర్డు సభ్యులు గంగసాని ప్రవీణ్ రెడ్డి, కార్యదర్శి శ్రీధర్ నీలా, మహిళా విభాగం కో ఆర్డినేటర్ మేరీ, టీపీసీసీ ఎన్నారై సెల్ సభ్యులు శ్రీనివాస్, అజయ్, కళ్యాణ్, సయ్యద్, సాయితోపాటు తదితరులు 50 మంది సభ్యులు పాల్గొన్నారు.

భూ సంస్కరణలను విస్మరించిన ఎన్నికల మ్యానిఫెస్టోలు

- తెలంగాణ దళిత సంఘాల జేఏసీ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలో భూమిలేని 56 శాతం దళితులకు భూ పంపిణీ చెస్తామని ఎ ఒక్క రాజకీయ పార్టీ హామి ఇవ్వకపోవడం సిగ్గుచేటని తెలంగాణ దళిత సంఘాల జేఏసీ శనివారం ఒక ప్రకటనలో విమర్శించారు. హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రం లో డీబీఎఫ్, డీబీఎస్‌యు, పీఎంసీల అధ్వర్యంలో '2023 అసెంబ్లీ ఎన్నికలు దళితుల ఎజెండా' పై రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి పి.శంకర్, పీఎంసీ రాష్ట్ర కన్వీనర్ ఎస్.శివలింగం, డీబీఎస్‌యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి. నర్సింహ , సీనియర్ సామాజిక కార్యకర్త రాంచంద్రయ్య, డీబీఎఫ్ రాష్ర కార్యదర్శి పులి కల్పన మాట్లాడుతూ భూమి దళితులకు ఆత్మగౌరవం అందిస్తున్నదని తెలిపారు. నిర్లక్ష్యానికి గురవుతున్న దళితుల సమగ్ర అభివృద్ధికి రాజకీయ పార్టీలు ఎన్నికల మ్యానిపెస్టోల్లో చేర్చకపోవడం తగదని పేర్కొన్నారు. ప్రజా ప్రయోజనాల పేరుతో పేదలకు గతంలో పంపిణీ చేసిన భూములను తిరిగి స్వాధీనం చేసుకోబోమని పార్టీలు ప్రకటించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో దాదాపు పది లక్షలకు పైగా వున్న కౌలు రైతులకు వ్యవసాయ పథకాలను, రైతుబంధును అమలు చేస్తామని హమి ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. భూ సిలింగ్ పరిమితిని పదెకరాలకు తగ్గించాలనీ, భూ హక్కులను హరిస్తున్న ధరణిలో మార్పులు చేయాలని డిమాండ్ చేశారు. పహణీలో కబ్జాదారు కాలాన్ని తెలంగాణా ప్రభుత్వం తొలగించినందున తిరిగి అనుభవదారు కాలాన్ని తిరిగి చేర్చాలని కోరారు. భూ సంస్కరణలను, భూ అభివృద్ధి పథకాలను అమలు చేస్తామని పార్టీలు హామి ఇవ్వాలని డిమాండ్ చేశారు.

ప్రయివేటుమెడికల్ కాలేజీలు ఉపకారవేతనాలు చెల్లించాలి

- డాక్టర్ రాజీవ్ నాయక్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్



రాష్ట్రంలో ప్రయివేటు మెడికల్ కాలేజీలు ఇంటర్న్లు, పోస్ట్ గ్రాడ్యుయేట్ విద్యార్థులకు వెంటనే ఉపకారవేతనాలు చెల్లించాలని తెలంగాణ జూనియర్ డాక్టర్స్ అసోసియేషన్ (టీజూడా) సలహాదారు డాక్టర్ ఎం.రాజీవ్ నాయక్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. పోస్ట్ గ్రాడ్యుయేట్ మెడికల్ ఎడ్యుకేషన్ రెగ్యులేషన్, 2000 రెగ్యులేషన్ 13 ప్రకారం ప్రభుత్వ మెడికల్ కాలేజీల మాదిరిగా ప్రయివేటు మెడికల్ కాలేజీలు ఉపకారవేతనం ఇవ్వాల్సిందేనని స్పష్టం చేశారు. సుప్రీంకోర్టు కూడా ఇది వరకే ఉత్తర్వులు ఇచ్చిందని గుర్తుచేశారు. రాష్ట్రంలో వేతనం ఇవ్వకుండా పని చేయించుకోవడమంటే వెట్టిచాకిరి కిందికే వస్తుందని హెచ్చరించారు. ఈ విషయంపై నేషనల్ మెడికల్ కమిషన్ (ఎన్ఎంసీ)కి ఫిర్యాదు చేయనున్నట్టు తెలిపారు.


కాంట్రాక్ట్ ఏఎన్ఎంల ఎరియర్స్ చెల్లంచాలి- టీయుఎంహెచ్ఇయూ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కాంట్రాక్ట్ ఏఎన్ఎంల ఎరియర్స్ చెల్లించాలని తెలంగాణ యునైటెడ్ మెడికల్, హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ (టీయుఎంహెచ్ఇయూ) డిమాండ్ చేసింది. ఈ మేరకు శనివారం హైదరాబాద్‌లో యూనియన్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు భూపాల్, రాష్ట్ర అధ్యక్షులు ఎండీ ఫసియొద్దీన్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.యాదానాయక్ లు డీహెచ్ కు వినతిపత్రం సమర్పించారు. ఈ ఏడాది సెప్టెంబర్ 2న కాంట్రాక్ట్ ఏఎన్ఎంలు సమ్మె విరమించిన సందర్భంగా సమ్మె కాలపు వేతనాలు, పీఆర్సీ ఎరియర్స్ చెల్లిస్తామని ప్రభుత్వం తరపున డీహెచ్ ఇచ్చిన హామీని వారు గుర్తుచేశారు. ఈసీ ఏఎన్ఎం, హెచ్ఆర్డీ ఏఎన్ఎంలకు చెల్లించలేదనీ, వాటిని వెంటనే చెల్లించాలని కోరారు. పీఆర్సీ ఎరియర్స్ రూ.33.54 కోట్లు చెల్లించేందుకు అంగీకరించారనీ, సంబంధిత మంత్రిని కలిస్తే వెంటనే విడుదల చేస్తామని చెప్పినప్పటికీ రాలేదని తెలిపారు. దసరా పండుగ నేపథ్యంలో వాటిని వెంటనే విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. కాంట్రాక్ట్ ఏఎన్ఎంల సమస్యలపై వేసిన కమిటీ ప్రభుత్వానికి నివేదిక పంపే ముందు యూనియన్లతో సమావేశం ఏర్పాటు చేస్తామని చెప్పిన విషయాన్ని గుర్తుచేశారు. ఈ నిర్ణయాలు ఎన్నికల నోటిఫికేషన్‌కు ముందు ప్రభుత్వం తీసుకున్న చర్యలు గనుక ఎన్నికల కోడ్‌తో సంబంధం లేకుండా వెంటనే పూర్తి చేయాలని వారు కోరారు.

సంపాదకీయం

దేశంలో రైలు మొహం చూడని ప్రాంతాలు ఎన్నో వున్నాయి. బస్సు సౌకర్యం లేని గ్రామాలు వేలల్లో ఉన్నాయి. పురిటిలోనే చనిపోయే బిడ్డలు, రక్తహీనతతో బతికే మహిళలు కోట్లల్లో ఉన్నారు. దేశంలోని చాలా ప్రాంతాల్లో నేటికీ ఆడపిల్లలకు చదువు నిషిద్ధం. భ్రూణ హత్యలు ఇప్పటికీ సాగుతున్నాయి. వరకట్న పీడితులు కుల, మతాలకతీతంగా కోట్లల్లో ఉన్నారు. పైగా 'సతీ సహగమనం ఉండాల్సిందే'నని నేటి ఉత్తర భారత దేశ బీజేపీ నాయకులు వాదిస్తున్నారు. 'అంటరానితనం నిషేధం' అనే చట్టాన్నే రద్దు చేయమని వి.హెచ్.పి. గతంలోనే డిమాండు చేసిన విషయం మనం మరువరాదు.



థాంక్స్ మోడీజీ!

చందమామ రావే, జాబిల్లి రావే! అంటూ చిన్న పిల్లలకు గోరు ముద్దలు తినిపిస్తూ పాడే పాట తెలుగు వారందరికీ చిరపరిచయమే. ఇన్నేండ్లుగా పిలిచినా సదరు జాబిల్లి రాకపోయే సరికి మనల్నే అక్కడికి పంపే ఏర్పాటు చేస్తున్నారు భారత ప్రధాని. అందుకు ఆయనకు థాంక్స్ చెప్పాలి కదా! కొండ మహ్మద్ గారి దగ్గరికి రాకపోతే మహ్మద్ గారే కొండ దగ్గరికి వెళ్ళారని కదా చెప్తారు. 2035 నాటికి అంతరిక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేస్తారట! 2040 నాటికి తొలి భారతీయుణ్ణి చంద్రుడిపైకి పంపాలని ప్రధాని శాస్త్రవేత్తలకు దిశానిర్దేశం చేశారని మీడియాలో వచ్చింది. శుక్రగ్రహం, అంగారక గ్రహాల్ని కూడా శోధించే పనిలోకి మన శాస్త్రవేత్తలు ఉపక్రమించాలని మోడీ డైరెక్షనట! దానికి సందేహమేముంది? మన సైంటిస్టులు అంతటి ఘటికులే! 'భక్తులు' పారవశ్యంతో ఆనందతాండవం మొదలుపెట్టారు. కొందరు మధ్య తరగతి ఓటర్లు చొంగ కార్చడం కూడా మొదలైంది.

సిద్దిపేట నుండి మనోహరాబాద్‌కు రైలేసినంత తేలిగ్గా, వర్చువల్‌గా దానికి జండా ఊపినంత సులువుగా చంద్రుడిపై మానవ కాపురాలు ఏర్పాటు చేసినట్లు, దాన్లో కొందరు వెంచర్లేసినట్లు ప్రధానికి కలలొస్తున్నాయేమో! పూలల్లోంచి తేనే మోసుకొచ్చి బ్యాంకు లాకర్లలో పోస్తున్నట్లు ఊహా లోకాల్లో విహరిస్తున్నారు మరికొందరు. 'రసపట్టులో తర్కం కూడదని' మాయాబజార్‌లో శ్రీకృష్ణుడు రుక్మిణితో అన్న మాటలు ప్రస్తుత పరిస్థితికి వర్తింపజేస్తే ఎన్నికల రసకందాయంలో ఉండగా మోడీ బృందంతో జనం తర్కించరాదని తాత్పర్యం.

ప్రపంచంలోకి ఒకసారి తొంగి చూద్దాం. అమెరికా దేశానికి చెందిన శత సహస్ర కోటీశ్వరుడు ఎలాన్‌మస్క్ ప్రారంభించిన స్పేస్ - ఎక్స్ అంతరిక్షంలో ఎనిమిది రోజులు తిరిగి రావడానికి అయ్యే ఖర్చు ఒక మనిషికి రూ.415 లక్షల కోట్లు. భూమి నుండి వంద కిలోమీటర్ల దూరానికి అయ్యే ఖర్చది. చంద్రుడు భూమి నుండి 3,84,400 కి.మీ. దూరం. అక్కడికెళ్ళడానికి ఖర్చెంతవుంది? అంత డబ్బు పెట్టగలిగే వారు దేశంలో ఎందరుంటారు? అసలు వెళ్ళే వారెవరు? స్పేస్ ఎక్స్‌ను 2023లో వందసార్లు పంపాలనుకుంటే అక్టోబర్ 18 నాటికి 73 సార్లే పంపగలిగారట అమెరికాలో. మిగిలిన 2 నెలల్లో పాతిక సార్లు పంపగలరా అనే సందేహం ఉంది. ఇప్పటికే ఎలాన్‌మస్క్, జెఫ్ బేజోస్ వంటి వాళ్ళు ఒక చెక్కరేసి వచ్చారు. ఇటీవల సముద్ర గర్భంలో ఏమైనా సంపద నిక్షిప్తమై ఉందా అని పరిశీలించేందుకు 'ఓషన్‌గేట్' పేర నలుగురు కూచునే బుల్లి సబ్ మెరీన్ తయారు చేశారు అమెరికన్లు. దాన్లో ప్రయాణించి సముద్ర గర్భ సంపద శోధించాలంటే 2,50,000 అమెరికన్ డాలర్లు... అంటే 2 కోట్ల ఐదు లక్షల యాభై వేల రూపాయలు. నలుగురెక్కాల్సిన దాన్లో ఇటీవల ఒకడ్ని కింద కూచోబెట్టి సముద్రంలోకి దింపితే సముద్ర గర్భంలో అది లోనికి పేలిపోయింది (ఇంప్లోడ్). అందులో ఎక్కిన శతకోటీశ్వర్లు కలికానికి కూడా కనపబడకుండా పోయారు. అమెరికా ప్రభుత్వం ప్రస్తుతం ఆ మిషన్‌ను ఆపేసింది. అత్యంత ధనిక దేశంలో కనపడే దృశ్యాలివి.

మన దేశంలో బాగా సంపన్నులు నివసించే అహ్మదాబాద్ - ముంబైల మధ్య బులెట్ ట్రెయిన్ ప్రాజెక్టుకు 2015లోనే తెరలేపాడు మోడీ సాబ్. ఇదిగో... అదిగో అన్న బులెట్ ట్రెయిన్ ఇంకా పురిటినొప్పుల దశలోనే ఉంది. ప్రయాణానికి పట్టే సమయం, అయ్యే ఖర్చు (అప్పటికున్న అంచనాల ప్రకారం) చూసి విమానంలో పోవచ్చు కదా అనే చర్చ ప్రారంభమైంది. మన ప్రధాని తన వైఫల్యాలను కనపడనీయరు కాబట్టే దేశమంతా వందేభారత్ రైళ్ళను ఉరుకులు పెట్టిస్తున్నాడు. మధ్య తరగతి సెల్ఫీలు, సోషల్ మీడియాలో పోస్టులు షరా మామూలే! పాలకుల కాళ్ళు, కళ్ళు నేలపై ఉంటే పాలన సవ్యంగా ఉంటుంది.

దేశంలో రైలు మొహం చూడని ప్రాంతాలు ఎన్నో వున్నాయి. బస్సు సౌకర్యం లేని గ్రామాలు వేలల్లో ఉన్నాయి. పురిటిలోనే చనిపోయే బిడ్డలు, రక్తహీనతతో బతికే మహిళలు కోట్లల్లో ఉన్నారు. దేశంలోని చాలా ప్రాంతాల్లో నేటికీ ఆడపిల్లలకు చదువు నిషిద్ధం. భ్రూణ హత్యలు ఇప్పటికీ సాగుతున్నాయి. వరకట్న పీడితులు కుల, మతాలకతీతంగా కోట్లల్లో ఉన్నారు. పైగా 'సతీ సహగమనం ఉండాల్సిందే'నని నేటి ఉత్తర భారత దేశ బీజేపీ నాయకులు వాదిస్తున్నారు. 'అంటరానితనం నిషేధం' అనే చట్టాన్నే రద్దు చేయమని వి.హెచ్.పి. గతంలోనే డిమాండు చేసిన విషయం మనం మరువరాదు. తాజా మానవాభివృద్ధి సూచికలో 191 దేశాల్లో మన దేశం 132 వ స్థానంలో ఉంది. రాకెట్లు, చంద్రునిపై నివాసం సంగతి సరే, ముందు ప్రభుత్వాలు వీటిని సరి చేయాలి. లేదా ఆ పాలకుల్ని మనం సరిచేయాలి.

చంద్రబాబు కేసులు, తెలుగు రాష్ట్రాల రాజకీయాలు



తెలకపల్లి రవి

ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు ఫైబర్‌నెట్ స్కాం కేసులో దాఖలు చేసుకున్న ముందస్తు బెయిలు పిటిషన్‌ను సుప్రీం కోర్టు నవంబర్ తొమ్మిదో తేదీకి వాయిదా వేయడం వూహించిన పరిణామమే. స్పష్టంగా తెలియకపోయినా ఇది త్వరగా ఒక కొలిక్కి రాబోదని మాత్రం అందరూ భావించారు. ఇప్పటి వరకూ ఎసిబి కోర్టు హైకోర్టు సుప్రీంకోర్టు మూడు చోట్ల కూడా న్యాయ మూర్తుల ఆదేశాలు స్పందనలూ ఆ విధమైన సంకేతాలిస్తున్నాయి. వాస్తవానికి మొదట్లోనైతే ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి అరెస్టు తర్వాత మాట్లాడుతూ కాస్త ముందు వెనకగా బెయిలు వచ్చేస్తుందన్నట్టే వ్యాఖ్యానించారు. సిద్ధార్థలూథ్రా వంటి ప్రసిద్ధ అడ్వకేట్ ఎసిబి కోర్టుకు వచ్చి వాదించాక ఇక తిరుగుండదనీ చాలామంది అనుకున్నారు. జగన్ ప్రభుత్వం ఆయన్ను పదమూడు రోజులైనా కస్టడీలో వుంచాలని కక్షగా వుందని అది తీరిపోతే పర్వాలేదని లెక్కలేశారు. అయితే ఆ అంచనాలేవీ ఆచరణలో నిజం కాలేదు. ఈ క్షణంలోనైతే చంద్రబాబుపై వున్న కేసుల భవిష్యత్తు అనిశ్చితంగానే వుంది. నవంబరు 9న కూడా విచారణ జరిగేది ఫైబర్‌నెట్ కేసులో ముందస్తు బెయిలు గురించే. 8వ తేదీన క్వాష్ తీర్పు వస్తుందనే అంచనా వుంది. మేము రిజర్వు చేసిన ఆ తీర్పు వచ్చాక ఈ ఫైబర్ కేసు తీసుకుంటే బావుంటుందని జస్టిస్ అనిరుధ్ బోస్ అనడం కూడా అందుకు అవకాశమిస్తున్నది. ఏమైనా చంద్రబాబు అరెస్టు విచారణల తీరుతెన్నులు ప్రధానంగా ఏపీ రాజకీయాల్లోనే గాక తెలంగాణలోనూ ఒకింత చర్చనీయంగా మారాయి.

రెండు వైఖరులు

ప్రాథమికంగా ఈ విషయంలో రెండు వైఖరులు వున్నాయి. ఏదైనా ఆరోపణ వుంటే మామూలుగా అరెస్టు చేసి విచారించవచ్చు గానీ రాజకీయ కక్షతో రాత్రిపూట ఎక్కడో అరెస్టు చేయడం, వరుస కేసుల ఉచ్చు పన్నడం సరికాదన్న అభిప్రాయం అందరిలోనూ వుంది. దేశ వ్యాపితంగానూ ఎక్కువ మంది ఇదే భావం వెలిబుచ్చారు. అసలు తప్పు జరగనేలేదు అన్నీ అభూత కల్పనలేనన్న తెలుగుదేశం వాదన మరొకటి. రాజకీయాభిప్రాయాలు ఎలా వున్నా ఎసిబి కోర్టు నుంచి సుప్రీంకోర్టు వరకూ విచారణ ప్రక్రియలో పాలుపంచుకున్న కొద్ది తీర్పులను బట్టి నిర్ణయాలు వుండే పరిస్థితి సహజంగా వస్తుంది. ఎందుకంటే కేసులు కోర్టుల్లో వున్నప్పుడు నిర్దోషిగా విడుదల చేయాలనే నినాదం ఇతరుల నుంచి వచ్చే అవకాశం వుండదు. గతంలో జగన్ పైన వున్న కేసులతో పోల్చి చూడడం కూడా రాజకీయ విమర్శల వరకూ చెల్లుతుంది గాని చట్టపరంగా నిలిచేది కాదు. మరో వైపున జైలు అధికారుల తీరు, చంద్రబాబు ఆరోగ్యంపై ఫిర్యాదులు వీటిని ప్రజాస్వామిక ప్రమాణాలతోనూ మానవీయంగానూ పరిశీలించి చక్కదిద్దడం అవసరమవుతుంది. ఎసిబి కోర్టు వైద్య నివేదికలు కోరడం, ములాఖత్‌లను పెంచడం వంటివి ఆ విధంగా వచ్చిన చర్యలే. ఇప్పుడు హైకోర్టు వెకేషన్ బెంచ్ ఆయన ఆరోగ్య సంబంధమైన వాదనలను విచారించే అవకాశముంది. ఇవన్నీ కోర్టుల్లో జరుగుతుంటే బయట వైసీపీ నాయకులు మంత్రులు దాడి చేయడం మరో వైపున టీడీపీ నేతలు ఏ పొరపాటూ లేదని రక రకాలుగా వాదించడం ఆ రెండు పార్టీల తగాదాలో భాగమే. టీడీపీ నిరసనలను అడ్డుకోవడం ముందస్తుగా గృహ నిర్బంధాలు అరెస్టులు చేయడం ప్రజాస్వామిక పద్ధతి కానేకాదు.

తనను అరెస్టు చేస్తారని బహిరంగంగా చెబుతూ వచ్చిన చంద్రబాబు ముందస్తు కోసం ఎందుకు ప్రయత్నించలేదనే సందేహాలు, వాటికి చాలా సమాధానాలు వున్నాయి. క్రిమినల్ కేసు గనక బెయిలు రాదనే మాట ఒకటైతే సిఐడి పెట్టిన సెక్షన్లు కూడా ముందస్తుకు అవకాశమిచ్చేలా లేవని న్యాయ నిపుణులు కొందరు చెప్పారు. చంద్రబాబు లాయర్లు ఎసిబి కోర్టు కస్టడీ ఇచ్చాక కూడా బెయిల్ గాకుండా గృహ నిర్బంధం కోరారు. బెయిలు కోసం హైకోర్టుకు వెళ్లడం గాక క్వాష్ పిటిషన్ వేసి మొత్తంగా ఆయనను తప్పించాలని కోరారు. ప్రభుత్వ సేవకులపై చర్య ప్రారంభించే ముందు పై అధికారి అనుమతి తీసుకోవాలని చెప్పే సెక్షన్ 17ఎ అమలు చేయలేదనే పాయింటుపైనే వాదించారు సిద్ధార్థ లూథ్రా. హైకోర్టులో దాన్ని కొట్టివేశాక సుప్రీంకోర్టులోనూ అదే కొనసాగిస్తున్నారు. ఇందులో ఇతర బహుముఖ ప్రయోజనాలు వుండొచ్చు. దీనిపై ఇప్పటికే భిన్నాభిప్రాయాలు వ్యక్తమైనాయి. 2018లో స్కిల్ కేసు విచారణ ప్రారంభించే నాటికి 17ఎ లేదని, అసలు నేరాలు జరిగాయంటున్నది 2015-16 గనక అది అసలే వర్తించబోదని ప్రభుత్వ న్యాయవాది ముకుల్ రోహత్గీ చెప్పారు. 17ఎ కింద గవర్నర్ అనుమతి తీసుకోవడం అనేది నిజాయితీ పరుల కోసం ఏర్పాటు చేసిన ఒక ముందు జాగ్రత్త తప్ప అవినీతికి రక్షణ ఛత్రం కాదని ప్రభుత్వం తరపున తదితరులు వాదించారు. హైకోర్టులో దీనిపై క్వాష్‌ను కొట్టివేసిన జస్టిస్ శ్రీనివాసరెడ్డి కూడా అవినీతి చట్టం 17ఎ వర్తింపు ఎలా వున్నా ఇతర ఐపిసి సెక్షన్ కింద వున్న అభియోగాలైనా విచారించాలని చెప్పారు.

సుప్రీంలో వాదనలు

ప్రభుత్వాలు కక్ష సాధింపునకు పాల్పడకుండా నిరోధించడం కోసమే 17ఎ ఏర్పాటైందని సిద్ధార్థ లూథ్రా హరీష్ సాల్వే పలుసార్లు చెప్పారు. ముఖ్యమంత్రిగా చంద్రబాబు అధికార విధినిర్వహణలో భాగంగా చేసిన వాటిపై దర్యాప్తు చేసేప్పుడు గవర్నర్ అనుమతి తీసుకోలేదు గనక అరెస్టు, తర్వాత రిమాండు ఉత్తర్వు చెల్లవనీ అప్పుడు కేసు నిలవదనీ వారు వాదించారు. చంద్రబాబుకు సంబంధం లేదంటూనే ఆయన విధినిర్వహణలో భాగంగా చేశారని చెప్పడం ఎలా పొసుగుతుందని రోహత్గీ ఎదురు వాదన చేశారు. అవినీతి కేసులతో పాటు ఐపిసి సెక్షన్లు కూడా వున్నాయి గనక వాటి కోసమైనా ఎసిబి కోర్టు విచారించవలసి వుంటుందని హైకోర్టు చెప్పిన సంగతి గుర్తు చేశారు. ఈ విచారణ చంద్రబాబు ప్రభుత్వ హయాంలోనే కేంద్రం ప్రారంభించింది కనుక కక్షసాధింపు ఆరోపణ అర్థం లేదనీ ఆయన సమర్థించారు. (అది జిఎస్‌టి ఎగవేతకు సంబంధించిందే గానీ స్కిల్‌స్కామ్ కాదన్నది చంద్రబాబు లాయర్ల వాదన)17ఎ తో సమానమైన 6ఎ డిల్లీ స్పెషల్ పోలీస్ యాక్ట్(సిబిఐ) విషయంలో గతంలో సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు తమకు అనుకూలంగా వుందని రోహత్గీ ఉదహరించారు. 17 ఎ సవరణ చేసేప్పుడు ఇది గతకాలానికి కూడా వర్తిస్తుందని నిర్దిష్టంగా పేర్కొనలేదని మరో వాదన తీసుకొచ్చారు. కానీ అసహజ శృంగారం విషయంలో 377 సెక్షన్‌ను



> ప్రభుత్వాలు కక్ష సాధింపునకు పాల్పడకుండా నిరోధించడం కోసమే 17ఎ ఏర్పాటైందని సిద్ధార్థ లూథ్రా హరీష్ సాల్వే పలుసార్లు చెప్పారు. ముఖ్య మంత్రిగా చంద్రబాబు అధికార విధి నిర్వహణలో భాగంగా చేసిన వాటిపై దర్యాప్తు చేసేప్పుడు గవర్నర్ అనుమతి తీసుకోలేదు గనక అరెస్టు, తర్వాత రిమాండు ఉత్తర్వు చెల్లవనీ అప్పుడు కేసు నిలవదనీ వారు వాదించారు. చంద్రబాబుకు సంబంధం లేదంటూనే ఆయన విధినిర్వహణలో భాగంగా చేశారని చెప్పడం ఎలా పొసుగుతుందని రోహత్గీ ఎదురు వాదన చేశారు.

సవరించిపుడు అది గతంలో వున్న అలాంటి కేసులకు కూడా వర్తిస్తుంది కదా అని కోర్టు ప్రశ్నించినపుడు దాని స్వభావం వేరని రోహత్గీ వివరించారు. ఫెరా ఫెమా చట్టాలు మారినా పాత తప్పులు అలాగే వుంటాయన్న ఉదాహరణ ఇక్కడ వర్తిస్తుందన్నారు. ఒక నేరం జరిగిన తర్వాత చట్టం మారినా మౌలికంగా నేరం మాసిపోదన్నారు. రఫేల్ కేసులో సుప్రీంకోర్టు స్వయంగా 17ఎ వెనకటి కాలానికి కూడా వర్తిస్తుందని చెప్పినట్టు సాల్వే చెబితే అది కేవలం జస్టిస్ జోసఫ్ ఒక్కరి అభిప్రాయం మాత్రమేననీ, మిగిలిన ఇద్దరూ ఆ ప్రస్తావనే తేలేదని రోహత్గీ తెలిపారు. తాజాగా కర్నాటక ఉప ముఖ్యమంత్రి డి.కె. శివకుమార్ అక్రమాస్తుల కేసులోనూ 17ఎ వర్తించబోదని హై కోర్టు చెప్పిన తీర్పును ఉటంకించారు. అదే యడ్యూరప్ప విషయంలో గవర్నర్ అనుమతి నిరాకరించినా సిబిఐ చర్య తీసుకుంది. కానీ17 ఎ వర్తిస్తుందని సుప్రీంకోర్టు ఉపశమనం కలిగించింది.

రెండు రాష్ట్రాలపై ప్రభావం

క్వాష్‌పై తీర్పు ఇచ్చిన తర్వాత ముందస్తు బెయిల్ కేసు దీన్ని వింటే బావుంటుందని జస్టిస్ బోస్ సూచించగా అప్పటివరకూ అరెస్టు చేయకుండా గతంలో వున్న అవగాహనను కొనసాగించాలని లూథ్రా కోరారు. ఇప్పటికే మరోకేసులో కస్టడీలో వున్న వారి విషయంలో మిగిలిన కేసులు కూడా అమలులోకి వస్తాయనీ, సాంకేతికంగా ముందస్తు బెయిలు అమలయ్యే అవకాశమే వుండదని ప్రభుత్వం తరపున రంజిత్ కుమార్ స్పష్టం చేశారు. నవంబరు 8 వరకూ ఆగడానికి సిద్ధమేకానీ ఇప్పటికే వాటిపై ఎసిబి కోర్టు ముందు విచారణ జరుగుతున్నదని తెలిపారు. లూథ్రా అభ్యర్థనపై 9వ తేదీకి కేసు విచారణ వాయిదా పడింది. ఈ లోగా ఆరోగ్యం విషయమై హైకోర్టు వెకేషన్ బెంచిగనక ఏదైనా ఉపశమనం ఇచ్చే అవకాశం మాత్రం ఇంకా వుంది, ఈ కొద్ది రోజుల వ్యవధిలో హైకోర్టు వెకేషన్ బెంచ్ ఆ విధమైన వైఖరి తీసుకుంటుందా అనేది చూడవలసిందే. సాల్వే తన చివరి వాదనల్లో 17ఎ చంద్రబాబుకు మాత్రమే గాక స్కిల్ కేసు నిందితులైన అధికారులందరికీ వర్తిస్తుం దని చెప్పడం,అదివర్తిసే జరిగిన దర్యాప్తు మొత్తం నిలవదని వాదించడం గమనించదగింది. స్కాం అంటూ ఆరోపణలు వచ్చినపుడు మొత్తం వదిలేస్తే ఎలా అన్నట్టు న్యాయమూర్తుల కొన్ని ప్రశ్నలుండటం గమనించదగింది. అవినీతి నిరోధక చట్టంలో ఒక అంశాన్ని చూపి ఆపితే అసలు అవినీతి నిరోధం అన్న మౌలిక లక్ష్యం దెబ్బ తింటుందని కూడా వ్యాఖ్యానించారు. సాంకేతికంగా 17ఎ వర్తింపు గురించి రోహత్గీని కూడా అంతే నిశితంగా ప్రశ్నించారు. చివరకు తీర్పు ఎలా వుంటుందనే దానిపై ఎవరి అంచనాలు ఆశలు వారికి వున్నా అవినీతి కేసుల పేరిట మోడీ హయాంలో చాలా చోట్ల హడావుడి జరుగుతున్న పరిస్థితుల్లో దీన్ని కూడా సుప్రీంకోర్టు తేలిగ్గా తీసుకోకపోవచ్చన్న అభిప్రాయం కూడా వుంది. బెయిల్ కోసం ప్రయత్నించే బదులు 17ఎ పైనే కేంద్రీకరించాల్సింది కాదని క్వాష్ ఈ దశలో చెల్లదని కూడా అభిప్రాయాలున్నాయి.

ఈ మధ్యలో లోకేశ్ హోంమంత్రి అమిత్‌షాతో భేటీ అయినా కేంద్రం చేసిందేమీ లేదు. నిజానికి కేంద్రం ఆశీస్సు లేకుండా చంద్రబాబు అరెస్టు జరిగి వుండదని అత్యధికుల భావన. ఏ విధంగా చూసినా న్యాయపరంగానూ రాజకీయంగానూ చంద్రబాబుకూ తెలుగుదేశం పార్టీకి ఇది పెద్ద సవాలు. దీనిపై నిరసనల గురించి తెలంగాణలోనూ భిన్నాభిప్రాయాలు వ్యక్తమైనాయి. ఎన్నికల రీత్యా నెమ్మదిగా బీఆర్ఎస్ కూడా గొంతు కలిపిన సందర్భాలున్నాయి. ఇతర దేశాల్లో, రాష్ట్రాల్లో నిరసనల గురించి వార్తలు వస్తున్నా ఏపీలో టీడీపీ ఆశించిన స్థాయిలో లేదనే వ్యాఖ్యలు వచ్చాయి. ఈ మధ్యలో జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ ఎన్నికల పొత్తు ప్రకటించినా నిరసనల్లో పాత్ర వహించింది తక్కువ. త్వరలో ఆ రెండు పార్టీల సమావేశంలో కార్యక్రమం నిర్ణయం కావచ్చు. టీడీపీ సీనియర్ నాయకుల కన్నా చంద్రబాబు కుటుంబ సభ్యులే ముందుండటం కొన్ని రాజకీయ సంకేతాలిస్తున్నది. బీజేపీపైన టీడీపీ పెట్టుకున్న ఆశలు కూడా నెరవేరే పరిస్థితి కనిపించడం లేదు, సిఐడి అరెస్టులో కక్ష సాధింపున్నా కేసులు కోర్టులు విచారిస్తున్నందున తీర్పు కోసం చూడటం అనివార్యం.

> ఇతర దేశాల్లో, రాష్ట్రాల్లో నిరసనల గురించి వార్తలు వస్తున్నా ఏపీలో టీడీపీ ఆశించిన స్థాయిలో లేదనే వ్యాఖ్యలు వచ్చాయి. ఈ మధ్యలో జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ ఎన్నికల పొత్తు ప్రకటించినా నిరసనల్లో పాత్ర వహించింది తక్కువ. త్వరలో ఆ రెండు పార్టీల సమావేశంలో కార్యక్రమం నిర్ణయం కావచ్చు. టీడీపీ సీనియర్ నాయకుల కన్నా చంద్రబాబు కుటుంబ సభ్యులే ముందుండటం కొన్ని రాజకీయ సంకేతా లిస్తున్నది. బీజేపీపైన టీడీపీ పెట్టుకున్న ఆశలు కూడా నెరవేరే పరిస్థితి కనిపించడం లేదు.

సెబ్బాష్ రా నాన్న

సెబ్బాష్ రా నాన్న! సెబ్బాష్!!
ఆడపిల్ల అక్కడే పడుండే పుల్ల కాదనీ
కాపురానికి పిల్లతప్ప కన్నీళ్ళ బిందె కాదనీ
వల్లకాడైనా అత్తింటి కాళ్ళకాడి కట్టెపోగు కాదనీ
చావురేవుల పాతివ్రత్యమే పరమ సత్యం కాదనీ
గతకాలపు సనాతనంపై తిరుగుబాటు కేతనమై
ఎదురేగి కూతురికి స్వాగతం పలికావే
మేళతాళాలతో పుట్టింటి హక్కును చాటావే
అందుకురా నాన్న! అవునన్నా కాదన్నా
నువ్విప్పుడు సెబ్బాష్ నాన్నవయ్యావు

ఇక నుంచి సీత, సావిత్రి కథలే కాదు
కొత్త కథలు .. నాన్న- కూతురు కథలు రాయి
ఆడ పిల్లే కాదు, ఇక్కడకూ పిల్లేనని రాయి
మెట్టినింటి కథలే కాదు, పుట్టింటి కథలూ రాయి
ఆస్తి హక్కే కాదు, ఆత్మరక్షణ హక్కు కథలూ చెక్కు
కూతురే మనిషి జాతికి మళ్ళీ జన్మనే కథ రాయి
లేకుంటే ఆ కథ అక్కడితోనే అంతమనే కథ రాయి

ఇప్పుడేరా అబ్బాయి .. పరువు కథ బరువు దింపి
కూతురి మరోజన్మకు 'నాన్న' సాక్ష్యంగా మిగిలావు
అందుకే అంటున్నా! సెబ్బాష్ రా నాన్న అని
ఆ పేరు నాన్న- అమ్మాయని నిలప గలిగేలా
అమ్మ ఇంటిపై ఇక నుంచి నాన్న పతాకగా ఎగురు

(జార్ఖండ్‌లోని రాంచిలో తన కూతురు విడాకులు తీసుకున్న సందర్భంగా ఆనందంతో ఊరేగింపు చేసిన తండ్రి)

- ఉన్నం వెంకటేశ్వర్లు, 8790068814

యుద్ధం షురూ...

మేము చిన్నప్పుడు చదువుకునే రోజుల్లో ప్రశ్నలు ఈ విధంగా ఉండేవి, "యుద్ధములు ఎన్ని రకములు? అవి ఏవి? వివరించుము". ఇప్పటిలాగా స్కెచ్ పెన్నులు, మార్కర్లు లేవప్పుడు. ఎర్రపెన్ను వాడరాదు. అందుకే గుండ్రంగా అక్షరాలు ఉండి అక్కడక్కడా అండర్‌లైన్లు చేసే వాళ్ళు. అక్షరాలు గజిబిజిగా ఉన్నోళ్ళకు కొన్ని ఉపయోగాలు కూడా ఉండేవి. ఏదో కొన్ని పేజీలు బర బరా గీకేస్తే బహుశా విషయం రాసి ఉంటాడులే అని మార్కులు వచ్చే అవకాశమూ ఉండేది. ఒక్కోసారి వాళ్ళకే మార్కులు ఎక్కువగా వచ్చేవి కూడా. కాబట్టి మన దగ్గర ఉన్న ప్రత్యేకతను ఉపయోగించుకొని ముందుకుపోతూ ఉంటే ఏదో ఒకనాటికి అందరూ గుర్తిస్తారు.



జంధ్యాల రఘుబాబు
9849753298

యుద్ధములలో అంతర్యుద్ధములు, స్వాతంత్ర్య యుద్ధములు, తిరుగుబాటు యుద్ధములు, రెండు దేశాల మధ్య యుద్ధములు, ప్రపంచ యుద్ధములు మొదలైన రకాలు ఉంటాయి అని రాయొచ్చు లేదా ఒకటి, రెండు సంఖ్యలేసీ రాయొచ్చు. అది పేజీలు నింపే వాళ్ళకు బాగా కలిసి వచ్చే అంశం కూడా. ఇప్పుడంటే బుల్లెట్లు వచ్చాయి కానీ అవి అన్నిచోట్లా వాడలేము కదా. ఇకపోతే ఎక్కడికక్కడ ఇలాంటి టెక్నిక్కులు వాడేవాళ్ళే ఎప్పుడూ లాభం పొందుతూ ఉంటారు.

ఇక యుద్ధం వద్దు శాంతి ముద్దు అని అందరూ చెబుతారు. యుద్ధం ఆగిపోయినాక ఓడిపోయినవాడికంటే గెలిచినవాడే ఎక్కువ ఏడుస్తాడు. ఇద్దరికీ జరిగిన నష్టం ఎక్కువగానే ఉంటుంది. ఓడి పోయానని ఒకడేడిస్తే ఎందుకు గెలిచానో అర్థం కాక ఒకడేడుస్తాడు. సినిమా ఫ్లాపవుతే నిర్మాత పరిస్థితి ఏవిధంగా ఉంటుందో యుద్ధంలో ఓడిపోయిన వాడికీ అలాగే ఉంటుంది. ఇంతకీ సినిమా పేరు నాశనం, మునక, చివరికోరిక అన్నరీతిలో ఉంటుంది. వీపున రాయికట్టుకొని దూకినోళ్ళయితే రాయి నీది మునక నాది అని కూడా పెట్టుకోవచ్చు.

ఎవరికైనా యుద్ధమనగానే యుద్ధతంత్రం గుర్తొస్తుంది. తంత్రమంటే అదేదో మంత్రం కాదు. ఎలా పోరాడాలి, ఎవరిని ముందు పంపాలి, ఎవరిని వెనక పంపాలి, ఎవరిని అసలు పంపకూడదు అన్నవి ఓ పద్ధతి ప్రకారం చేసే ప్రణాళిక, టెక్నిక్కు. ఆ వైపు నుండి ఎవరిని పంపితే తమ వైపునుండి ఎవరిని పంపాలి అన్నది కూడా అందులోకే వస్తుంది. అవతలివాళ్ళు అకస్మాత్తుగా తమ ప్లాను మారిస్తే వెంటనే తామూ మార్చాల్సి వస్తుంది. అసలు చదరంగం ఆట ఈ యుద్ధ తంత్రం మీదే ఆధారపడి ఉందని మనందరికీ తెలుసు.



రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటివరకు పూర్తిగా రైతులకు రుణమాఫీ చేయలేదన్నారు. పేపర్ లీకులతో నిరుద్యోగ యువతీ యువకుల జీవితాలను చీకటిలో పడేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నిత్యావసర వస్తువుల ధరలు పెరిగినా పట్టించుకోని ప్రభుత్వం మద్యం దుకాణాలు పెంచి, తాగుబోతు రాష్ట్రంగా మార్చుతున్నారని మండిపడ్డారు. ఎన్నికలు జరిగేంత వరకూ లిక్కర్ షాపులను వెంటనే మూసివేయించాలని (సి.ఈ.ఒ) ఎన్నికల సంఘానికి విజ్ఞప్తి చేశారు. అతివృష్టి, అనావృష్టి లాంటి తీవ్రమైన పరిస్థితులల్లోనూ రైతులు పంటలు పండిస్తున్నా రైతాంగం అప్పులు రద్దు చేయడానికి మనసువొప్పని ప్రధానమంత్రి నరేంద్రమోడి.. పారిశ్రామిక వేత్తలకు రూ.వేల కోట్ల అప్పులను రద్దు చేసి తాను పారిశ్రామిక వేత్తలకు అనుకూలమని నిరూపించుకున్నారని ఎద్దేవా చేశారు. ప్రజలకు సేవచేసే, ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడే నీతి, నిజాయితీ గల సమర్ధవంతమైన పాలనను ఇచ్చే తెలంగాణ కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా అభ్యర్థిగా పోటీ చేస్తున్న తనను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఇబ్రహింపట్నం నియోజక వర్గ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమములో పార్టీ నాయకులు కుర్మెటి శేఖర్, యస్.కె గౌస్, సి. ఈశ్వరయ్య, ఎస్ వెంకట్ రెడ్డి, జి సత్తమ్మ, వి సైదమ్మ చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సేవలు వెలకట్టలేనివి : ఉపేందర్ రెడ్డి



నవతెలంగాణ - చైతన్యపురి

కార్మికుల సేవలు వెలకట్టలేనివని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర యువజన నాయకులు చిలుక మధుర ఉపేందర్ రెడ్డి అన్నారు. దసరా పండుగను పురస్కరించుకొని మహేశ్వరం నియోజకవర్గం ఆర్కే పురం డివిజన్‌లోని అష్టలక్ష్మి దేవాలయంలో పనిచేసే కార్మికులకు చీరలను చిలుక మధుర ఉపేందర్ రెడ్డి శనివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సంవత్సరం దసరా పండుగ సందర్భంగా కార్మికులకు చీరలను అందజేస్తానని చెప్పారు. కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీల్లో రూ.23 లక్షలు స్వాధీనం

నవతెలంగాణ - వనస్థలిపురం

వనస్థలిపురం పోలీస్ స్టేషన్ పరిధిలో సీఐ జలంధర్ రెడ్డి నేతృత్వంలో వాహనాల తనిఖీలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా శనివారం వనస్థలిపురం ప్రభుత్వ పాఠశాల వద్ద తనిఖీలు నిర్వహించారు. వెంకటేశ్వర బుక్ స్టాల్ నిర్వాకుడు నడికోటి వెంకటేష్ వద్ద నుండి ఎలాంటి



ధ్రువీకరణ పత్రాలు లేని రూ.20 లక్షలు, వనస్థలిపురం రెడ్ వాటర్ ట్యాంక్ వద్ద మరో వ్యక్తి వద్ద నుండి రూ. మూడు లక్షలను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ జలంధర్ రెడ్డి తెలిపారు.



త్రిపుర రాష్ట్ర గవర్నర్‌గా నియమితులైన మలక్‌పేట మాజీ శాసన సభ్యులు ఇంద్ర సేనా రెడ్డిని శనివారం బీఎస్‌రెడ్డి నగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చి రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. తర్వాత శాలువాతో సత్కరించి, శుభాకాంక్షలు తెలియజేశారు.

నవతెలంగాణ-వనస్థలిపురం

గోల్డెన్ అవర్‌ను గోల్డెన్ డేగా మార్చిన ర్యాపిడ్ ఏఐ

- విప్లవాత్మకమైన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ టెక్నాలజీని ఆవిష్కరించిన కిమ్స్ ఆస్పత్రి న్యూరో బృందం



నవతెలంగాణ-సిటీబ్యూరో

విప్లవాత్మకమైన ర్యాపిడ్ ఏఐ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) టెక్నాలజీని ఆవిష్కరించడం ద్వారా కిమ్స్ ఆస్పత్రి బ్రెయిన్ స్ట్రోక్ చికిత్సల్లో ఓ కొత్త శకాన్ని ఆవిష్కరించింది. హైదరాబాద్‌లో శనివారం ఈ కార్యక్రమం జరిగింది. ఇషెమిక్ స్ట్రోక్ రోగులను ఇన్నాళ్లూ కేవలం గోల్డెన్ అవర్‌లో తీసుకొస్తేనే జరిగే మంచి చికిత్సను ఈ అత్యాధునిక పరిజ్ఞానంతో గోల్డెన్ డేలో తీసుకొచ్చినా అందించేందుకు అవకాశం లభించింది. దీనివల్ల లక్షల మంది స్ట్రోక్ పేషెంట్లకు మేలు కలుగుతుంది. ఈ సరికొత్త టెక్నాలజీ గురించి కిమ్స్ ఆస్పత్రికి చెందిన సీనియర్ న్యూరాలజిస్టు డాక్టర్ సుభాష్ కౌల్ మాట్లాడుతూ "అన్ని స్ట్రోక్‌లలో సుమారు 80శాతం ఇషెమిక్ స్ట్రోక్‌లే ఉంటాయి. మెదడులోని రక్తనాళం పూడుకుపోయినప్పుడు ఇవి సంభవిస్తాయి. దీనివల్ల మెదడుకు కీలకమైన ఆక్సిజన్ సరఫరా ఆగిపోతుంది. ఇప్పటి వరకు, ఈ గడ్డలను కరిగించగల థ్రోంబోలిటిక్ ఏజెంట్లు మొదటి 4.5 గంటల్లో మాత్రమే ప్రభావవంతంగా పని చేసేవి. ఈ కాలపరిమితి దాటితే, చికిత్స ప్రభావం తగ్గుతుంది. కొన్నిసార్లు ప్రతికూల ప్రభావాలకు కూడా దారి తీస్తుంది. కొత్త పరిజ్ఞానం కారణంగా.. 24 గంటల వరకు కూడా మెదడులోని రక్తనాళాల్లో గడ్డలను యాంత్రికంగా తొలగించే అవకాశం లభించింది. ఇప్పటికే దెబ్బతిన్న మెదడు కణజాలం, ఇంకా దెబ్బ తినని.. కానీ ప్రమాదంలో ఉన్న మెదడు కణజాలం అంచనా ఆధారంగా రోగిని సరిగా ఎంపిక చేసుకోవాలి" అని తెలిపారు. "ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో తొలిసారిగా కిమ్స్ ఆస్పత్రి స్ట్రోక్ పేషెంట్లకు సరికొత్త ఆశలు కల్పిస్తోంది. స్ట్రోక్ వచ్చిన తర్వాత వారు 24 గంటల్లోపు ఆస్పత్రికి చేరుకున్నా, వారికి సరైన చికిత్స అందించేందుకు అవకాశం ఉంది. అంటే గోల్డెన్ అవర్.. ఇప్పుడు గోల్డెన్ డేగా మారింది. రెండు తెలుగు రాష్ట్రాల్లో స్ట్రోక్ పేషెంట్ల చికిత్సను ర్యాపిడ్ ఏఐ గణనీయంగా మారుస్తుంది" అని కిమ్స్ ఆస్పత్రి న్యూరో సర్జరీ విభాగాధిపతి, సీనియర్ కన్సల్టెంట్ న్యూరో సర్జన్ డాక్టర్ మానస్ కుమార్ పాణిగ్రాహి వివరించారు. ఈ సరికొత్త ఏఐ సాఫ్ట్‌వేర్ ఆవిష్కరణ కార్యక్రమంలో కిమ్స్ ఆస్పత్రి సీఎండీ డాక్టర్ బొల్లినేని భాస్కరరావు, మెడికల్ డైరెక్టర్ డాక్టర్ సంబిత్ సాహు, న్యూరో సర్జరీ విభాగాధిపతి, సీనియర్ కన్సల్టెంట్ న్యూరో సర్జన్ డాక్టర్ మానస్ కుమార్ పాణిగ్రాహి, సీనియర్ న్యూరాలజిస్టు డాక్టర్ సుభాష్ కౌల్, కన్సల్టెంట్ న్యూరాలజిస్టు డాక్టర్ ప్రవీణ్ కుమార్ యాడా, రేడియాలజీ విభాగాధిపతి, న్యూరో ఇంటర్వెన్షనల్ రేడియాలజిస్టు డాక్టర్ అనంతరామ్, ఇంకా పలువురు సీనియర్ న్యూరాలజిస్టులు పాల్గొన్నారు.



బీఎస్పీతోనే సామాజిక న్యాయం



- బీఎస్పీ ఎల్బీనగర్ ఇన్‌చార్జ్ జక్క యాదగిరి

నవతెలంగాణ - హస్తినాపురం

బీఎస్పీ పార్టీతోనే సామాజిక న్యాయం సాధ్యం అని ఆ పార్టీ బీఎస్పీ ఎల్బీనగర్ ఇంచార్జ్ జక్క యాదగిరి అన్నారు. ఎల్బీనగర్ నియోజకవర్గం హస్తినాపురం డివిజన్లో సంతోషి మాత కాలనీ, శ్రీ వెంకటేశ్వర కాలనీ, ఊర్మిళ నగర్, పద్మావతి నగర్ కాలనీలలో జక్క యాదగిరి ఆధ్వర్యంలో శనివారం ఇంటింటికీ బీఎస్పీ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని సామాజిక వర్గాలకు న్యాయం, భూకబ్జాలు లేని రాష్ట్రం, అప్పులు లేని రాష్ట్రం కావాలన్నా బీఎస్పీ పార్టీకి ఓటేయాలని ప్రజలను కోరారు. బహుజనులందరూ ఏకమైతే బీఎస్పీ పార్టీ అధికారంలోకి రావడం తథ్యమని ధీమా వ్యక్తం చేశారు. నీతి, నిజాయితీవంతమైన పరిపాలన కావాలంటే బీఎస్పీకి ఓటు వేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ ప్రచారంలో వనస్థలిపురం డివిజన్ అధ్యక్షుడు అనగల స్వామి, ఎర్ర అశోక్, అనిల్ యాదవ్, గుత్తి శేఖర్, మహేష్, నరసింహ కృష్ణ పాల్గొన్నారు.

'ఆర్టీసీ ప్రయాణికులకు లక్కీ డిప్ స్కీం'



నవతెలంగాణ- హయత్ నగర్

దసరా, బతుకమ్మ పండుగల సందర్భంగా ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం చేసే ప్రయాణికులకు తెలంగాణ రాష్ట్ర రీజనల్‌లో లక్కీ డిప్ స్కీంను ప్రవేశపెట్టిందని హయత్ నగర్ రీజనల్ డిప్యూటీ మేనేజర్ సూచరిత పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న ఈ స్కీంను ఉప్పల్ క్రాస్ రోడ్, హయత్ నగర్ బస్ స్టాండ్, మిదాని, ఇబ్రాహీం , వివిధ బస్ స్టాం డ్‌లలో ఈ నెల 18 నుండి 30 వరకు కొనసాగిస్తున్నట్లు తెలిపారు. తమ, తమ ప్రయాణాలు ముగిశాక వారి టికెట్ వెనుక భాగంలో పేరు, ఫోన్ నెంబర్ రాసి డ్రా బాక్స్ లో వేయాలని ప్రయాణికులకు సూచించారు. మహిళలు, పురుషులు 5గురు చొప్పున 110మందికి ఒక్కొక్కరికి రూ.9,900 నగదు బహుమతులు అందజేస్తామన్నారు. ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



రాష్ట్ర ఐటీ, పురపాలక శాఖ మంత్రి కేటీఆర్‌ను శనివారం మహేశ్వరం నియోజకవర్గం జల్‌పల్లి మున్సిపల్ రిప్రజెంట్ వైస్ చైర్మన్ సయ్యద్ యూసుఫ్ పటేల్ మర్యాద పూర్వకంగా కలిశారు. తర్వాత ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు.

నవతెలంగాణ- బడంగ్‌పేట్

' మా ఓటు వృధా కావద్దనే బీఆర్ఎస్‌లో చేరాం'



నవతెలంగాణ- బడంగ్ పేట్

మా ఓటు వృధా కాకుండా అభివృద్ధికి సహకరించాలనే ఉద్దేశంతో బీఆర్ఎస్ పార్టీలో చేరినట్లు కౌన్సిలర్ పల్లపు శంకర్ తెలిపారు. మహేశ్వరం నియోజకవర్గంలోని జల్‌పల్లి మున్సిపాలిటీ స్థానిక కౌన్సిలర్ పల్లపు శంకర్ ఆధ్వర్యంలో శ్రీరామ్ నగర్ కాలనీకి చెందిన 30 మంది కాంగ్రెస్ కార్యకర్తలు శనివారం రాష్ట్ర విద్యా శాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా మంత్రి వారికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ శంకర్ మాట్లాడుతూ రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో మహేశ్వరంలో గెలిచేది మంత్రి సబితా ఇంద్రారెడ్డి అని నిర్ణయించుకొని.. మా ఓటు వృధా కాకుండా అభివృద్ధికి సహకరిద్దామని, బంగారు తెలంగాణ భవిష్యత్‌కు బాటలు వేద్దామని బీఆర్ఎస్ పార్టీలో చేరామన్నారు. కారు గుర్తుకు ఓటు వేసి, భారీ మెజారిటీతో మంత్రి సబితమ్మను గెలిపిస్తామని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మారుతి, బాబు వివిధ కాలనీల ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో చేరిన పలువురు..

జల్‌పల్లి మున్సిపాలిటీ 5వ వార్డు కంటెస్టెంట్ కౌన్సిలర్ మన్సూర్ అలీ ఆధ్వర్యములో పలువురు సీనియర్



కాంగ్రెస్ నాయకులు మంత్రి సబితా ఇంద్రారెడ్డి సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా మంత్రి వారికి బీఆర్ఎస్ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో జల్ పల్లి మాజీ సర్పంచ్, ప్రస్తుత కో ఆప్షన్ సభ్యులు సూరెడ్డి కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బ్రాహ్మణ సమాజానికి అన్ని ఏర్పాట్లు చేశా..



- ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి

నవతెలంగాణ - హయత్ నగర్

బ్రాహ్మణ సమాజానికి కావాల్సిన అవసరాలు ఇప్పటికే ఏర్పాటు చేశానని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ అన్నారు. చింతల కుంటలో ఓ ఫంక్షన్ హాల్లో శనివారం నిర్వహించిన బ్రాహ్మణుల ఆత్మీయ సమ్మేళనానికి హాజరై మాట్లాడారు. దేశంలో అతి పెద్దదైన సర్వమత హితంగా ముక్తిఘాట్ అనే స్మశానం నిర్మించి, అందులో బ్రాహ్మణులకు అపర కర్మల భవనాన్ని నిర్మించామని చెప్పారు. సాహెబ్ నగర్, ఇతర స్మశాన వాటికలలో కూడా అపరకర్మ భవనాలు నిర్మిస్తామని, వనస్థలిపురంలో హుడా బిల్డింగ్ ఉన్న గాయత్రీ భవన్‌ను బ్రాహ్మణ వెల్ఫేర్ అసోసియేషన్‌కు శాశ్వత ప్రాతిపదికన అందజేస్తామని తెలిపారు. దేవాలయాలు, గో బ్రాహ్మణ సంరక్షణ తన భాద్యతగా స్వీకరిస్తానని అన్నారు. అనంతరం నామినేషన్‌కు అయ్యే ఖర్చుకు బ్రాహ్మణులందరూ ఒక్క రూపాయి యిచ్చి తనని ఆశీర్వదించాలని కోరారు. సభలో పాల్గొన్న బ్రాహ్మణులందరూ ఒక్కో రూపాయి యిచ్చి ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో తులసి శ్రీనివాస్, టి.బి.ఎస్.ఎస్.ఎస్ జంట నగరాల మాజీ అధ్యక్షులు పోచంపల్లి శ్రీధర్ రావు, బ్రాహ్మణ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు నందిరాజు లక్ష్మీ నారాయణ, కార్యదర్శి జగన్ మోహనా చారి, ఉపాధ్యక్షులు వైష్ణవ సంఘం, వాసుదేవరావు, కే.ఆర్.ప్రసాద్, చంద్రశేఖర్, శేషాచలపతి, మూర్తి, పి.వి.బి.డి.శర్మ, స్వర్ణ శ్రీనివాస రావు, ఎం.ఎస్.కే. ప్రభు, సాధు శ్యాంప్రసాద్, చిట్టి బాలనాగేశ్వర రావు, విఠల్, ప్రతిక్, మహిళా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పలు చోట్ల అమ్మవార్లకు పూజలు, అన్నదానాలు



నవతెలంగాణ - వనస్థలిపురం

బీఎన్ డివిజన్ పరిధిలోని హరిహరపురం, ఎస్‌కేడీ నగర్, సెల్ఫ్ ఫైనాన్స్ కాలనీ, సాయిరాం కాలనీ, వనస్థలిపురం దుర్గా స్థలి పార్క్‌లో నెలకొల్పిన అమ్మవార్లను శనివారం రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షులు సామ రంగారెడ్డి, కార్పొరేటర్ మొద్దు లచ్చి దర్శించుకున్నారు. తర్వాత ప్రత్యేక పూజలు, అన్నదాన కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు రఘురాం నేత, శంకరయ్య గౌడ్, ప్రధాన కార్యదర్శి ముడుపు సందీప్ రెడ్డి, ఉపాధ్యక్షులు విష్ణువర్ధన్ రెడ్డి, నాయకులు ముత్యాలు, శ్రవణ్ రెడ్డి, సుధీర్, చందు, అర్జున్ గౌడ్, మధుకర్ రెడ్డి, సురేష్, భాను, దుర్గాప్రసాద్, ప్రణయ్, నవీన్ కుమార్, శివ కుమార్ పాల్గొన్నారు.

నవతెలంగాణ -సంతోష్ నగర్



దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలలో భక్తులందరూ భక్తిశ్రద్ధలతో పూజలు చేయాలని జై భవాని యూత్ అసోసియేషన్ అధ్యక్షులు రణధీర్ రెడ్డి అన్నారు. ఎల్బీనగర్ నియోజకవర్గం చంపాపేట్ డివిజన్ పరిధిలోని వివిధ ఆలయాలతోపాటు మండపాలల్లో కొలువుదీరిన అమ్మవార్లకు శనివారం కమిటీ సభ్యులు మహేష్, విశాల్, అభి, వెంకట్, న్యమల వెంకటయ్యలు కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో హోమం, పూజలు చేశారు.

నవతెలంగాణ - బడంగ్‌పేట్



మహేశ్వరం నియోజకవర్గ పరిధి బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని నాదర్‌గుల్ గ్రామంలో ఉన్న సాయిబాబా ఆలయంలో శనివారం పేతుల ఆనంద్ రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమానికి టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి హాజరయ్యారు. తర్వాత ముదిరాజ్ కాలనీలో దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు సందర్భంగా అమ్మవారికి మేయర్ ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఫ్లోర్ లీడర్ వంగేటి ప్రభాకర్ రెడ్డి, కార్పొరేటర్ పెద్దబావి సుదర్శన్ రెడ్డి, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు సుబాన్ యాదవ్, బంగారి అశోక్, బ్యాంక్ వైస్ చైర్మన్ కొలను తిరుపతి రెడ్డి, శ్రీధర్, టేకుల సుధాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ- సంతోష్ నగర్



యాకుత్‌పురా నియోజకవర్గం అంబేద్కర్ నగర్ డివిజన్ పరిధిలోని అంబేద్కర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అంబేద్కర్ నగర్ బస్తీ వాసులు శనివారం దుర్గా మాతకు ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు వై. రామారావు, సెక్రెటరీ సి. బాబురావు, చీఫ్ అడ్వైజర్ బోయిని విజయకుమార్, కమిటీ సభ్యులు కిరణ్, చంద్రశేఖర్, రాజేందర్ పాల్గొన్నారు.

నవతెలంగాణ- సంతోష్ నగర్



దేవి నవరాత్రుల్లో భాగంగా ఐఎస్ సదన్ డివిజన్‌లోని పలు దుర్గాదేవి మండపాలను సందర్శించి, ప్రత్యేక పూజలు చేసిన కార్పొరేటర్ జంగం శ్వేత మధుకర్ రెడ్డి, భాగ్యనగర్ జిల్లా ఉపాధ్యక్షులు జంగం మధుకర్ రెడ్డి.

నవతెలంగాణ - చైతన్యపురి

ఆర్కే పురంలోని కుర్తాళం పీఠం వారాహి సమేత ప్రత్యంగిరా దేవి శ్రీ లలితాదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ



సందర్భంగా మహిళలు భక్తిశ్రద్ధలతో కుంకుమార్చనలు చేశారు. ప్రముఖ చలనచిత్ర నేపథ్య గాయనీమనులు రమ్యాబెహరా సాహితీ భక్తి సంగీతం అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ సెక్రెటరీ మునిపల్లె శ్రీనివాస్ సువర్ణలత దంపతులు, అరుణ, శ్రీపతి శర్మ, విట్టల్ శర్మ ఉదయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ- సంతోష్ నగర్



రాజిరెడ్డి నగర్ యూత్ అసోసియేషన్ అధ్యక్షులు డి.శ్రీనివాస్, నితీష్, కమిటీ సభ్యులు శనివారం దుర్గామాత అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. తర్వాత అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో మహిపాల్, చింటూ, సంతోష్, హరిప్రసాద్, నాగరాజు, క్రాంతి, సందీప్, రవీందర్ రెడ్డి, నితీష్, వరుణ్, హరీష్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ - హయత్‌నగర్



మన్సూరాబాద్‌లోని సౌత్ ఎండ్ పార్క్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సౌత్ ఎండ్ పార్క్ కాలనీలో నెలకొల్పిన అమ్మవారిని శనివారం బీజేపీ రంగారెడ్డి జిల్లా అర్బన్ జిల్లా అధ్యక్షులు సామా రంగారెడ్డి, కార్పొరేటర్ కొప్పుల నర్సింహా రెడ్డి, చింతల సురేందర్ యాదవ్‌లు దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో మండప ప్రతినిధులు పాతూరి శ్రీధర్ గౌడ్, పాతూరి సునీల్ గౌడ్, జస్వంత్, నరేష్,అంకిత్, మనీష్, పవన్, మహేష్ అజయ్, ప్రకాష్, ప్రమోద్, ప్రవీణ్, మోహన్, రమణ, కార్తీక్ పాల్గొన్నారు.

వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలలో నవగ్రహ హెూమం



నవతెలంగాణ- వనస్థలిపురం

వనస్థలిపురంలోని శ్రీ పద్మావతి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దేవస్థానంలో శ్రీవారి బ్రహ్మోత్సవాలు 7వ రోజు అంగరంగ వైభవంగా జరిగాయి. శనివారం ఉదయం 5 గంటలకు మంగళ వాయిద్యాలు, సుప్రభాత సేవ, తిరువారాధన, సహస్ర నామార్చన, స్వర్ణ పుష్పార్చన ఉత్సవమూర్తులకు అభిషేకం, నవగ్రహ హెూమం, ఎదుర్కోలు ఉత్సవం, శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవారి ప్రత్యేక కళ్యాణ మహెూత్సవం, రథోత్సవం తిరు వీధి ఉత్సవం, శ్రీ పద్మావతి అమ్మవారి సన్నిధిలో సామూహిక విశేష కుంకుమార్చన, శ్రీవారి కళ్యాణ మహెూత్సవం , మధ్యాహ్నం అన్నదానం, సాయంత్రం గజవాహనంపై తిరువీధి ఉత్సవం, యాగశాల నందు మహాలక్ష్మి హెూమం, రాత్రి 9:30 గంటలకు పవళింపు సేవ తదితర ప్రత్యేక పూజా కార్యక్రమాలను వేద పండితుల నేతృత్వంలో కన్నుల పండువగా నిర్వహించారు. ఈ కార్యక్రమాలలో ఆలయ కమిటీ చైర్మన్ కే. లక్ష్మయ్య, ప్రధాన కార్యదర్శి పి.సత్యనారాయణ, కో- చైర్మన్ కేఎల్ గణపతి, వైస్ చైర్మన్లు జగదీష్ కుమార్, పాపారావు, కే.సత్తయ్య, కోశాధికారి కే. శ్రీధర్, సంయుక్త కార్యదర్శి పి. శ్యామల, సహాయ కోశాధికారి కే. రామలక్ష్మి, సాంబశివరావు, సునీల్ కుమార్ గౌడ్, వెంకటేశ్వరరావు, రమేష్ బాబు, అశోక్ కుమార్ పాల్గొన్నారు.



'పోలీస్ అమర వీరుల త్యాగం మరువలేనిది'

నవతెలంగాణ - బడంగ్ పేట్

పోలీస్ అమర వీరుల త్యాగం మరువలేనిదని బాలాపూర్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ బి.వెంకట్‌రెడ్డి అన్నారు. మహేశ్వరం నియోజకవర్గం బాలాపూర్ పోలీస్ స్టేషన్ లో ఇన్‌స్పెక్టర్ వెంకట్ రెడ్డి, ఎస్ఐలు, సిబ్బందితో శనివారం పోలీసు అమర వీరుల సంస్మరణ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమ ంలో ఎస్ఐలు సైదులు, మహేందర్, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి
రూ.10వేల ఆర్థిక సాయం అందజేత



నవతెలంగాణ-కాప్రా
మల్లాపూర్ డివిజన్ ఎస్‌వీ నగర్‌కు చెందిన బిసమల్ల శ్రీనివాస్‌రెడ్డి అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఉప్పల్ నియోజకవర్గ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి ఆదేశాలతో బీఎల్ఆర్ ట్రస్ట్ ద్వారా ట్రస్టు సభ్యులు శనివారం రూ. 10వేలు అందజేశారు.

త్రిపుర గవర్నర్‌ను కలిసిన వైఎస్సార్



నవతెలంగాణ-సిటీబ్యూరో
త్రిపుర గవర్నర్‌గా నియమితులైన బీజేపీ సీనియర్ నాయకులు, మాజీ ఎమ్మెల్యే ఇంద్రసేనారెడ్డిని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, ఘట్కేసర్ మండల ఎంపీపీ ఏనుగు సుదర్శన్‌రెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఇంద్రసేనారెడ్డికి ఎంపీపీ శుభాకాంక్షలు తెలిపారు. దశాబ్దాలుగా బీజేపీ విస్తరణ, ప్రజా సంక్షేమం కోసం సైద్ధాంతిక నిబద్ధతతో ఎమ్మెల్యేగా, పార్టీ అధ్యక్షునిగా ఇంద్రసేనారెడ్డి చేసిన కృషి ఈ తరం నాయకులకు కూడా ఎంతో స్ఫూర్తిదాయకమైనదని ఎంపీపీ పేర్కొన్నారు.

అన్ని వర్గాలూ కాంగ్రెస్ వైపే



- ఆరు గ్యారంటీలను పక్కా అమలు చేస్తాం
- మేడ్చల్ ప్రజల ఆశీర్వాదం నాకుంది
- ఇంటింటికీ కాంగ్రెస్ యాత్రలో ఎమ్మెల్యే అభ్యర్థి వజ్రేష్ యాదవ్

నవతెలంగాణ-బోడుప్పల్
మేడ్చల్ నియోజకవర్గంలోని అన్ని వర్గాల మద్దతు కాంగ్రెస్‌కే ఉందనీ, మేడ్చల్ ప్రజలు ఆశీర్వదించి కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని మేడ్చల్ ఎమ్మెల్యే అభ్యర్థి తోటకూర వజ్రేష్ యాదవ్ అన్నారు. శనివారం బోడుప్పల్ నగర పాలక సంస్థ పరిధిలోని 23, 24 వ డివిజన్ల పరిధిలో నగర పార్టీ అధ్యక్షుడు పోగుల నరసింహారెడ్డి అధ్యక్షతన నిర్వహించిన ఇంటింటికీ కాంగ్రెస్ యాత్రలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వజ్రేష్ మాట్లాడుతూ.. రాష్ట్రంలోని అన్ని వర్గాల మద్దతు కాంగ్రెస్ పార్టీకే ఉందన్నారు. మేడ్చల్ ప్రజలు ఆశీర్వదించి అసెంబ్లీ పంపిస్తే వారి సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తానని అన్నారు. కార్యక్రమంలో మేడ్చల్ నియోజకవర్గం బీ బ్లాక్ ప్రధాన కార్యదర్శి కిషోర్‌గౌడ్, కార్పొరేటర్ తోటకూర అజయ్ యాదవ్, బోడప్పల్ కార్పొరేషన్ ప్రధాన కార్యదర్శులు కొత్త ప్రభాకర్ గౌడ్, విశ్వం గుప్తా, బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ కంటెస్టెంట్ కార్పొరేటర్లు, యూత్ కాంగ్రెస్, ఎస్సీ సెల్, బీసీ సెల్,మహిళా, మైనార్టీ సెల్, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన వల్లపు ఐలేష్ యాదవ్
బీఆర్ఎస్ పార్టీ 24వ డివిజన్ నాయకుడు వల్లపు ఐలేష్ యాదవ్ తన అనుచరులతో కలిసి తోటకూర వజ్రేష్ యాదవ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఐలేష్ యాదవ్ మాట్లాడుతూ బీఆర్ఎస్‌లో కష్టపడి పనిచేసే వారికి ప్రాధాన్యత లేదన్నారు.

కాంగ్రెస్ అధికారంలోకి వస్తే స్కాంలే..



- పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి బ్లాక్ మెయిలర్
- కాంగ్రెస్ అభ్యర్థి భూ కబ్జాదారుడు
- సుధీర్‌రెడ్డికి ప్రజల్లో ఆదరణ లేదు
- రాష్ట్ర కార్మికశాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి

నవతెలంగాణ-బోడుప్పల్
బీఆర్ఎస్ స్కీంల ప్రభుత్వమని, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే అన్ని స్కాంలే జరుగుతాయని, అందుకే కాంగ్రెస్‌ను ఎట్టి పరిస్థితుల్లోనూ నమ్మొద్దని రాష్ట్ర మంత్రి చామకూర మల్లారెడ్డి అన్నారు. శనివారం బోడుప్పల్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మల్లారెడ్డి మాట్లాడుతూ.. పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి పెద్ద బ్లాక్ మెయిలర్ అని, ప్రస్తుత మేడ్చల్ కాంగ్రెస్ అభ్యర్థి పెద్ద భూ కబ్జాదారుడని, మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డికి ప్రజల్లో ఆదరణ లేకుండా పోయిందన్నారు. ప్రజలకు స్కీంలు అందించే పాలన కావాలా..స్కాంలు చేసే కాంగ్రెస్ పాలన కావాలా అని ప్రశ్నించారు. ఎవరెన్ని చేసినా బీఆర్ఎస్ విజయం తథ్యమన్నారు. కార్యక్రమానికి బోడుప్పల్ అధ్యక్షుడు మంద సంజీవరెడ్డి అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో చామకూర భద్రారెడ్డి, ప్రీతీరెడ్డి, బోడుప్పల్ మేయర్ సామల బుచ్చిరెడ్డి, పీర్జాదీగూడ మేయర్ జక్కా వెంకట్ రెడ్డి, బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి మీసాల కృష్ణ, డిప్యూటీ మేయర్ కొత్త లక్ష్మీ గౌడ్,కార్పొరేటర్లు, నాయకులు పాల్గొన్నారు.

శ్రీపాద ఎన్‌క్లేవ్ అధ్యక్షుడిగా ఎడవల్లి రఘువర్ధన్‌రెడ్డి



నవతెలంగాణ-బోడుప్పల్
పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని శ్రీపాద ఎన్‌క్లేవ్ సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా ఎడవల్లి రఘువర్ధన్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ ఎన్నికకు ఈ.పూర్ణచంద్రరావు ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. ఎడవెల్లి రఘువర్ధన్‌రెడ్డి ఒక్కరే నామినేషన్ వేయడంతో ఎన్నిక ఏకగ్రీవం అయిన్నట్టు తెలిపి పూర్ణచంద్రరావు ధ్రువీకరణ పత్రం అందజేశారు. ప్రధాన కార్యదర్శిగా పల్లా రాజశేఖర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా బోడకుంటి శ్రీనివాస్, శ్రీనివాసులు, రామయోగి, గోపాల్ రెడ్డి, సలహాదారులుగా అక్కోజి కులకర్ణి, పూర్ణచంద్రరావు, కోశాధికారిగా హరీష్‌రెడ్డి, కార్యదర్శిగా కృష్ణారెడ్డి, సంయుక్త కార్యదర్శులుగా పెద్ది రెడ్డి సిద్ధిరెడ్డి, సోమేశ్ గౌడ్, సభ్యులుగా లింగయ్య, రాజు, కల్చరల్ కో ఆర్డినటర్స్‌గా రజనీదేవి, పావనీలను నియమించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా అధ్యక్షులు రఘువర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ పోటీకి రాకుండా తనపై నమ్మకంతో నాలుగోసారి ఏకగ్రీవంగా అధ్యక్షుడిగా ఎన్నుకున్నందుకు కాలనీ సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు. శ్రీపాద కాలనీ అభివృద్ధికి కృషి చేస్తామని, పచ్చదనాన్ని పెంచడానికి, ప్లాస్టిక్ నివారణ, సీసీ రోడ్లు పూర్తి చేయడానికి కృషి చేస్తానని తెలిపారు.

మల్లాపూర్ డివిజన్‌లో బీఆర్ఎస్ నేతల ప్రచారం



నవతెలంగాణ-కాప్రా
ఉప్పల్ శాసనసభ నియోజకవర్గం బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి గెలుపునకు ఆ పార్టీ శ్రేణులు మల్లాపూర్ డివిజన్ పరిధిలోని వెంకటరమణకాలనీ, బ్రహ్మపురి కాలనీల్లోని ప్రతి ఇంటికీ వెళ్లి సంక్షేమ పథకాలు, స్థానిక కాలనీల్లో చేసిన అభివృద్ధి పనులను వివరిస్తూ ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి, పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు తదితరులున్నారు.

నగదు, బంగారం సీజ్ చేసేటప్పుడు
ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను పాటించాలి

- ఈ సమయంలో తప్పనిసరిగా రశీదు అందించాలి
- సీజ్ చేసే నగదు, విచారణ తర్వాత విడుదల చేసే డబ్బు వివరాలను ప్రెస్‌కు అందించాలి
- అభ్యర్థులకు అవసరమైన అనుమతులను నిబంధనల మేరకు సకాలంలో అందించాలి
- మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్



నవతెలంగాణ-సిటీబ్యూరో
హైదరాబాద్ నుంచి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్, డీజీపీ అంజనీకుమార్, ఇతర రాష్ట్ర ఉన్నత స్థాయి అధికారులతో కలిసి ఎన్నికల నియమావళి ఉల్లంఘనలపై ఫిర్యాదులు, ఎంసీఎంసీ, నగదు, బంగారం పట్టివేత, సి విజల్ యాప్, తదితర అంశాలపై జిల్లా ఎన్నికల అధికారులతో నిర్వహించిన వీడియో సమావేశంలో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ నోడల్ అధికారులతో మాట్లాడుతూ జిల్లాలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనలపై వచ్చే ఫిర్యాదులను త్వరగా పరిష్కరించాలన్నారు. రాజకీయ పార్టీల అభ్యర్థుల నుంచి వచ్చే ఫిర్యాదులపై తీసుకున్న చర్యలపై లిఖిత పూర్వక సమాధానం ఇవ్వాలన్నారు. ఎన్నికల ప్రచారం సమావేశాలు, సభలు నిర్వహించుకునేందుకు రాజకీయ పార్టీల ప్రతినిధుల, అభ్యర్థుల నుంచి సువిధ యాప్ ద్వారా ఆఫ్‌లైన్‌లో వచ్చే దరఖాస్తులకు ఎప్పటికప్పుడు అనుమతులు మంజూరు చేయాలన్నారు. క్షేత్రస్థాయిలో జరిగే ఎన్నికల ప్రచారంలో వినియోగించే ఆడియో, వీడియోలను పరిశీలించి ఎంపీఎంసీ ధృవీకరించాలని, ప్రతి రోజూ ఎంపీఎంపీ, సువిధ యాప్, ఆఫ్‌లైన్ దరఖాస్తులపై అధికారులు దృష్టి సారించాలన్నారు. తనిఖీల్లో నగదు, బంగారం సీజ్ చేసే సమయంలో పాటించాల్సిన నిబంధనలపై అధికారులకు పూర్తి అవగాహన కల్పించాలన్నారు. నగదు సీజ్ చేసే సమయంలో సంబంధిత వ్యక్తులకు సీజ్ చేస్తున్న నగదు, బంగారం వివరాలు, ఎక్కడ అప్పీల్ చేయాల్సి ఉంటుంది అనే అంశాలను తెలియజేస్తూ రశీదు అందించాలని చెప్పారు. సీజ్ చేసిన బంగారం, నగదు రూ.10 లక్షల కంటే తక్కువైతే వెంటనే జిల్లా స్థాయిలో ఏర్పాటు చేసిన గ్రీవెన్స్ సెల్‌కు అప్పగించాలని, రూ.10 లక్షల కంటే ఎక్కువ నగదు సీజ్ చేస్తే ఐటీ అధికారులకు అప్పగించాలని సూచించారు. సదరు నగదుపై వచ్చే అప్పీల్‌కు సంబంధిత గ్రీవెన్స్ సెల్, ఐటీ అధికారులు పరిశీలించి నిబంధనలు, ఆధారాల ప్రకారం తదుపరి చర్యలు తీసుకుంటారని తెలిపారు. ఎన్నికల సమయంలో సీజ్ చేసే నగదు, బంగారం, మద్యం, ఇతర విలువైన అభరణాల గురించి మీడియాకు సమాచారం అందించాలని, అలాగే సంబంధిత వ్యక్తులు చేసిన అప్పీల్ అనంతరం విడుదల చేసే నగదు వివరాలను సైతం ప్రెస్‌కు అందించాలని, దీనికి సంబంధించి ఎప్పటికప్పుడు నివేదిక నిర్ణీత నమూనాలో సమర్పించాలన్నారు. ఎన్నికల విధులు నిర్వహించే ఫ్లైయింగ్ స్క్వాడ్ బందాలు, స్టాటిక్ సర్వేలెన్సు బందాలు, వీడియో సర్వేలెన్సు బృందాలతోపాటు తప్పనిసరిగా వీడియో కెమెరా సౌకర్యం ఉండాలన్నారు. ప్రతి తనిఖీ వీడియో కెమెరాలో రికార్డు చేయాలని సూచించారు. జిల్లాలో ఓటర్ స్లిప్పులు త్వరగా ముద్రించి పంపిణీ చేసే విధంగా కార్యాచరణ రూపొందించుకోవాలన్నారు. సామాజిక మాధ్యమాల్లో ఎన్నికల నిర్వహణపై వస్తున్న వదంతులు, అపోహలను నివృత్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని, తక్కువ పోలింగ్ నమోదైన పోలింగ్ కేంద్రాలపై అధిక దృష్టి సారించి పోలింగ్ శాతం పెరిగేలా విస్తృతంగా స్వీప్ కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. ఈ వీడియో సమావేశంలో ఎన్నికల అధికారులు, నోడల్ అధికారులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో చేరిన ఇలిటం నరసింహారెడ్డి



నవతెలంగాణ-ఉప్పల్
ఉప్పల్ అసెంబ్లీ బీజేపీ అధికార ప్రతినిధి ఇలిటం నరసింహారెడ్డి వైద్యారోగ్యశాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు సమక్షంలో శనివారం బీఆర్ఎస్‌లో చేరారు. ఉప్పల్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో గులాబీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా. నరసింహారెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ చేస్తున్న అభివృద్ధికి ఆకర్షితులై పార్టీలో చేరినట్లు తెలిపారు. తెలంగాణలో కేసీఆర్‌కు మించిన నాయకుడు లేడని పేర్కొన్నారు. కులం, మతం తేడా లేకుండా అన్ని రంగాల్లో తెలంగాణ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించే నాయకుడు కేసీఆర్ అని అందుకే బీఆర్ఎస్‌లో చేరానని తెలిపారు.

కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్‌లోకి చేరికలు



నవతెలంగాణ-కాప్రా
ఉప్పల్ నియోజకవర్గం మీర్‌పేట్ హౌసింగ్ బోర్డ్ డివిజన్ ఎన్టీఆర్ నగర్‌కు చెందిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్ నేత రాగిడి లక్ష్మారెడ్డి, ఉప్పల్ ఎమ్మెల్యే అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ ప్రభుదాస్, మాజీ కార్పొరేటర్ గొల్లూరి అంజయ్య, శ్రీనివాస్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. వారికి గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ నాయకత్వంలో రాష్ట్రం ప్రగతి పథంలో దూసుకెళ్తుందన్నారు. చేరిన వారిలో సుతారి వాసు చారి, ఎన్టీఆర్ నగర్ కాలనీ అధ్యక్షుడు శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు నరేష్‌గౌడ్ భీష్మచారి, ప్రధాన కార్యదర్శి, నాగేష్, భాస్కర్, జయమ్మతో పాటు మరో 200 మంది చేరారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి ఎన్. సుధాకర్ చారి, సంజయ్ జైన్, మల్లేష్ యాదవ్, గజ్జల రాజు, ఎండి రిజ్వాన్, జహీర్, అజీజ్, మదన్, అల్లు, కార్తీక్, రాజ్ కుమార్ గౌడ్, సన్నీ గౌడ్, పవన్, కార్తీక్ రెడ్డి, జితేందర్ రెడ్డి, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



బండారి లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో
కాంగ్రెస్‌లో 25 ఏండ్లుగా పనిచేసిన కార్యకర్తలు శనివారం బీఆర్ఎస్‌లో చేరారు. బండారి లక్ష్మారెడ్డి గెలుపునకు బీఆర్ఎస్ లో చేరిన్నట్లు వారు తెలిపారు. చేరిన వారిలో జంగం అశోక్, భిక్షపతి, ఆశన్న, వాసుదేవరావు, భారతమ్మ, రేణుక, పద్మ, మంజు 200 మంది తన అనుచరులతో పార్టీలో చేరారు. వారికి బండారి లక్ష్మారెడ్డి గులాబీ కండువా కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ మెంబర్ నాచారం డివిజన్ కార్పొరేటర్ శాంతి సాయి జన్ శేఖర్, బీఆర్ఎస్ నాయకులు, పాల్గొన్నారు.

అభివృద్ధే బీఆర్ఎస్
అభ్యర్థులను గెలిపిస్తుంది



నవతెలంగాణ-ఉప్పల్
సంక్షేమం, అభివృద్ధి పథకాలే బీఆర్ఎస్ అభ్యర్థుల గెలిపిస్తుందని ఉప్పల్ నియోజకవర్గ ఎన్నికల ఇన్‌చార్జి రావుల శ్రీధర్ రెడ్డి అన్నారు. శుక్రవారం రామంతాపూర్ డివిజన్‌లోని నిర్వహించిన ముఖ్య నాయకుల సమావేశానికి హాజరైమాట్లాడారు. ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి ప్రజలకు వివరించాలని, ప్రతిపక్ష పార్టీల ఎత్తుగడలను తిప్పి కొట్టాలని పార్టీ శ్రేణులకు దిశా నిర్దేశం చేశారు. బండారి లక్ష్మారెడ్డిని భారీ మెజార్టీతో గెలించాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ గంధం జోష్ణ నాగేశ్వరరావు, శ్రీకాంత్‌గౌడ్, రవీందర్, సంపత్‌రావు, సంధ్య తదితరులున్నారు.

మైసమ్మ ఆలయం వద్ద అన్నదానం



నవతెలంగాణ-మేడ్చల్
మేడ్చల్ మండల పరిధి పూడూరు గ్రామంలోని శ్రీ శివ్వంపేట పోచమ్మ-మైసమ్మ ఆలయం వద్ద ఏర్పాటు చేసిన శ్రీదుర్గామాత విగ్రహం వద్ద ఆలయ కమిటీ చైర్మెన్ తాళ్ల సంజీవరెడ్డి కుమారుడు మురళీరెడ్డి ఆధ్వర్యంలో శనివారం అన్నదానం చేశారు. కాగా శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని ఏడో రోజు శ్రీ లలితా త్రిపురసుందరీదేవీగా అమ్మవారిని అలంకరించారు. అన్ని దానాలలో అన్నదానం చాలా గొప్పదని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు మల్లికార్జున్, జీ.శ్రీధర్‌రెడ్డి, కంభం సుమన్, సాయితేజ, భాస్కర్, శ్రీశైలం తదితరులున్నారు.

దుర్గాదేవిని దర్శించుకున్న వజ్రేష్ యాదవ్

నవతెలంగాణ-కీసర
శక్తి స్వరూపిణీ అయిన అమ్మవారిని కొలవడం ద్వారా చేపట్టిన పనులు విజయవంతం అవుతాయని కాంగ్రెస్ పార్టీ మేడ్చల్ నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి తోటకూర వజ్రేష్ యాదవ్ అన్నారు. దేవీ శరన్నవరాత్రి వేడుకల్లో భాగంగా కీసర మండలం కరీంగూడ, రాంపల్లిలోని ఓయూ కాలనీలో ఏర్పాటు చేసిన దుర్గామాతను దర్శించుకున్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ సృష్టికి మూలం అమ్మవారేనని, అమ్మవారిని పూజించడం ద్వారా అష్టైశ్వర్యాలు సిద్ధిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో బోడుప్పల్ కార్పొరేటర్ తోటకూర అజయ్ యాదవ్, కీసర మండల్ అధ్యక్షులు కోళ్ల కృష్ణ యాదవ్, కౌన్సిలర్ పంబల్ల సరితా రమేష్, కీసర మండల్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు శివ రామ్ రెడ్డి,గోధుమ కుంట గ్రామం అధ్యక్షులు కుమార్,కరీంగూడ గ్రామం అధ్యక్షులు నర్సింహా ,కీసర మండల్ గ్రామ అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ ఓబీసీ సెల్ మేడ్చల్ జిల్లా కన్వీనర్ పొట్ట శ్రీశైలం,నాగారం మున్సిపాలిటీ ప్రధాన కరదర్శి వంటేరు సోమి రెడ్డి,రాంపల్లి గ్రామం మాజీ ఉపసర్పంచ్ మైపాల్ రెడ్డి, నాగారం మున్సిపాలిటీ ఉపాధ్యాక్షులు పొట్ట విగ్నేష్ కురుమ,పొట్ట మల్లేష్,భూమయ్య యాదవ్,నాగారం మున్సిపాలిటీ ఓబీసీ సెల్ అధ్యక్షులు గండి శ్రీశైలం గౌడ్ పాల్గొన్నారు.



ఘనంగా బతుకమ్మ సంబురాలు



నవతెలంగాణ-మేడ్చల్
మేడ్చల్ ఆర్టీసీ బస్ డిపోలో శనివారం బతుకమ్మ సంబురాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా కండక్టర్లు సుందరంగా బతుకమ్మలను పేర్చి పాటలు పాడుతూ వేడుకలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా మహిళా కండక్టర్లకు బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ సుధాకర్, అసిస్టెంట్ మేనేజర్ రామారావు, మహిళా ఉద్యోగులు పాల్గొన్నారు.

సీఎంఆర్ వైద్య కళాశాలలో ..
గుండ్లపోచంపల్లి మున్సిపల్ పరిధిలోని కండ్లకొయ్యలోని సీఎంఆర్ వైద్య కళాశాల, ఆసుపత్రిలో శనివారం బతుకమ్మ సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మెన్ గోపాల్ రెడ్డి వైద్య విద్యార్థులు, డాక్టర్లులతో కలిసి బతుకమ్మ సంబురాల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో డాక్టర్లు అలిబెగ్, అనీల్, ఏవో సురేష్, పీఆర్వో దుర్గా ప్రసాద్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

శామీర్‌పేట్‌లో..
ప్రకృతిని, పూలను పూజించే గొప్ప సంస్కృతి తెలంగాణ సొంతమని హాకింపేట ఆర్టీసీ బస్‌డిపో మేనేజర్ భవభూతి అన్నారు. శనివారం హాకీపేట్ బస్ డిపోలో మేనేజర్ భవభూతి ఆధ్వర్యంలో మహిళా కండక్టర్లు బతుకమ్మ సంబురాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మేనేజర్ మహిళా కండక్టర్ లకు కుంకుమ భరణిలు అందజేశారు. బతుకమ్మను తయారు చేసి ముగ్గురు మహిళలకు చీరలు బహుమతిగా అందజేశారు. కార్యక్రమంలో మెకానికల్ ఫోర్ మెన్ సరిత, క్యాష్ డీసీ మీనాకుమారి, మహిళా కండక్టర్లు , అసిస్టెంట్ మేనేజర్ రాజశేఖర్, శంకర్, రమణ, రాములు, గోపు శ్రీనివాస్ పటేల్ పాల్గొన్నారు.





బూత్ ఇన్‌చార్జిలతో కార్పొరేటర్ సమావేశం



నవతెలంగాణ-కూకట్‌పల్లి

కూకట్‌పల్లి డివిజన్ పరిధిలోని 24 బూత్ ఇన్‌చార్జిలతో స్థానిక కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ... వారికి బూత్ స్థాయి ఓటర్ల జాబితా కాపీ పంపిణీ చేసి, బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు చేసిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. ప్రతి ఒక్క ఓటర్‌కు, బూత్ స్థాయి ఇన్‌చార్జ్ ఓటర్‌లకు అందుబాటులో ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో డివిజన్ కార్యదర్శి ప్రభాకర్, కూకట్‌పల్లి నియోజకవర్గం ఎస్సీ సెల్ అధ్యక్షుడు బొట్టు విష్ణు పాల్గొన్నారు.

ప్రజలు దురాలోచనలకు దూరంగా ఉండాలి



కార్పొరేటర్ మేకల సునీత రాము యాదవ్

నవతెలంగాణ-మల్కాజిగిరి

ఆధునిక ప్రపంచంలో దురాలోచనలకు దూరంగా ఉంటూ జీవితంలో ప్రజలు ఆధ్యాత్మికతను అలవర్చుకొని భగవంతునికి చేరువ కావాలని గౌతమ్ నగర్ డివిజన్ కార్పొరేటర్ మేకల సునీత రాము యాదవ్ అన్నారు. శనివారం గౌతమ్ నగర్ డివిజన్ పరిధిలోని ఈస్ట్ ఐ ఎన్ నగర్ లోని శివశక్తి అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన దుర్గామాత వద్ద కార్పొరేటర్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అసోసియేషన్ వారు ఏర్పాటుచేసిన అన్నదాన కార్యక్రమం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ సీనియర్ నాయకులు రాము యాదవ్, బైరు అనిల్ కుమార్, పివి సత్యనారాయణ, శివశక్తి అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

పాలస్తీనా పై దాడులను ఆపి శాంతిని నెలకొల్పాలి



● సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ఉమా మహేష్

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

పాలస్తీనా పై దాడులను ఆపి శాంతి నెలకొల్పాలని సీపీఐ కుత్బుల్లాపూర్ నియోజక వర్గ కార్యదర్శి ఈ. ఉమా మహేష్ అన్నారు. శనివారం జగద్గిరిగుట్ట డివిజన్ పరిధి మగ్దూంనగర్ సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గత 16 రోజులుగా హమాస్ ఉగ్రవాదుల పేరిట ఇజ్రాయిల్ చేస్తున్న దాడుల వల్ల అమాయక ప్రజలు ప్రాణాలు కోల్పోయి, లక్షలాదిమంది ఇతర ప్రాంతాలకు తరలివెళ్లి శరణార్థులుగా బతకడం వారి జీవించే హక్కును నిరకరించడమేనని వెంటనే ఇజ్రాయిల్ పాలిస్తీనా పై చేస్తున్న దాడులను ఆపాలన్నారు. ఒకనాడు ఇజ్రాయెల్ లేదని శరణార్థులుగా వచ్చి చిన్నచిన్నగా పాలిస్తీనాను కబలిస్తూ పాలిస్తీనా పౌరులు తమ భూభాగంలో బతకనివ్వకుండా చెయ్యడం అన్యాయమని వెంటనే పాలిస్తీనాకు స్వతంత్రత ప్రకటించాలని ఐక్యరాజ్య సమితి కూడా చెబుతున్నప్పటికీ అమెరికా మద్దతుతో ఇజ్రాయిల్ పాలిస్తీనాను అక్రమించుకుంటు అనేకమందిని చంపిన చరిత ఇజ్రాయిల్లదని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం ఎప్పుడు కూడా పాలిస్తీనాకు మద్దత్తు ఉందని,కానీ నేడు మోడీ ఇజ్రాయిల్ పై ప్రేమను ఒలకబోస్తూ అమెరికా చేతుల్లో కీలుబొమ్మగా వ్యవహరిస్తూ మన దేశ ఆలీన విధానాన్ని అమలు చేయడం లేదని ఇప్పటికైనా నిజం తెలుసుకొని పాలిస్తీనా ప్రజలకు సంఘీ భావం తెలపాలని అన్నారు. మైనార్టీ జాక్ నాయకులు తాహెర్, మైనార్టీ నాయకులు హమీద్ మాట్లాడుతూ ఇజ్రాయిల్ దాడులను అందరం ఏక కంటంగా కండిస్తూ, ఇజ్రాయిల్ పదార్థాలను వాడకుండా ఉంటే ఇజ్రాయిల్ దెబ్బ తిని తోకముడుస్తుందని భారతీయులు అందరు కలిసి ఆ దేశం చేస్తున్న దూరగతలకు వ్యతిరేకిస్తూ దాడులను ఖండించాలన్నారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ నాయకులు ఖయ్యూం, ఇమామ్,ఖాజా,జహంగీర్, సీపీఐ కార్యవర్గ సభ్యులు వి.హరినాథ్ రావు,నాయకులు ప్రభాకర్ లు పాల్గొన్నారు.

ఈవీఎంల తరలింపునకు ఏర్పాట్లు పూర్తి



● మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్

నవతెలంగాణ-సిటీబ్యూరో

రానున్న అసెంబ్లీ ఎన్నికల దష్యా జిల్లాలోని ఐదు నియోజకవర్గాలకు కేటాయించిన ఈవీఎంల తరలింపునకు ఏర్పాట్లు పూర్తి చేసినట్టు మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్ పేర్కొన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని ఈవీఎం గోడౌన్ నుంచి ఐదు నియోజకవర్గాల కోసం ఏర్పాటు చేసిన కేంద్రాలకు కంట్రోల్ యూనిట్లు, బ్యాలట్ యూనిట్లు, వీవీ ప్యాట్ల తరలింపు కోసం గుర్తింపు పొందిన అన్ని రాజకీయ పార్టీల నాయకులు, ప్రతినిధులతో కలిసి కలెక్టర్ ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో రాజకీయ పార్టీల సమక్షంలో ఆన్‌లైన్ ద్వారా మొదటి దశ ర్యాండమైజేషన్ ప్రక్రియను పూర్తి చేసుకోగా, రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఈవీఎం గోడౌన్‌ను తెరిచి ర్యాండమైజేషన్ ప్రకారం ఓటింగ్ యంత్రాలను సిద్ధం చేస్తామని,ఆ తర్వాత మేడ్చల్, మల్కాజిగిరి, కుత్బుల్లాపూర్, కూకట్‌పల్లి, ఉప్పల్ నియోజకవర్గాల వారీగా డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలకు తరలించి భద్రపరుస్తామని, ఆ తర్వాత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు అబ్జర్వర్ పర్యవేక్షణలో రెండో ర్యాండమైజేషన్ ప్రక్రియను నిర్వహిస్తామని చెప్పారు.

పట్టుకున్న నగదు తీసుకునేందుకు గ్రీవెన్స్ కమిటీ

ఎన్నికల ప్రవర్తనా నియమావళి, నిబంధనల ప్రకారం ఎవరూ రూ.50వేల కంటే ఎక్కువ నగదుతో ప్రయాణం చేయొద్దని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్ అన్నారు. జిల్లా గ్రీవెన్స్ కమిటీ సభ్యులతో శనివారం సమావేశమయ్యారు. జిల్లాలో పోలీసులు, ఎఫ్ఎస్టీ బందాలు తనిఖీల్లో స్వాధీనం చేసుకున్న నగదు, ఇతర వస్తువులను పరిశీలించి విడుదల చేసేందుకు జిల్లాస్థాయి గ్రీవెన్స్ కమిటీని ఏర్పాటు చేసినట్టు వెల్లడించారు. స్వాధీనం చేసుకున్న నగదును విడుదల చేసేందుకు వచ్చిన ఫిర్యాదులు, దరఖాస్తులను కమిటీ కన్వీనర్, జిల్లా సహకార అధికారి శ్రీనివాసమూర్తి కన్వీనర్‌గా డీటీఓ నర్సింహారావు, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారిణి పద్మజారాణి సభ్యులుగా వ్యవహరించనున్నట్టు తెలిపారు. జిల్లా కలెక్టర్ కార్యాలయ సముదాయంలో జిల్లా గ్రీవెన్స్ కమిటీ ఎఫ్-12 లో గ్రీవెన్స్ కమిటీ పరిశీలిస్తుందని, ఆధారాలు లేకుండా ఎక్కువ మొత్తంలో నగదు తీసుకెళ్లొద్దని, అలా దొరికిన నగదును సీజ్ చేసి డిపాజిట్ చేస్తామన్నారు. ఎన్నికలకు సంబంధం లేదని సరైన ఆధారాలు చూపితే తిరిగి ఇచ్చేస్తామని చెప్పారు. అత్యవసర వైద్యం, కళాశాల ఫీజులు, వ్యాపారం, వివాహం ఇతర అవసరాలకు తీసుకెళ్లే వారు సరైన పత్రాలతో నగదు తీసుకెళ్లాలని సూచించారు. ఆధారాలు లేక సీజ్ అయిన నగదు విషయమై సరైన ఆధారాలతో దరఖాస్తు చేసుకునేందుకు గ్రీవెన్స్ కమిటీ కన్వీనర్ జిల్లా సహకార అధికారి శ్రీనివాసమూర్తి ఫోన్ నెంబర్ 9100115724, డీటీఓ నర్సింహారావు నెంబర్ 77999-34204,, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారిణి పద్మజారాణి నెంబర్ 73309-99280లో సంప్రదించాలన్నారు.



కాంగ్రెస్ వేసే ప్రతీ అడుగు ప్రజా సంక్షేమం కోసమే



● టీపీసీసీ అధికార ప్రతినిధి డా.సత్యం శ్రీరంగం

నవతెలంగాణ-బాలానగర్

బాలానగర్ డివిజన్‌లో యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో జరుగుతున్న హత్ జోడో బూత్ జోడో పాదయాత్ర కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన పీసీసీ సభ్యులు, టీపీసీసీ అధికార ప్రతినిధి డా.సత్యం శ్రీరంగం, IYC జాతీయ జనరల్ సెక్రటరీ సురభి, IYC జాతీయ జాయింట్ సెక్రెటరీలు చరిత, ఖలీద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా డా. సత్యం శ్రీరంగం మాట్లాడుతూ తుక్కుగూడ విజయభేరి బహిరంగ సభ వేదికగా సోనియా గాంధీ ప్రకటించిన 6 గ్యారంటీలను వివరిస్తూ రూపొందించిన కరపత్రాలను ప్రజలకు పంపిణీ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 100 రోజులలో గ్యారంటీలను అమలు చేయడం జరుగుతుందన్నారు. ఇంటి ఇంటికి తిరుగుతూ కాంగ్రెస్ పార్టీ పథకాలను వివరించారు. రాష్ట్ర మహిళా ప్రధాన కార్యదర్శి పుష్ప రెడ్డి, మాజీ టీపీసీసీ కార్యదర్శి బండారి నవీన్ గౌడ్, యూత్ కాంగ్రెస్ ఇంచార్జి సునీల్ యాదవ్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు రాయపాటి హరీష్, డివిజన్ అధ్యక్షులు మధు గౌడ్, కృష్ణ రాజ్ పుత్, వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రసన్న కుమార్, యూత్ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

'టీఎస్ఎస్‌పీడీసీఎల్'లో దుర్గామాత పూజలు



నవతెలంగాణ-సిటీబ్యూరో

దక్షిణ తెలంగాణ రాష్ట్ర విద్యుత్ పంపిణీ సంస్థ ప్రధాన కార్యాలయంలో దుర్గా మాత పూజలు ఘనంగా నిర్వహించారు. సీఎండీ కార్యాలయంలో ప్రతిష్ఠించిన దుర్గా మాతను పూజించిన సంస్థ చైర్మెన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ జి.రఘుమారెడ్డి, రాష్ట్రంలో వర్షాలు బాగా పడి, పంటల దిగుబడి పెరిగి రాష్ట్రం ఎల్లప్పుడూ సుభీక్షంగా ఉండేలా కావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు టి.శ్రీనివాస్, జె.శ్రీనివాసరెడ్డి, కె.రాములు, ఎస్.స్వామిరెడ్డి, జి.గోపాల్, సీజీఎంలు సాయిబాబా, ఎల్.పాండ్య, పి.ఆనంద్, నరసింహస్వామి, కష్టారెడ్డి, కె.నందన్‌రావు, బాలస్వామి, సుధారాణి, అధికారులు పాల్గొన్నారు.

పేదల కోసమే... సంక్షేమ పథకాలు



● మర్రి రాజశేఖర్ రెడ్డి

నవతెలంగాణ-నేరేడ్‌మెట్

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పేదల కోసమే సంక్షేమం కోసమే రాష్ట్రంలో వివిధ పథకాలు కొన సాగిస్తుందని మర్రి రాజశేఖర్ రెడ్డి అన్నారు. ఇవి గుర్తించి వచ్చే ఎన్నికల్లో మల్కాజిగిరి నియోజకవర్గంలో బీఆర్ఎస్‌ను గెలిపించాలని మల్కాజిగిరి నియోజకవర్గం అభ్యర్థి మర్రి రాజశేఖర్ రెడ్డి కోరారు. శనివారం ఆయన వినాయక్ నగర్ 137 వ డివిజన్ పరిధిలోలో బద్దం పరుశురాం ఆధ్వర్యంలో ఈస్ట్ ఆనంద్ బాగ్ రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన బీఆర్ఎస్ పార్టీ చేపడుతున్న సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. బీఆర్ఎస్ మేనిఫెస్టో గురించి వాళ్ళకి తెలిపారు. మల్కాజిగిరి ప్రగతికి రాష్ట్ర అభివృద్ధికి ముఖ్యమంత్రి కేసీఆర్ ఆధ్వర్యంలో మరెన్నో కార్యక్రమాలు చేయడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. రాష్ట్ర ముఖ్య మంత్రి కేసీఆర్ ప్రజలకు పలు అభివృద్ధి సంక్షేమ పథకాలు రూపొందించి అమలు చేస్తున్నారని తెలిపారు. కారు గుర్తుకు ఓటు వేసి రాబోయే ఎన్నికల్లో పార్టీ గెలుపు కోసం కృషి చెయ్యాలని విజ్ఞప్తి చేశారు. అక్కడ తమ సొంత బిడ్డ అంటూ వృద్ధ మహిళ చేసినటువంటి వాఖ్యలు నన్నెంత గానో ఆకర్షించాయని తెలిపారు. తమకు ఫించన్ ప్రతి నెలా అందిస్తూ, ఆరోగ్య అవస రాలకు వాళ్లకు అన్ని విధాలుగా అండ దండలుగా నిలిచిన కేసీఆర్ కే మా ఓటు అంటూ మద్దతు తెలిపారు.

ఎమ్మెల్యే అనుచరులు కాంగ్రెస్‌లో చేరిక



● కోలన్ హన్మంత్ రెడ్డి

నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి కోలన్ హన్మంత్ రెడ్డి కుత్బుల్లాపూర్ 131 డివిజన్ పరిధిలోని అంబేద్కర్ నగర్‌లో కాంగ్రెస్ పార్టీ ఎన్నికల కార్యాలయం ప్రారంభించారు. ఈ సందర్భంగా సయ్యద్ అన్వర్, ఖయ్యుమ్, అజీజ్, సమద్ వారి మిత్రబృందంతో దాదాపు 200 మంది ప్రస్తుత బీఆర్ఎస్ ఎమ్మెల్యే అనుచరులు ,131 డివిజన్ సీనియర్ కాంగ్రెస్ నాయకులు, మాజీ వార్డ్ మెంబెర్ మహమ్మద్ జాకీర్ పాషా ఆధ్వర్యంలో కొలన్ హన్మంత్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ప్రస్తుత ఎమ్మెల్యే వద్ద పదేండ్ల పాటు ఎంతో కష్టపడ్డప్పటికి వాళ్ళకి సముచిత న్యాయం జరగలేదని నిరాశతో ఉన్నారని తెలిపారు. అదే సమయంలో కొలన్ హన్మంత్ రెడ్డికి కాంగ్రెస్ పార్టీ అధిష్టానం టికెట్ కేటాయించడంతో వారిపై ఉన్న అభిమానంతో పాటు కాంగ్రెస్ పార్టీ ప్రవేశ పెట్టిన యువ వికాసం పథకానికి ఆకర్షతులై వారంతా కాంగ్రెస్ పార్టీలో చేరమని జాకీర్ పాషా అన్నారు. ఈ సందర్భంగా హన్మంత్ రెడ్డి గెలుపు కోసం తమ శాయ శక్తులా ప్రయత్నం చేస్తామని వారు తీర్మానం చేశారు. యువత కాంగ్రెస్‌లో చేరిన సందర్భంగా కొలన్ హన్మంత్ రెడ్డి మాట్లాడుతూ బీఆర్ఎస్ పాలనలో యువతకు అన్యాయం జరిగిందని.. రానున్న కాంగ్రెస్ ప్రభుత్వంలో యువతకు పెద్ద పీట వేస్తామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డివిజన్ కాంగ్రెస్ సీనియర్ నాయకులు, బ్లాక్ నాయకులు, యువజన కాంగ్రెస్ నాయకులు మహిళా కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పుట్టిన రోజున కేటీఆర్‌ను కలిసిన ఎమ్మెల్యే



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కె.పి. వివేకానంద్ పుట్టిన రోజు సందర్భంగా శనివారం ప్రగతి భవన్‌లో బి.ఆర్.ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ ఐ.టి. పురపాలక శాఖ మంత్రివర్యులు కేటీఆర్ ని కలిసి, పుష్పగుచ్ఛాన్ని అందజేసి ఆశీర్వాదం తీసుకున్నారు.



కుత్బుల్లాపూర్ 131డివిజన్ పరిధిలోని, వెంకటేశ్వర నగర్‌లో "ఫ్రెండ్స్ యూత్ అసోసియేషన్", రంగారెడ్డి నగర్ 127 డివిజన్ పరిధిలోని విజయనగర్ కాలనీలో "శ్రీ దుర్గాంబిక కాశీ విశ్వనాథ ఉత్సవ కమిటీ" శ్రీ దేవి శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన అమ్మవారి మండపం వద్ద, అన్నదాన కార్యక్రమానికి నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రంగారెడ్డి జిల్లా మాజీ డీసీసీ అధ్యక్షులు, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు, కె.యం. ప్రతాప్ విచ్చేసి అమ్మవారికి ప్రత్యేక పూజాలు చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఫ్రెండ్స్ యూత్ అసోసియేషన్ అధ్యక్షులు యాదన్ల శశాంక్ గౌడ్ శ్రీ దుర్గాంబిక కాశీ విశ్వనాథ ఉత్సవ కమిటీ అధ్యక్షురాలు జ్యోతి శ్రీ, మల్లెం శ్రీనివాస్ గౌడ్, సాయిగౌడ్, హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.
నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

డిసెంబర్ 4న చలో ఢిల్లీ : స్కైలాబ్ బాబు



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

దళిత సాధికారత పట్ల గత పదేండ్లుగా మోడీ సర్కారు చూపిస్తున్న వివక్షకు నిరసనగా డిసెంబర్ 4న చలో ఢిల్లీకి దళితులు భారీ సంఖ్యలో తరలిరావాలని కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.స్కైలాబ్ బాబు పిలుపునిచ్చారు. రాజ్యాంగం రిజర్వేషన్లు దళితుల అభివృద్ధికై దళిత డిక్లరేషన్ పోరాడాలని ఆయన అన్నారు. శనివారం కేవీపీఎస్ డీహెచ్‌పీఎస్ సామాజిక ప్రజా సంఘాల ఆధ్వర్యంలో సూరారం స్థానిక అంబేద్కర్ భవన్‌లో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ రౌండ్ టేబుల్ సమావేశానికి దళిత సంఘాల ఐక్య వేదిక అధ్యక్షులు గట్టు అశోక్ అధ్యక్షత వహించారు. డీహెచ్‌పీఎస్ రాష్ట్ర సీనియర్ నాయకులు ఏసు రత్నం కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి ఎన్.బాలపీరు తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన టి.స్కైలాబ్‌బాబు మాట్లాడుతూ.. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 ఏండ్లు పూర్తి చేసుకున్నదనీ కానీ అట్టడుగు వర్గాలైన దళితులు, గిరిజనులు, మహిళలు, మైనార్టీ, వెనుకబడిన తరగతుల అభ్యున్నతి కోసం భారత రాజ్యాంగంలో పొందుపరిచిన హక్కులు వారి దరి చేరలేదన్నారు. తిరోగమన భావజాలం కలిగిన బీజేపీ నేతృతము లోని ఎన్డీఏ ప్రభుత్వం కేంద్రంలో అధికారంలోకి వచ్చిన దగ్గర నుండి రాజ్యాంగ హక్కుల పైన దాడిని తీవ్రతరం చేసిందనీ రాజ్యాంగానికి గుండెకాయ లాంటి ప్రజాస్వామ్యం సామ్యవాదం అనే పదాలను రాజ్యాంగ ప్రవేశిక నుండి తొలగించారనీ ఆవేదన వ్యక్తం చేశారు. పౌరుల ప్రజాతంత్ర హక్కులపై ఉక్కు పాదం మోపుతుంది. 100 రోజుల పని కల్పన కోసం వచ్చిన గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని ఎత్తివేయాలని కుట్ర పన్నుతున్నారన్నారు. ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు కిషన్ రావు, జైబీమ్ మహాసేన రాష్ట్ర అధ్యక్షులు అంజన్న, కేవీపీఎస్ జిల్లా నాయకులు మధు, రాములు, ప్రభాకర్ రెడ్డి, యాదయ్య, మదన్, వెంకట్ రెడ్డి పెద్దలు పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి



● ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించి వారి మన్ననలను పొందాలని కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. కూకట్‌పల్లి నియోజకవర్గం కేపీహెచ్ బీ కాలనీ టెంపుల్ బస్ స్టాప్ వద్ద డాక్టర్ రేష్మి, చెన్న అంజలి సారథ్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన ది.ఏ. ఆర్.సి డెంటల్ ఆసుపత్రిని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణ రావు, స్థానిక కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావులు ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ నాణ్యమైన వైద్యం అందించాలనే సదుద్దేశంతో ఈ హాస్పిటల్‌ను స్థాపించామన్నారు. దంతాలకు సంబంధించిన అన్ని రకాల వైద్య సేవలు రూట్ కెనాల్, ఎత్తు వంకర పళ్ళను సరి చేయడం, ఇంప్లాంట్స్, నోటి క్యాన్సర్ వంటి తదితర చికిత్సలకు సంబందించి వైద్యం చేయడం జరుగుతుంద న్నారు. దంత వైద్యం అంటే తీవ్రనొప్పి చాలా ఖర్చుతో కూడుకున్నదనేది అపోహ మాత్రమేనని, మేము చాల తక్కువ ఖర్చుతో నొప్పి లేకుండా అన్ని రకాల దంత వైద్యం సేవలు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీదేవి అవతారంలో అమ్మవారి దర్శనం



నవతెలంగాణ-బాలానగర్

దేవీ శరన్నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా ఫతేనగర్ డివిజన్ పరిధిలో ప్రజలు అత్యంత భక్తి శ్రద్ధలతో జరుపుకోవాలని, ప్రజలు దసరా పండుగను సంతోషకర వాతావరణంలో జరుపుకోవాలని కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్ సూచించారు. శనివారం డివిజన్ పరిధిలోని గౌతమ్ నగర్‌లో నెలకొల్పిన అమ్మవారి మండపాన్ని ఆయన దర్శించుకుని ప్రత్యేక పూజలలో పాల్గొన్నారు. మండప నిర్వాహకులు కార్పొరేటర్‌ను శాలువాతో ఘనంగా సత్కరించారు. అనంతరం కార్పొరేటర్ సతీష్ గౌడ్ మాట్లాడుతూ శరన్నవరాత్రులలో రోజుకు ఒక అవతారంలో దుర్గాదేవిని భక్తులు అత్యంత శ్రద్ధగా కొలుస్తూ నవరాత్రి వేడుకల్లో ఒకొక్క రోజున ఒకొక్క అమ్మవారి రూపాన్ని పూజిస్తూ రకరకాల సాత్వికాహారాన్ని నైవేద్యంగా సమర్పిస్తారన్నారు. సుమారు మూడు వందల మంది భక్తులకు అన్నదానం నిర్వహించామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో బోగాది విశ్వనాథం, ఎల్లయ్య గౌడ్, లక్ష్మి, బోగాది శేఖర్, బల్చారి, తిల్లు, శ్రీకాంత్, జాహంగీర్ తదితరులు పాల్గొన్నారు.



దేవి శరన్నవరాత్రి మహిూత్సవాలను పురస్కరించుకుని కేపీహెచ్‌బీ డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాలలో ఉత్సవాలు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా రైతు బజార్ వద్ద ఏర్పాటు చేసిన అమ్మవారి మండపాన్ని, 7వ ఫేస్ బాస్కెట్ బాల్ గ్రౌండ్ నందు ఉన్న అమ్మవారి మండపాలను స్థానిక కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అమ్మవారి ఆశీస్సులతో ప్రజలంతా ఆయురారోగ్యాలు ప్రసాదించి పాడిపంటలతో పల్లెలు కళకళలాడుతూ అందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు కృష్ణారెడ్డి, మండప నిర్వాహకులు పాల్గొన్నారు. నవతెలంగాణ-కేపీహెచ్‌బీ



కుత్బుల్లాపూర్ నియోజక వర్గ ఎమ్మెల్యే కేపీ వివేకానంద జన్మదిన సందర్భంగా ఆయన ఇలాంటి పుట్టినరోజు వేడుకలు మరెన్నో జరుపుకోవాలని బీఆర్ఎస్ రాష్ట్ర సీనియర్ నాయకులు కోలన్ శ్రీనివాస్ రెడ్డి తెలిపారు తెలిపారు. ఈ మేరకు శనివారం ఎమ్మెల్యే కేపీ వివేకానంద నివాసానికి వెళ్లి సన్మానించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే భవిష్యత్తులో ఇంకా ఉన్నత పదవులు అధిరోహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నరసింహ యాదవ్, మహేష్ యాదవ్,శ్రీకాంత్ పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు.
నవతెలంగాణ-దుండిగల్



కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే కే.పి. వివేకానంద్ పుట్టినరోజు సందర్భంగా నిజాంపేట్ బాచుపల్లి బౌరంపేట్ కు చెందిన ప్రజా ప్రతినిధులు నాయకులు శనివారం ఎమ్మెల్యేని కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం నిజాంపేట్‌లో మొక్కలు నాటారు., బౌరంపేట్ లోని మల్లికార్జున స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామి వారి ఆశీసులు అందుకున్నారు. నిజాంపేట్ పరిధిలోని ప్రజాప్రతినిదులు, నాయకులు, కార్యకర్తలు వారిని కలిసి శాలువాతో సత్కరించి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. నవతెలంగాణ-దుండిగల్



ఎమ్మెల్యే కేపీ వివేకానంద పుట్టినరోజు సందర్భంగా మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు ప్రభుత్వ విప్ ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, వివేకానంద్‌ను తన కార్యలయంలో కలిసి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ ఎమ్మెల్యే కె.పి. వివేకానంద్‌కి శాలువాతో సత్కరించారు. నవతెలంగాణ-దుండిగల్

శ్రీ దుర్గాదేవి మాత సన్నిధానంలో అన్నదానాలు



నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు పురస్కరించుకొని రంగారెడ్డి నగర్ డివిజన్ పరిధి రంగారెడ్డి నగర్ ప్రాంతంలో స్థానిక శ్రీ దుర్గా దేవి కమిటీ సభ్యులు గత 23 సంవత్సరాలుగా శరన్నవరాత్రి వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ మేరకు శనివారం కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

గుడెన్ మెట్‌లో..

డివిజన్ పరిధి గుడెన్ మెట్ ప్రాంతంలో శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శ్రీ దుర్గా మాత ఉత్సవ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన మంటపం వద్ద శనివారం డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షులు ఏర్వ శంకరయ్య హాజరై ప్రత్యేక పూజలు చేసిన అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో భవాని స్వాములు, కమిటీ సభ్యులు, బీఆర్ఎస్ శ్రేణులు పాల్గొన్నారు.



నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
10
సికింద్రాబాద్ - సనత్‌నగర్ - జూబ్లీహిల్స్
ఆదివారం | అక్టోబర్-22, 2023 | www.navatelangana.com

ఫార్వర్డ్ బ్లాక్‌లో లుకలుకలు అవాస్తవం

ఆర్ వి ఆర్ వి ప్రసాద్

నవతెలంగాణ-బంజారాహిల్స్



కాంగ్రెస్ రెండో జాబితాపై ఆశావాహుల్లో ఉత్కంఠ నెలకొంది. ఇప్పటికే తొలిజాబితాను ప్రకటించిన కాంగ్రెస్ పార్టీ దసరా పండుగ తర్వాత రెండో విడుత జాబితా విడుదలకు రెడీ అయినట్టు తెలుస్తోంది. హైదరాబాద్ , మేడ్చల్ జిల్లాలకు సంబంధించి ఈనెల 15వ తేదీన ప్రకటించిన ఫస్ట్ లిస్ట్‌లో 55 మందిలో గ్రేటర్‌లో 14 మంది అభ్యర్థులకు అవకాశం కల్పించగా.. మరో అయిదు స్థానా లకు అభ్యర్థులను ప్రకటించలేదు. దీంతో మిగిలిన స్థానాల కోసం ఆశావహులు ఆత్రుతగా ఎదురుచూస్తున్నారు. ఒక్కో స్థానంలో ఇద్దరు, ముగ్గురు పోటీపడుతుండగా.. ఆ పార్టీ అధిష్టాన పెద్దలు ఎవరి అభ్యర్థిత్వం వైపు మొగ్గుచూపుతుందోనని అంతా మదనపడుతున్నారు.

కాంగ్రెస్ పార్టీ వచ్చే ఎన్నికల్లో అధికారమే లక్ష్యంగా పావులు కదుపుతోంది. అయితే పార్టీ ఏదైనా అధికారంలోకి రావాలంటే నగరంతో పాటు శివారు నియోజకవర్గాలే అత్యంత కీలకం. ఈ క్రమంలో ఆ పార్టీ గ్రేటర్ అభ్యర్థుల ఎంపికలో అచితూచి అడుగులు వేస్తోంది .ఇప్పటికే ప్రకటించిన వాటితో పాటు పెండింగ్ అసెంబ్లీ సెగ్మెంట్‌లోనూ బలమైన, గెలిచే అభ్యర్థులనే ఎన్నికల బరిలో దించాలని ప్లాన్ చేస్తోంది. మారుతున్న రాజకీయ అనుగుణంగా ఎప్పటికప్పుడు అభ్యర్థుల బలాబలాలపై సర్వేలు చేయించడంతో పాటు ఇతర పార్టీల అసమ్మతి నేతలను కూడా వారి వైపు తిప్పుకునేందుకు తీవ్ర ప్రయత్నాలు చేస్తోంది. ఇప్పటికే పలు సెగ్మెంట్లలో ఇతర పార్టీలకు చెందిన అసమ్మతి నేతలను చేర్చుకున్నది. ముఖ్యంగా ఖైరతాబాద్, జూబ్లీహిల్స్, కూకట్‌పల్లి, అంబర్‌పేట్, ఎల్బీనగర్, శేరిలింగంపల్లి తదితర సెగ్మెంట్లలో తీవ్ర పోటీ నెలకొంది. దీంతో అధిష్టానం అభ్యర్థుల ఎంపిక విషయంలో చాలా జాగ్రత్తలు తీసుకుంటోంది. తొలిజాబితా ప్రకటించిన తర్వాత జరిగిన హంగామా, నిరసనలను పరిగణనలోకి తీసుకుని కీలక నేతలు చేజారకుండా చర్యలు చేపట్టింది. ఇప్పటివరకు రాష్ట్రవ్యాప్తంగా 119 సీట్లలో తొలిజాబితాలో 55 మంది అభ్యర్థిత్వాలను ఖరారు చేసింది. మరో 64 స్థానాల్లో అభ్యర్థులను ప్రకటించాల్సి ఉంది. అందులో వామపక్షాలకు పోనూ 35-40 స్థానాలను దసరా పండుగ తర్వాత ప్రకటించే అవకాశం ఉందని కాంగ్రెస్ వర్గాలు చెబుతున్నాయి.

హైదరాబాద్ జిల్లా నుంచి గత ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరపున నాంపల్లి సెగ్మెంట్ నుంచి పోటీ చేసి ఎంఐఎం అభ్యర్థిపై స్వల్ప తేడాతో ఓడిపోయిన ఫిరోజ్ ఖాన్‌కు ఇక్కడి నుంచి మళ్లీ అవకాశం ఇచ్చింది. గత ఎన్నికల్లో సికింద్రాబాద్ ఎంపిగా పోటీచేసిన టీపీసీసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అంజన్‌కుమార్ యాదవ్‌కు ఈసారి ముషీరాబాద్ టికెట్ కేటాయించారు. మిగతా అభ్యర్థులంతా కొత్తవారే కావడం విశేషం. ఇక మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలోనూ సిట్టింగ్ ఎమ్మెల్యే మల్కాజిగిరి నుంచి మైనంపల్లి హన్మంతరావు ఉండగా.. గతంలో మేడ్చల్ స్థానం నుంచి తోటకూర వజ్రేశ్ యాదవ్ పోటీ చేశారు. ఇక ఉప్పల్ బరిలో నిలిచిన ఎం.పరమేశ్వర్ రెడ్డి మొదటిసారి పోటీ చేస్తున్నారు. ఈయన గతంలో కార్పొరేటర్‌గా పనిచేశారు. వాస్తవానికి తొలిదఫాలో అసమ్మతులు లేని, ఆశావహుల పోటీ తక్కువగా ఉన్నచోట టికెట్లను ఖరారు చేసింది. పార్టీ అంతర్గత సర్వేల్లో ఒక్కరికి పూర్తిగా సానుకూలమని తేలిన నియోజకవర్గాల్లోనే అభ్యర్థులను ప్రకటించినట్టు ఆపార్టీ చెబుతోంది. మిగిలిన చోట్ల ఆచితూచి, అందరికీ ఆమోదయోగ్యమైన అభ్యర్థుల్ని రంగంలోకి దించాలని యోచిస్తోంది. నేడు ప్రకటించే జాబితాలోనూ ఖైరతాబాద్ అసెంబ్లీ సెగ్మెంట్ నుంచి పీజేఆర్ కూతురు ఖైరతాబాద్ డివిజన్ కార్పొరేటర్ విజయా రెడ్డి, రోహిణ్ రెడ్డి పేర్లు ముఖ్యంగా వినిపిస్తుండగా.. ఇందులో విజయా రెడ్డికి ఇక్కడి నుంచి అవకాశం కల్పిస్తే.. రోహిణ్ రెడ్డికి అంబర్ పేట్ టికెట్ కేటాయించే ఛాన్స్ ఉంది. అదే సమయంలో జూబ్లీహిల్స్ టికెట్ అజారుద్దీన్‌కు దాదాపు ఖరారు అయినట్టు తెలుస్తోండగా.. ఈస్థానాన్ని మాజీ ఎమ్మెల్యే విష్ణువర్ధన్ రెడ్డి ఆశిస్తున్నారు. ఇక అంబర్‌పేట్ నుంచి లక్ష్మణ్ యాదవ్, నూతి శ్రీకాంత్ గౌడ్ ఇద్దరిలో ఒకరికి కేటాయించే అవకాశం ఉండగా.. ముదిరాజ్ సామాజిక కోటాలో మోత రోహిత అభ్యర్థిత్వాన్ని సైతం పరిశీలనలో ఉంది. కంటోన్మెంట్ నుంచి గద్దర్ కూతురు వెన్నెల లేదా శ్రీగణేష్ పేర్లు వినిపిస్తున్నాయి. ఇక శేరిలింగంపల్లి నుంచి కొత్తగా ఆ పార్టీలో చేరిన జగదీశ్వర్ గౌడ్‌కు సీటు కేటాయించే అవకాశం ఉంది. ఈ టికెట్‌ను రఘునాథ్ యాదవ్, జయపాల్ ఆశిస్తున్నారు. తాజాగా బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరిన బండి రమేష్‌కు కూకట్‌పల్లి టికెట్ ఖరారు అయినట్టు తెలుస్తోంది. ఈ సెగ్మెంట్ రేసులో శ్రీరంగం సత్యం, మన్నె సతీష్‌తో పాటు మరో ఇద్దరి పేర్లు వినిపిస్తున్నాయి. ఎల్బీనగర్ స్థానం దాదాపు మధుయాష్కీ గౌడ్‌కు ఇచ్చే అవకాశం ఉందని ఆ పార్టీ వర్గాలు చెబుతుండగా..మల్ రెడ్డి రాంరెడ్డి కూడా అవకాశాలు ఉన్నాయని చెబుతున్నారు. చార్మినార్ స్థానం టీడీపీ నుంచి వచ్చిన మస్కత్ అలీకి వచ్చే అవకాశం ఉంది.

ప్రయోజనాల కోసమే కిషన్ రెడ్డి స్వార్థ రాజకీయాలు



- ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్

నవతెలంగాణ-అంబర్‌పేట

కేంద్ర పర్యాటక శాఖ మంత్రి కిషన్ రెడ్డి రూ. వేల కోట్లు సంపాదించి తన ప్రయోజనాల కోసమే స్వార్థ రాజకీయాలు చేస్తున్నారని అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ విమర్శించారు. గతంలో అంబర్‌పేట ఎమ్మెల్యేగా మూడుసార్లు ఎన్నికైనా అంబర్‌పేట నియోజకవర్గ ప్రజలకు, కార్యకర్తలకు ఒరగబెట్టింది ఏమీ లేదన్నారు. బీఆర్ఎస్ పార్టీ బీజేపీ నాయకులను కొనుగోలు చేస్తున్నదని చేసిన వ్యాఖ్యలు హాస్యస్పదంగా ఉన్నాయని, సొంత పార్టీ క్యాడర్ ను కాపాడుకునే ప్రయత్నం చేయాలని హితవు పలికారు. ప్రముఖ సామాజికవేత్త శంకర్ ముదిరాజ్ బీఆర్ఎస్ పార్టీలో చేరిన సందర్భంగా బాగ్ అంబర్‌పేట ధవ హెూటల్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం కేసీఆర్ చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ఆకర్షితులై బీఆర్ఎస్ పార్టీలోకి వస్తున్నారని అన్నారు. 40 సంవత్సరాలుగా బీజేపీకి నిస్వార్థ సేవలందిస్తున్న వారికి కూడా గుర్తింపు దక్కలేదని విమర్శించారు. కేంద్ర మంత్రిగా ఆయన నిధుల నుంచి అంబర్‌పేట నియోజక వర్గానికి ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయలేదని మండిపడ్డారు. త్వరలో మరి కొంతమంది బీజేపీ నాయకులు బీఆర్ఎస్ పార్టీలోకి వచ్చేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. సీఎం కేసీఆర్ నేతత్వంలో గడిచిన ఐదు సంవత్సరాలలో నియోజకవర్గ సుమారు అన్ని శాఖల నుంచి ఎంతో అభివద్ధి సాధించిందని తెలిపారు. అంబర్‌పేట నియోజకవర్గంలో మళ్లీ బీఆర్ఎస్ జెండా ఎగరడం ఖాయమని జోస్యం చెప్పారు. బీఆర్ఎస్ నేత శంకర్ ముదిరాజ్ మాట్లాడుతూ సీఎం కేసీఆర్ నేతత్వంలో తెలంగాణ ఎంతో అభివృద్ధి సాధించిందని చెప్పారు. ముదిరాజ్ కులస్తుల సమస్యల పరిష్కారం కేవలం కేసీఆర్‌తోనే సాధ్యమవుతాయని, అన్ని నియోజక వర్గాలలో ముదిరాజ్ కులస్తులు కారు గుర్తుకే ఓటు వేసి అధిక మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో అంబర్‌పేట కార్పొరేటర్ విజయ్ కుమార్ గౌడ్, బీఆర్ఎస్ నాయకులు మేడి ప్రసాద్, చంద్ర మోహన్, ఆర్మీ బాబు, రెడపాక రాము, మహేష్ ముదిరాజ్, తదితరులు పాల్గొన్నారు.

119 స్థానాల్లో తెలంగాణ పొలిటికల్ ఫ్రంట్ పోటీ



- గొంటి కుమార్ చౌదరి యాదవ్

నవతెలంగాణ-హిమాయత్‌నగర్

నిజాయితీపరులకు ఓటు వేసి ప్రజాస్వామ్యాన్ని గెలిపించాలని సమైక్యాంధ్ర పరిరక్షణ సమితి పార్టీ జాతీయ అధ్యక్షులు గొంటి కుమార్ చౌదరి యాదవ్ పిలుపునిచ్చారు. ఇందులో భాగంగానే రాష్ట్రంలోని సాధారణ ఎన్నికల కోసం 10 రాజకీయ పార్టీలతో 'తెలంగాణ పొలిటికల్ ఫ్రంట్' ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఈ మేరకు శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ ఎన్నికలలో సమైక్యాంధ్ర పరిరక్షణ సమితి పార్టీ, ఆధార్ పార్టీ ఇతర పార్టీలు కలిపి రాబోయే శాసన సభ ఎన్నికలలో 119 స్థానాల్లో పోటీ చేయబోతున్నట్టు తెలిపారు. ప్రస్తుతం తొలి జాబితాలో భాగంగా 12 స్థానాలకు అభ్యర్థులను ప్రకటించారు.మిగతా స్థానాలకు అభ్యర్థులను త్వరలోనే ప్రకటిస్తామన్నారు. కూటమి గుర్తు 'రోటి మేకర్' కు ఓట్లు వేసి గెలిపించాలని కోరారు.అనిల్ రెడ్డి (ఖైరతాబాద్), గోపాలకష్ణ (జూబ్లీహిల్స్), కుమార్ చౌదరి (ఉప్పల్), శ్రీకరణ్ యాదవ్ (సనత్ నగర్), కె.అర్జున్ (మల్కాజ్ గిరి), విక్రమ్ యాదవ్ (ముషీరాబాద్), రాజుగౌడ్ (అంబర్ పేట్), ఎండీ.ఖలీల్ (నాంపల్లి), ఎండీ.అంజాద్ (కార్వాన్), జయశ్రీ గౌడ్ (కుత్బుల్లాపూర్), ప్రసన్న రావు (కూకట్ పల్లి), మారమోని శ్రీశైలం యాదవ్ (పటాన్ చేరు)లకు బి-ఫారంలు అందజేసినట్టు తెలిపారు.

25న దసరా మహిళా సమ్మేళనం

నవతెలంగాణ -సుల్తాన్ బజార్

ప్రపంచంలోనే మొట్టమొదటిసారిగా దసరా మహిళా సమ్మేళనం నవదుర్గ సన్మాన్ పేరిట స్త్రీ హసీనా మహిళ మండలి,. తెలంగాణ మెడికల్ అండ్ హెల్త్ ఉమెన్స్ ఎంపవర్మెంట్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో 25వ తేదీన లుంబిని పార్కులోని బోట్ క్లబ్ లో నిర్వహించనున్నట్టు ఆ సంఘం అధ్యక్షురాలు డాక్టర్ ఎర్రం పూర్ణ శాంతి గుప్తా తెలిపారు. శనివారం కోఠిలోని సంఘం కార్యాలయంలో దసరా మహిళా సమ్మేళనం పోస్టర్‌ను వ్యవస్థాపక అధ్యక్షురాలు శశి శ్రీ తో కలిసి ఆమె ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ దసరా పండుగను పురస్కరించుకొని మాకు మేమే అనే నినాదంతో నవ దుర్గా సన్మాన్ కార్యక్రమాన్ని వినూత్నంగా నిర్వహించనున్నట్లు వారు తెలిపారు. ఇందులో భాగంగా వివిధ రంగాలలో



సమాజంలో మహిళల కోసం పాటుపడుతున్న 9మందిని ఘనంగా సత్కరించనున్నట్టు తెలిపారు. తమ సంఘం మహిళల అభ్యున్నతికి ఎంతో పాటు పడుతుందన్నారు. సమాజంలో మహిళలు అన్ని రంగాలలో అభివృద్ధి చెందాలని ధ్యేయంతో ముందుకు సాగుతున్నామని తెలిపారు. కార్యక్రమంలో జయంతి తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌తోనే ముషీరాబాద్ అభివృద్ధి



- ఎమ్మెల్యే ముఠా గోపాల్

నవతెలంగాణ-ముషీరాబాద్

బీఆర్ఎస్‌తోనే ముషీరాబాద్ అభివృద్ధి సాధ్యం అని ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. మహిళా నాయకులు అనురాధ, ప్రేమలత ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని అడిక్ మెట్ డివిజన్ బ్రహ్మంగారి గుడి దగ్గర సుమారు వందమందికి బీఆర్ఎస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ ప్రభాకర్, ఎమ్మెల్యే ముఠా గోపాల్ మాట్లాడుతూ నియో జకవర్గంలో బీఆర్ఎస్‌తోనే ముషీరాబాద్ అభివద్ధి సాధ్యమైందన్నారు. ప్రజా సమస్యలను అన్ని విధాలుగా పరిష్కరిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర యువనాయకులు ముఠా జైసింహ, నాయకులు నాగభూ షణం, స్థానిక డివిజన్ ప్రెసిడెంట్ శ్రీనివాస్ రెడ్డి, కార్యదర్శి సురేందర్, మాధవ్, బొట్టు శీను, రామాంజనేయ స్వామి దేవాలయం చైర్మెన్ రవి యాదవ్, ఖదీర్, అబ్బు, నేత శీను, లక్ష్మీ గణపతి దేవస్థానం చైర్మెన్ ముచకుర్తి ప్రభాకర్, ఆకారం శ్రీనివాస్, నాగులు, శీను, కిషోర్, గీత రెడ్డి, మంగమ్మ, మాధవి, కవితా తదితరులు పాల్గొన్నారు.



కోఠిలో బతుకమ్మ వేడుకలను తెలంగాణ మెడికల్‌అండ్ హెల్త్ ఉమెన్ ఎంపవర్మెంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమంలో వ్యవస్థాపక అధ్యక్షురాలు కే.శశిశ్రీ, ప్రధాన కార్యదర్శి టి.విజయనిర్మల, డాక్టర్ రమాదేవి , డాక్టర్ అనిత రెడ్డి, డాక్టర్ షీలా, డాక్టర్ మంజులా రెడ్డి, కల్పన, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ హైదరాబాద్ చైర్మెన్ భీమ్ రెడ్డి, ఆయుఖాన్, జ్యోతి యాదవ్ శ్యామల జయంతి,హబిబ్ బేగం చంద్రిక తదితరులు పాల్గొన్నారు. నవతెలంగాణ -సుల్తాన్ బజార్



అమరవీరుల దినోత్సవంలో పాల్గొన్న రాచకొండ సీపీ డీఎస్ చౌహాన్



అమరవీరుల దినోత్సవం నేపథ్యంలో పోలీసుల సేవల పై ప్రత్యేకంగా రూపొందించిన వీడియోను నగర సీపీ సందీప్ శాండిల్య రిలీజ్ చేశారు.. శనివారం బంజారాహిల్స్ లోని కమాండ్ కంట్రోల్ లో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో జాయింట్ సీపీ పరిమళ తదితరులు పాల్గొన్నారు. నవతెలంగాణ-సిటీబ్యూరో

అసెంబ్లీ ఎన్నికల్లో 119 స్థానాల్లో మహిళలతో పోటీ



- జై మహాభారత్ పార్టీ జాతీయ అధ్యక్షులు భగవాన్ శ్రీ అనంత విష్ణు (ప్రభు)
- ఎన్నికల మ్యానిఫెస్టో విడుదల

నవతెలంగాణ-హిమాయత్ నగర్

తెలంగాణలో వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో 119 నియోజకవర్గ స్థానాల్లో మహిళలతో పోటీ చేయనున్నట్టు జై మహాభారత్ జాతీయ అధ్యక్షులు భగవాన్ శ్రీ అనంతవిష్ణు (ప్రభు) తెలిపారు. శనివారం సైఫాబాద్ లోని పార్టీ జాతీయ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన ఎన్నికల మ్యానిఫెస్టో విడుదల చేసి తొలి జాబితాలో 7 స్థానాలకు అభ్యర్థుల పేర్లను ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ పార్టీ అధికారంలోకి రాగానే రాష్ట్రంలో సంపూర్ణ మద్యపాన నిషేధం అమలు, భూలక్ష్మి పథకం కింద అర్హులైన మహిళలకు 200 గజాల స్థలాన్ని ఉచితంగా పంపిణీ, గృహలక్ష్మి పథకం కింద ప్రతీ కుటుంబానికి రూ.32 వేల విలువ చేసే సోలార్ స్టవ్ ఉచితంగా అందిస్తామని తెలిపారు. ఎల్పీజీ గ్యాస్‌ను నిషేధించి ప్రతీ ఇంటికి రూ.50కే గోబర్ గ్యాస్ సిలిండర్ అందిస్తామని, వంటింటికి సరిపడ నిత్యావసర వస్తువులను తక్కువ ధరకే అందించి ప్రజల కష్టాలను తీర్చుతామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉచితంగా విద్యా, వైద్యం అందిస్తామని, రాష్ట్రంలోని గ్రామాల్లో మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడుతామని, జర్నలిస్టుల ఆకస్మిక మతికి రూ.5 లక్షల ఎక్స్ గ్రేషియా అందిస్తామని, సత్వర సహాయం కింద లక్ష రూపాయలు వెంటనే మంజూరు చేస్తామని, జర్నలిస్టుల ప్రయాణ వాహనాలకు రాష్ట్రంలోని అన్ని టోల్ గేట్లలో ఉచిత ప్రవేశం కల్పిస్తామని, వారెంట్ లేకుండా విలేకరులను అక్రమంగా అరెస్టు చేయకుండా నిరోధిస్తామని ఆయన హామీ ఇచ్చారు. పార్టీ రాష్ట్ర నాయకులు రుక్మిణి నాయక్, ఎన్ఆర్ఐ మహ్మద్ ఇక్తార్ ఖాద్రీ, అబ్దుల్ ఖాదర్, షాహనాద్, ఉమా తదితరులు పాల్గొన్నారు.

పండుగలు శాంతియుతంగా జరుపుకోవాలి : ఎమ్మెల్యే



నవతెలంగాణ-అంబర్‌పేట

పండుగలు శాంతియుతంగా జరుపుకోవాలని అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ అన్నారు. శనివారం బాగ్ అంబర్‌పేట డివిజన్ పరిధిలోని మైసమ్మ ఆలయంలో దేవి నవరాత్రి వేడుకలలో భాగంగా ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ బి పద్మ వెంకట్ రెడ్డి, ఆలయ కమిటీ చైర్మెన్ కోట్ల శివకుమార్, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షులు చంద్రమోహన్, సీనియర్ నాయకులు కోట్ల సంతోష్, స్వామి తదితరులు పాల్గొన్నారు.



రామంతాపూర్‌లో జై భావానీ యూత్ అసోసియేషన్ ఆధర్వంలో ఘనంగా దుర్గాభవానీ పూజనిర్వహించారు. ఈ నేపథ్యంలో గురు సాయిశ్రీ నేతృత్వంలో స్వచ్ఛందంగా నిర్వహించిన భరతనాట్యం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. ఈ నేపథ్యంతో జై భవానీ యూత్ అసోసియేషన్ సభ్యులు సాయిశ్రీని ఘనంగా సత్కరించారు. భరతనాట్యం చేసిన పిల్లలకు మెమెంటో అందించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ఆర్గనైజర్ నాసు ఉపేందర్, సభ్యులు వల్ల సుధాకర్, యోగి, ప్రణయ్, ఎస్.సాయితోతపాటు కాలనీవాసులు, మహిళలు పెద్దఎత్తున పాల్గొన్నారు. నవతెలంగాణ-సిటీబ్యూరో

ఎమ్మెల్యే ముఠా గోపాల్‌కే మా మద్దతు



నవతెలంగాణ-ముషీరాబాద్

బీఆర్ఎస్ అభ్యర్థి ఎమ్మెల్యే ముఠా గోపాల్‌కే తమ మద్దతు ఇస్తామని ఆల్ ఇండియా జమైతుల్ అన్సర్ ముషీరాబాద్ నియోజకవర్గం కమిటీ సభ్యులు స్పష్టం చేశారు. శనివారం భోలక్‌పూర్ డివిజన్‌లో బీఆర్ఎస్ మాజీ అధ్యక్షుడు అతికూర్ రెహమాన్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సభ్యులతో ఎమ్మెల్యే ముఠా గోపాల్ సమావేశమయ్యారు. కమిటీ అధ్యక్షుడు ఖాజా బాబర్, కమిటి సభ్యులు మహమ్మద్ కయాసుద్దీన్, మహమ్మద్ ఆదిల్, మహమ్మద్ అజీజుద్దీన్, మహమ్మద్ రషీద్, మహమ్మద్ నూరుద్దీన్, వాహబ్, అజీమ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను కమిటీ సభ్యులు ఘనంగా సత్కరించారు. రానున్న ఎన్నికల్లో ముఠా గోపాల్‌ను అత్యంత మెజారిటీతో గెలిపిస్తామని కమిటి సభ్యులు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆల్ ఇండియా జమైతుల్ అన్సర్ ముషీరాబాద్ నియోజ కవర్గం కమిటీ సభ్యుల సమస్యలను పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ భోలక్‌పూర్ డివిజన్ అధ్యక్షుడు వై.శ్రీనివాస్ రావు, నాయకులు షరీఫుద్దీన్, మునావర్ చాంద్ తదితరులు పాల్గొన్నారు.

భారత్ వరల్డ్ రికార్డ్‌లో చిన్న జీయ్యర్ స్వామి

నవతెలంగాణ-కల్చరల్



సమతామూర్తి పేరిట సర్వ కులాల సమానత్వమే మతమని చాటిన విశిష్టాద్వైత సిద్ధాంత కర్త తత్వవేత్త రామానుజాచార్యుల విగ్రహాన్ని ముచ్చింతల్‌లో ప్రపంచంలోనే రెండో ఎత్తైన విగ్రహం గా ప్రతిష్ట చేసిన చిన్న జీయ్యార్ స్వామి భారత్ వరల్డ్ రికార్డ్ లో నమోదు కెక్కారు. ఈ మేరకు ధ్రువ పత్రం రికార్డ్స్ అధ్యక్షుడు కె.వీ. రమణా రావు పద్మ భూషణ్ త్రిదండి రామానుజ చిన్న జియ్యర్ స్వామి కి ఆయన ఆశ్రమంలో అందజేశారు. రమణా రావు మాట్లడుతూ రామానుజాచార్య విగ్రహం ఏడు వేల టన్నుల పంచ లోహాలతో 216 అడుగుల ఎత్తుతో ప్రతిష్ట చేసిన చిన్న జీయర్ స్వామి ప్రపంచంలో దేశ శాశ్వత కీర్తిని నిలిపారని అన్నారు. ఈ కార్యక్రమంలో అహెూబిల మఠ్ జేయ్యర్ స్వామి, సత్యనారాయణ, భారత్ ఆర్ట్స్ అకాడెమీ అధ్యక్షురాలు లలితా రావు, నటుడు వేణు,కోటేశ్వర రావు, ఉమా మహేశ్వర రావు చలపతి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



నాన్ స్టిక్ వాడుతున్నారా?

దోశలు వేయడానికి నాన్ స్టిక్ పెనం వాడుతున్నారా? అయితే ఇకపై వాటిని పక్కన పెట్టేయండి. ఇనుప దోసె పెనం వాడండి చాలు అంటు న్నారు ఆరోగ్య నిపుణులు. నాన్‌స్టిక్ పెనంపై దోసెలు అంటుకోకుండా వస్తాయి. కానీ ఆరోగ్యానికి మాత్రం మంచివి కాదని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

వీటిపై టెఫ్లాన్ అనే రసాయన పదార్థం పూతలా వుంటుంది. ఆరోగ్యానికి కీడు చేస్తుంది. రసాయనాలు, ఆమ్లాలతో తయారయ్యే నాన్ స్టిక్ వస్తువులను వాడటం ద్వారా కిడ్నీ, కాలేయ సంబంధిత వ్యాధులు ఏర్పడుతాయి.

నాన్‌స్టిక్‌లోని టెఫ్లాన్ అనే రసాయన పదార్థం.. వేడి చేయడం ద్వారా కరిగి తద్వారా ఆహారంలో కలుస్తుందని.. ఫలితంగా అనారోగ్య సమస్యలు ఉత్పన్నమవుతాయి. ఇనుప దోసె పెనంపై దోసెలు పోయడం వాటిని ఆహా రంగా తీసుకోవడం ద్వారా ఆరోగ్యానికి ఎంతో మేలు చేకూరుతుంది. ఇనుప పెనంపై దోసె లను పోయడం ద్వారా రసాయ నాల ప్రభావం వుండదని ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు.

ఈ ఐదూ తినండి..

శరీరంలో రోగ నిరోధక శక్తిని పెంచుకోవటం అత్యంత అవశ్యకం... లేదంటే చిన్న చిన్న మార్పులకే అనారోగ్య సమస్యలు వెంటాడతాయి. మన వంటింట్లో ఉండే కొన్నింటి వల్ల రోగనిరోధక శక్తిని త్వరగా పెంచుకోవచ్చు. మరి అవేంటో చూద్దాం.



❍ పసుపు పాలు... చక్కని ఔషధం. ఇది యాంటీ బాక్టీరి యల్, యాంటీ వైరల్, యాంటీ ఫంగల్‌గా పని చేస్తుంది. పసుపు పాలను తీసుకుంటే జలుబు వంటి సమస్యలు దరిచేరవు.

❍ ఉసిరికాయ... కొందరు నేరుగా తింటే మరికొందరు జ్యూస్ చేసుకొని తాగుతారు. ఉసిరిని ఎలా తిన్నా ఆరోగ్యానికి మంచిదే. యాంటీ ఆక్సిడెంట్స్ ఎక్కువగా ఉండడం వల్ల శీతాకాలంలో ఉసిరి ఎంతో మేలు చేస్తుంది.

❍ నెయ్యి... తక్షణం శక్తిని అందిస్తుంది. చలికాలంలో క్రమం తప్పకుండా ఆహారంలో నెయ్యి తీసుకుంటే ఎంతో మంచిది.

❍ బెల్లంలో ఐరన్ ఎక్కువగా ఉంటుంది. యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. బెల్లం తినడం వల్ల చలికాలంలో దగ్గు, జలుబు సమస్యలు దరిచేరవు.

❍ శీతాకాలంలో నువ్వులు తింటే శరీరానికి లోపలి నుంచి వేడి అందుతుంది. రోగ నిరోధక శక్తి కూడా పెరుగుతుంది. ఈ ఐదు పదార్థాలను తింటే శీతాకాలంలో కరోనా వైరస్‌ను అడ్డుకోవచ్చు.



పుడమికి పుష్పాభిషేకం...



తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతీకగా నిలిచేది బతుకమ్మ పండుగ. ఆడపడుచులు అంతా సంబరంగా జరుపుకునే వేడుక. బంధాలను, అనుబంధాలను గుర్తు చేస్తూ, ప్రకృతిని ఆరాధిస్తూ, తెలంగాణ సాంస్కృతిక వారసత్వాన్ని ప్రపంచానికి చాటిచెప్పే పండుగ బతుకమ్మ. ఇదో పూల పండుగ, ప్రకృతిని పూజించే పండుగ. తొమ్మిది రోజుల పాటు జరిగే ప్రత్యేకమైన పూల సంబరం బతుకమ్మ పండుగ.

ఆశ్వయుజ అమావాస్య నాడు ఎంగిలిపూల బతుకమ్మగా ప్రారంభమయ్యే సంబరాలు తొమ్మిదిరోజులపాటు సాగి సద్దుల బతుకమ్మ రోజు ముగుస్తాయి. ఈ తొమ్మిది రోజుల పాటు మహిళలు చేసే హడావిడి అంతా ఇంతా కాదు. ప్రకృతిలో లభించే ప్రతి పువ్వులను ఏరికోరి తెచ్చి, రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి తమ ఆటపాటలతో పూజిస్తారు. అందరూ కలిసి సంతోషంగా పాటలు పాడుతూ, బతుకమ్మ ఆటలు ఆడతారు. ఒకరు పాడుతుంటే మిగతా వారంతా వారికి వంత పాడతారు. ఎంగిలి పూల బతుకమ్మతో ప్రారంభమయ్యే ఈ వేడుకలు సద్దుల బతుకమ్మతో ముగుస్తాయి. పితృ అమావాస్య రోజు పెద్దలను గౌరవించుకుంటయికూ, అదే సమయంలో బతుకమ్మలను పేర్చి మహిళలు సంబరాలు జరుపుకుంటారు.

బతుకమ్మ పూలకు ప్రత్యేకతలెన్నో

బతుకమ్మ పండుగ జరుపుకోవడానికి ఉపయోగించే పూలకు కూడా ఒక విశేషం ఉంది. ఔషధ గుణాలు ఉన్న పువ్వులను బతుకమ్మలుగా పేర్చడం కోసం ఉపయోగిస్తారు. తంగేడు, గునుగు, బంతి, చేమంతి, కట్ల, సంపెంగ, మొల్ల, సీత జడలు, రుద్రాక్ష, పోక బంతి, మల్లె, మందార, మరువం, పారిజాతం, కమలం, తామర, గన్నేరు గుమ్మడి, గులాబీ, పట్టుకుచ్చులు పూలతో చక్కగా బతుకమ్మలను పేర్చి బతుకమ్మ సంబరాలను జరుపుకుంటారు. బతుకమ్మ సంబరాలలో భాగంగా మహిళలు చక్కగా ముస్తాబై అత్యంత శ్రద్ధతో తయారుచేసిన బతుకమ్మలను తీసుకొని వీధుల్లో అందరూ గుంపుగా కూడి సంబరాలు జరుపుకుంటారు. చిన్న, పెద్ద, ముసలి, ముతక తేడా లేకుండా ప్రతి ఒక్కరూ ఈ సంబరాలలో పాలుపంచుకుంటారు. తెలంగాణ సంస్కృతిని, తెలంగాణ గ్రామీణ జీవనాన్ని ప్రతిబింబించేలా జానపదాలను పాడుతూ ఈ పండుగ జరుపుకుంటారు.

తొమ్మిదిరోజుల వేడుకలు

ఎంగిలిపూల బతుకమ్మగా మొదటి రోజు ఉదయం అత్యంత శ్రద్ధలతో బతుకమ్మలను పేర్చి ఆడిపాడతారు. నువ్వులు, బియ్యం పిండి, నూకలు కలిపి ప్రసాదం తయారు చేస్తారు. 2వ రోజు ఆశ్వయుజ శుద్ధ పాడ్యమి నాడు అటుకుల బతుకమ్మను జరుపుకుంటారు. అటుకులు, పప్పు, బెల్లంతో నైవేద్యం తయారు చేసి అందరూ పంచుకుంటారు. మూడవరోజు ముద్దపప్పు బతుకమ్మతో మహిళలు సంబరాలు చేసుకుంటారు. ముద్దపప్పు, పాలు, బెల్లంతో నైవేద్యం తయారు చేసి స్వీకరిస్తారు. నాలుగవ రోజు నానుబియ్యం బతుకమ్మను జరుపుకుంటారు. నానబెట్టిన బియ్యం, బెల్లం, పాలు కలిపి నైవేద్యం తయారు చేస్తారు. ఇక ఐదవ రోజు అట్ల బతుకమ్మను జరుపుకుంటారు. ఆరవ రోజు బతుకమ్మను జరుపుకోరు. ఆరోజు అలిగిన బతుకమ్మ పేరుతో సంబరాలకు దూరంగా ఉంటారు. మళ్లీ ఏడవ రోజు వేపకాయల బతుకమ్మతో వేడుక చేసుకుంటారు. వేప పండ్లలా బియ్యంపిండిని చుట్టి, వాటిని బాగా వేయించి, వాటిని నైవేద్యంగా సమర్పిస్తారు. ఎనిమిదవ రోజు వెన్నముద్దల బతుకమ్మతో సంబరాలు జరుపుకుంటారు. వెన్న, నువ్వులు, బెల్లం కలిపి నైవేద్యంగా తయారుచేస్తారు. తృణధాన్యాలతో తయారు చేసిన ఈ నైవేద్యాలు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. ఇక తొమ్మిదవ రోజు చివరగా అత్యంత ముఖ్యమైన సద్దుల బతుకమ్మను జరుపుకుంటారు. ఆశ్వయుజ అష్టమి నాడు, అంటే దుర్గాష్టమి నాడు ఐదు రకాల నైవేద్యాలతో సద్దుల బతుకమ్మను ఘనంగా చేసుకుంటారు. సద్దుల బతుకమ్మ రోజు నైవేద్యంగా పెరుగన్నం, చింతపండు పులిహోర, నిమ్మకాయ అన్నం, కొబ్బరి అన్నం, నువ్వుల అన్నం తయారు చేసుకుంటారు. ఇందులో కూడా రక రకాల తృణధాన్యాలను వినియోగిస్తారు.



మహిళల ఆటా పాట

అప్పటి వరకు ఇల్లు, బాధ్యతలు తప్ప మరో ప్రపంచం తెలియని మహిళలు బతుకమ్మ పండుగను మాత్రం సరదాగా జరుపుకుంటారు. ఆనందంగా ఆడుతూ పాడుతూ ఉత్సాహంగా గడిపేస్తారు. అందుకే దీన్ని మహిళల పండుగ అంటారు. రాగిపళ్ళెంలో తంగేడు ఆకులు అమర్చి వాటిపై తంగేడు పూల కట్టలు పేర్చి, మధ్య మధ్యలో ఇతర పూలను వినియోగిస్తూ ఎంతో అందంగా బతుకమ్మను పేరుస్తారు. ముఖ్యంగా బతుకమ్మను పేర్చడానికి తంగేడు, గునుగు, కట్ల పూలను ఎక్కువగా ఉపయోగిస్తారు. పువ్వులతో చక్కగా బతుకమ్మను త్రికోణాకారంలో పేర్చి దానిపై పసుపుతో గౌరమ్మను తయారుచేసి పెడతారు. సాయంత్ర సమయంలో అందరూ తమ బతుకమ్మలను తీసుకుని, ఒక్క చోట చేరి ఆడి పాడి ఆపై బతుకమ్మలను చెరువులో నిమజ్జనం చేస్తారు. నైవేద్యంగా పెట్టిన ప్రసాదాలను మహిళలు ఒకరికొకరు పంచుకుంటారు. ఇస్తినమ్మ వాయనం పుచ్చుకుంటినమ్మ వాయనం అంటూ పళ్లెంలో తెచ్చిన నీళ్లతో వాయినాలు ఇచ్చి పుచ్చుకుంటారు. ఈ ఊరు ఆ ఊరు అన్న తేడా లేకుండా రాష్ట్ర వ్యాప్తంగా బతుకమ్మ సంబరాలు అంబరాన్ని తాకుతాయి. లక్షలాదిగా మహిళలు పట్టు చీరలు కట్టుకొని, పుత్తడి బొమ్మల్లా ముస్తాబై సద్దుల బతుకమ్మను జరుపుకుంటారు. పేద, ధనిక అనే తారతమ్యం లేకుండా ప్రతి ఒక్కరూ ఒక్క చోట చేరి ఆడి పాడి సంతోషంగా గడుపుతారు.

ఆచార, సాంప్రదాయాల ప్రతిబింబం

బతుకమ్మ పాటలు ఆచారాలు, సాంప్రదాయాలు, పద్ధతులు తెలిపేలా బతుకమ్మ పాటలను పాడతారు. బతుకమ్మ పాటలలో పురాణ, ఇతిహాస కథలు మొదలుకొని తెలంగాణ వీరుల కథలు, జానపద ఇతివృత్తాలు కూడా ఉంటాయి. ముఖ్యంగా బతుకమ్మ పాటల్లో తెలంగాణ సంస్కృతి ప్రతిబింబిస్తుంది. బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో బంగారు బతుకమ్మ ఉయ్యాలో అంటూ పాడే పాటలు మొదలుకొని ఒక్కేసి పువ్వేసి చందమామ ఒక్క జాములాయె చందమామ, చిత్తూ చిత్తూల బొమ్మ శివుడీ ముద్దుల గుమ్మ అంటూ పాటలు మహిళల నోటి నుండి జాలువారుతాయి. ఇంత చక్కని, అందరూ సమిష్టిగా జరుపుకునే అందమైన, అద్భుతమైన పండుగ ప్రపంచంలోనే బతుకమ్మ ఒక్కటే అని చెప్పటం మన రాష్ట్రానికే గర్వకారణం.

బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో ...

ఎంగిలి పూలతో మొదలై...
సద్దుల బతుకమ్మ దాకా ముచ్చటైన
ఈ తొమ్మిది రోజుల పండగ లో
నువ్వుల, పిండిల నైవేద్యాలతో
ఎత్తుకుని ఊరేగి ఒక్కోచోట గుమిగూడి
ఒక్కేసి పువ్వేసి చందమామ ...
లాలించి, బుజ్జగించి ఆటపాటలతో
ఆరాధించి, ఆనందించి ప్రకృతి కి
నీరాజనం అందించే పండగ
మన తెలంగాణ బతుకమ్మ !
తంగేడుతో తన్మయం ...
గునుగుపూలతో గుండె సందడి
చామంతి తో చప్పట్ల సవ్వడి
ముద్దబంతి తో మురిపాలు
పారిజాత పరిమళాలు..
మల్లెలతో మధురిమలు
..ఎన్నో ఇంకెన్నో పువ్వులతో
నడిమిట్ల తామర పువ్వులో
పసుపు ముద్ద గౌరమ్మగా !
పువ్వులన్నీ కలకాలం వర్ధిల్లాలని
కథలు - కథలుగా ఆట పాటలతో
ఎలుగెత్తిన గొంతుకలు అంబరాన్ని
తాకేలా ఆరాధనతో పూజలు ...!
పువ్వులు వికసించాలంటే
తరువులు తాజాగా ఉండాలని
ప్రకృతి పదిలంగా ఉంటేనే
భావితరాలకు భవిష్యత్తు అన్న
సత్యాన్ని బతుకమ్మతో ప్రపంచానికి
చాటి చెప్పడం మన తెలంగాణ
అదృష్టంగా ఈ బతుకమ్మ !
కట్టు, బొట్టు, పసుపు, పారాణి, పట్టు
వస్త్రాల ముస్తాబుతో మహిళలు
సంబరంగా జరుపుకునే పండగ
తెలంగాణ సంప్రదాయాలను
మారుమోగించే పండగ మన
బతుకమ్మ!

- న్యాలకంటి నారాయణ,
9550833490

ఇజ్రాయిల్ వెనుక అమెరికా సామ్రాజ్యవాదం

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

ఇజ్రాయిల్ వెనుక అమెరికా సామ్రాజ్యవాదం ఉందని, ప్రపంచంలో జరుగుతున్న అనేక ఇతర యుద్ధాల వెనుక కూడా అమెరికా పాత్ర స్పష్టంగా ఉందని యుకె పార్లమెంటు ఎంపీ, లేబర్ పార్టీ నేత జెరెమీ కార్బిన్ అన్నారు. పాలస్తీనా ప్రజలపై దశాబ్దాలుగా సాగుతున్న ఇజ్రాయిల్ క్రూరత్వాన్ని ఆయన ఖండించారు. ముంబాయి పర్యటనలో ఉన్న జెరెమీ కార్బిన్‌తో శనివారం ఆల్ ఇండియా కిసాన్ సభ (ఏఐకేఎస్) ఆధ్వర్యంలో చర్చలు జరిగాయి. ప్రోగ్రెసివ్ ఇంటర్నేషనల్ (పిఐ)కి చెందిన వర్ష జీఎస్ పరిచయ వ్యాఖ్యలతో సమావేశం ప్రారంభమైంది. అక్కడ ఆమె పిఐ కృషిని, శాంతి, న్యాయం కోసం జెరెమీ పోషించిన పాత్రను వివరించారు. ప్రపంచవ్యాప్తంగా ముఖ్యంగా శ్రామికవర్గం కోసం పిఐ చేపట్టిన పని, అమెజాన్ కార్మికులు మొదలైన వాటిని సంఘటితం చేయడం, ప్రపంచవ్యాప్తంగా కార్మికుల ప్రతిఘటన గురించి ప్రస్తావించారు.జెరెమీ కార్బిన్ యుకెలోని రాజకీయ సమస్యలు, కార్పొరేట్లు, వారి ప్రభుత్వానికి వ్యతిరేకంగా శ్రామిక వర్గ పోరాటం, మితవాద ప్రపంచ పెరుగుదల, భారతదేశ రైతుల ఉద్యమానికి మద్దతుగా యుకె పార్లమెంట్‌లో చర్చ మొదలైన వాటి గురించి మాట్లాడారు. పాలస్తీనా ప్రజలపై దశాబ్దాలుగా ఇజ్రాయిల్ చేస్తున్న క్రూరత్వాన్ని ఆయన ఖండించారు ఇజ్రాయిల్ వెనుక అమెరికా సామ్రాజ్యవాదం ఉందని, ప్రపంచంలో జరుగుతున్న అనేక ఇతర యుద్ధాల వెనుక కూడా ఇది స్పష్టంగా కనపడుతుందని ఆయన అన్నారు. పాలస్తీనాకు మద్దతుగా, ఇజ్రాయిల్‌కు వ్యతిరేకంగా యుకెలోనూ మిగిలిన ప్రపంచంలోనూ ఇటీవల నిర్వహించిన భారీ నిరసన ప్రదర్శనల గురించి వివరించారు. ఆయన వెంటనే తిరిగి లండన్‌కు బయలుదేరి అక్కడ భారీ నిరసన ప్రదర్శనలో పాల్గొనబోతున్నానని తెలిపారు. పాలస్తీనా ప్రజలకు ప్రపంచ మద్దతును పెంచేందుకు 2,00,000 మంది ప్రజలతో ఆందోళనలు నిర్వహిస్తున్నామని అన్నారు. లాటిన్ అమెరికా, ఐరోపాలో వివిధ వామపక్ష ఉద్యమాలను ఆయన ప్రశంసించారు. పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి జ్యోతిబసుతో తన చిరస్మరణీయ సమావేశాలను వివరిస్తూ ఆయన ఆనందించారు.

లాటిన్ అమెరికాలోని వివిధ ప్రగతిశీల ఉద్యమాలపై జెరెమీతో కలిసి శాంతి, న్యాయ ప్రాజెక్ట్ వ్యవస్థాపకురాలు లారా అల్వారెజ్ ప్రసంగించారు. ఆమె భారతదేశంలో తన అనుభవాల గురించి, ప్రగతిశీల, సామాజిక ఉద్యమాలు ప్రజాపక్షానికి నాయకత్వం వహించడం ఎలా కష్టతరంగా మారుతుందో తెలిపారు. మోడీ ప్రభుత్వం ఇంటర్నెట్ షట్‌డౌన్‌లు, టెలికమ్యూనికేషన్ దిగ్బంధాలపై ఆమె తన వేదనను వ్యక్తం చేశారు. ఎంత ప్రతికూల పరిస్థితులు ఎదురైనా భారతదేశంలో వామపక్షాలు, అభ్యుదయవాదులు చేస్తున్న కృషిని ఆమె కొనియాడారు.ఏఐకేఎస్ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ అశోక్ ధావలే జెరెమీ కార్బిన్ దృఢమైన సామ్రాజ్యవాద వ్యతిరేక, సామ్యవాద నిబద్ధతను అర్ధ శతాబ్దానికి పైగా నొక్కి చెప్పారని వివరించారు. ఇది ఆయనను ఒక గొప్ప వ్యక్తిగా నిలిపిందన్నారు. ఆయన 1983 నుండి గత 40 సంవత్సరాలుగా బ్రిటిష్ పార్లమెంటుకు నిరంతరం ఎన్నికయ్యారన్నారు. 2015 నుండి 2019 వరకు అతను లేబర్ పార్టీ నాయకుడిగా, పార్లమెంటులో ప్రతిపక్ష నాయకుడిగా కూడా ఉన్నారని తెలిపారు. ఆయన ఎల్లప్పుడూ భారతదేశానికి మిత్రుడని, చారిత్రాత్మక రైతుల పోరాటానికి గట్టిగా మద్దతు ఇచ్చారని తెలిపారు. అశోక్ ధావలే వచ్చే ఏడాది భారతదేశంలో, యుకె రెండు దేశాల్లో సాధారణ ఎన్నికలలో ప్రజాస్వామ్య రాజకీయ మార్పును సాధించడానికి అన్ని ప్రయత్నాలను ఏకం చేయాలని పిలుపునిచ్చారు. భారతదేశమంతటా భారీ ప్రదర్శనలతో పాలస్తీనా ప్రజలకు సంఘీభావం తెలియజేయాలని కూడా ఆయన పిలుపునిచ్చారు.

వామపక్షాల తరపున సీపీఐ ప్రకాష్ రెడ్డి జెరెమీ కార్బిన్‌కు పుష్పగుచ్ఛం ఇచ్చి ఆహ్వానించగా, ప్రముఖ సినీ నిర్మాత ఆనంద్ పట్వర్ధన్ లారా అల్వారెజ్‌ను, ప్రజా మేధావి సంజీవ్ చందోర్కర్ వర్ష జీఎస్‌ను అభినందించారు. సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ ఉదయ్ నార్కర్‌ను జెరెమీకి నెహ్రూ జాకెట్‌ను బహూకరించారు. దానిని ఆయన అక్కడే వేసుకున్నారు. ఐద్వా ప్రధాన కార్యదర్శి మరియం ధావలే లారా అల్వారెజ్‌కు శాలువా కప్పి, సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ వివేక్ మోంటెరోలు జెరెమీ, లారాలకు జ్ఞాపికలను అందజేశారు. చివరగా డాక్టర్ అశోక్ ధావలే భారతదేశం, మహారాష్ట్రలో రైతుల పోరాటాలపై మూడు పుస్తకాలను జెరెమీకి అందించారు.అనంతరం సభకు హాజరైన వారి ప్రశ్నలకు జెరెమీ క్లుప్తంగా సమాధానం ఇచ్చారు. ఈ సమావేశ విశాల స్వభావాన్ని ప్రశంసించారు. మహారాష్ట్రలోని దాదాపు 35 మంది వామపక్ష నేతలు, ప్రగతిశీల మేధావులు ఈ సమావేశానికి హాజరయ్యారు. వారిలో ట్రేడ్ యూనియన్, బ్యాంక్ యూనియన్, ఉపాధ్యాయ సంఘాల నేతలు, పాత్రికేయులు, ప్రగతిశీల మేధావులు, సాంస్కృతిక కార్యకర్తలు, మహిళా సంఘాల, విద్యార్థి నాయకులు, మహారాష్ట్రలోని సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్ కె ఎం) నాయకులు పాల్గొన్నారు.

న్యూస్‌క్లిక్ కేసులో... జ్యుడీషియల్ కస్టడీ పొడిగింపు

- మరో ఐదు రోజులు పెంచుతూ ఢిల్లీ కోర్టు ఆదేశాలు



న్యూఢిల్లీ : న్యూస్‌క్లిక్ వ్యవస్థాపకులు ప్రబీర్ పుర్కాయస్త జ్యుడీషియల్ కస్టడీని ఢిల్లీ కోర్టు మరో ఐదు రోజులు పొడిగించింది. అలాగే, మానవ వనరుల (హెచ్‌ఆర్) విభాగం అధిపతి అమిత్ చక్రవర్తి జ్యుడీషియల్ కస్టడీని సైతం పొడగించింది. ఈ మేరకు న్యాయస్థానం ఆదేశాలు జారీ చేసింది. తదుపరి కస్టడీని కోరుతూ ఢిల్లీ పోలీసులు వారిని కోర్టు ముందు ప్రవేశపెట్టారు. ఈ మేరకు అదనపు సెషన్స్ జడ్జి హర్దీప్ కౌర్ వారి కస్టడీని పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. చైనా అనుకూల వార్తలు ప్రసారం చేస్తున్నదన్న ఆరోపణలపై ఉగ్రవాద వ్యతిరేక చట్టం యూఏపీఏ కింద ఢిల్లీ పోలీసులు ఈనెల 3న ప్రబీర్ పుర్కాయస్థ, అమిత్ చక్రవర్తిలపై కేసు నమోదు చేసి అరెస్టు చేసిన విషయం విదితమే. వీరి అరెస్టులకు దేశవ్యాప్తంగా జర్నలిస్టు సంఘాల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. మోడీ సర్కారు మీడియాపై కుట్రపూరితంగా వ్యవహరిస్తున్నదని జర్నలిస్టులు ఆరోపించారు.

ఊరికి దారేదీ..!

(మొదటిపేజీ తరువాయి)

సంబంధాలు తెగిపోతున్నాయి. ఇలా ప్రతి సంవత్సరం 8 నెలలపాటు నానా ఇబ్బందులు పడుతున్నారు. ఆ సమయంలో ఎవరికైనా అనారోగ్యం చేస్తే.. నాటువైద్యంతో సరిపెట్టాల్సి వస్తోంది. గర్భిణులకు కాన్పు కోసం ఇతర ప్రాంతాల్లో ఉన్న ఆస్పత్రులకు వెళ్లాలంటే కుదరదు. ఈ గ్రామంలో ఆర్‌ఎంపీ వైద్యుడు తప్ప ఆధునిక వైద్య సదుపాయం లేదు. ప్రభుత్వ వైద్యులు ఇక్కడికి వచ్చే ధైర్యం చెయ్యరు. గ్రామంలో వైద్యం అందక గతంలో ఎంతో మంది ప్రాణాలు కోల్పోయిన ఘటనలున్నాయి.ఆ వూరి యువకులకు బయటి ప్రాంతాల నుంచి సంబంధాలు రావడం లేదు. ఊళ్లో, ఊళ్లో సంబంధాలే తప్ప బయటి నుంచి పిల్లనివ్వడానికి ఎవరూ ముందుకు రావటంలేదు. దశాబ్ద కాలం నుంచి ఉన్న తమ సమస్యలు పరిష్కరించాలని మొత్తుకుంటున్నా.. ప్రజాప్రతినిధులకు వినతిపత్రాలు ఇస్తున్నా ప్రయోజనం ఉండట్లేదు. బీఆర్‌ఎస్ నేతలు కూడా హామీలు ఇస్తున్నారే తప్ప అమలు చెయ్యట్లేదని గ్రామస్తులు తెలిపారు. కాజ్‌వే బ్రిడ్జిని నిర్మిస్తామని ఇచ్చిన హామీ అమలవ్వలేదు. ఆ దిశగా ప్రభుత్వం నుంచి ఎలాంటి ప్రయత్నమూ జరగలేదు. 2018 ఎన్నికల శంఖారావంలో ముఖ్యమంత్రి కేసీఆర్ గుర్రంగడ్డ బ్రిడ్జిని 9 నెలల్లోనే పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. రెండు నెలల తర్వాత ఆర్డర్ కాపీ ఇచ్చారు. పనులు మొదలుపెట్టినా 10శాతం కూడా పూర్తి కాలేదు. దీంతో ఆ ఊరి ప్రజల కష్టాలు తీరని వెతలుగా మారాయి. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి వెంటనే పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని పలు రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు కోరుతున్నాయి.

గుర్రంగడ్డ పూర్తి చేసి ప్రజల కష్టాలు తీర్చాలి
వెంకటస్వామి, సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి, గద్వాల

రాష్ట్ర ప్రభుత్వం 2018లో ఇచ్చిన హామీ నిలబెట్టుకోవాలి. ఎన్నికల సందర్భంగా గద్వాల నడిబొడ్డున ముఖ్యమంత్రి హోదాలో కేసీఆర్ గుర్రంగడ్డ బ్రిడ్జిని నిర్మిస్తామని హామీ ఇచ్చారు. ఐదు సంవత్సరాలు కావస్తున్నా బ్రిడ్జి నిర్మాణ పనులు పూర్తి కాలేదు. పనులు పూర్తి చేసి గుర్రంగడ్డ ప్రజల కష్టాలు తీర్చాలి.

ఏపీ హైకోర్టు అడిషనల్ జడ్జీలుగా నలుగురు ప్రమాణం

అమరావతి : ఏపీరాష్ట్ర హైకోర్టుకు అడిషనల్ జడ్జీలుగా నియమితులైన నలుగురితో ఏపీ గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ శనివారం ప్రమాణ స్వీకారం చేయించారు. విజయవాడలోని తుమ్మళపల్లి కళాక్షేత్రంలో జస్టిస్ హరినాథ్ నూనెపల్లి, కిరణ్మయి మండవ, జగడం సుమతి, న్యాపతి విజయ్‌లు అదనపు న్యాయ మూర్తులుగా ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఏపీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, ఏపీ రాష్ట్ర హోంమంత్రి తానేటి వనిత, మంత్రులు అంబటి రాంబాబు, తదితరులు హాజరయ్యారు.

కార్మికులకు ఏం చేస్తారో మ్యానిఫెస్టోల్లో చేర్చాలి

- వర్కర్స్ మ్యానిఫెస్టో అంశాలను పరిగణనలోకి తీసుకోవాలి
- టీపీసీసీ అధ్యక్షులు రేవంత్‌కి ఉద్యోగ, కార్మిక సంఘాల వినతి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఆయా పార్టీలు అధికారంలోకి వస్తే కార్మికులకు ఏం మేలు చేస్తారనే అంశాలను తమ మ్యానిఫెస్టోల్లో పొందుపర్చాలని కేంద్ర, రాష్ట్ర కార్మిక సంఘాల నేతలు డిమాండ్ చేశారు. తాము తయారు చేసిన వర్కర్స్ మ్యానిఫెస్టోలోని అంశాలను పరిగణనలోకి తీసుకుని కార్మికులకు మేలు చేసే చర్యలు తీసుకోవాలని కోరారు. శనివారం హైదరాబాద్‌లో కేంద్ర, రాష్ట్ర కార్మిక సంఘాల ఆధ్వర్యంలో టీపీసీ అధ్యక్షులు ఎ.రేవంత్‌రెడ్డికి వినతిపత్రంతో పాటు వర్కర్స్ మ్యానిఫెస్టోను అందజేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్, ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాలరాజు, హెచ్‌ఎంఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రెబ్బా రామారావు, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సూర్యం, టీఎన్‌టీయూసీ రాష్ట్ర అధ్యక్షులు ఎంకే బోసు, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.శ్రీనివాస్ పాల్గొన్నారు. రాష్ట్రంలో పదేండ్లుగా కార్మికులు, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని సమ్మెలు, ఉద్యమాలు చేపట్టినా బీఆర్‌ఎస్ ప్రభుత్వం సానుకూలంగా స్పందించలేదని విమర్శించారు. ఎన్నికల సందర్భంలో కార్మికులకు అనేక హామీలిచ్చి విస్మరించడం పార్టీలకు ఆనవాయితీగా మారిందన్నారు. కోటి మందికిపైగా కార్మికులు, ఉద్యోగుల న్యాయమైన సమస్యలను తెలంగాణ రాష్ట్ర ఉద్యోగ, కార్మిక సంఘాలు ఉమ్మడిగా చర్చించి వర్కర్స్ మ్యానిఫెస్టోను రూపొందించాయన్నారు. దీనిని పలు పార్టీల అధ్యక్షులకు అందజేస్తామన్నారు. వర్కర్స్ మ్యానిఫెస్టోలోని అంశాలపై కాంగ్రెస్ పార్టీ సానుకూలంగా స్పందించాలని కోరారు. రాష్ట్రంలో కోటి మందికి ప్రయోజనం కల్గించే 73 షెడ్యూల్డ్ ఎంప్లాయిమెంట్ కనీస వేతనాలను సవరించాలనీ, కనీస వేతనం రూ.26 వేలు నిర్ణయించాలని డిమాండ్ చేశారు. లేబర్ కోడ్‌ల రద్దు, కాంట్రాక్టు-ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలు, పరిష్కారాలు, పాత పెన్షన్ పునరుద్ధరణ, మెడిసిన్‌పై జీఎస్టీ ఎత్తేసి ధరలు తగ్గించడం, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, స్కీమ్ వర్కర్లు, స్థానిక సంస్థల్లో పనిచేసే మున్సిపల్, గ్రామపంచాయతీ సిబ్బంది సమస్యల పరిష్కారం, ప్రభుత్వ రంగ సంస్థలు, కార్పొరేషన్లలో పనిచేసే కార్మికులు, ఉద్యోగులు, అసంఘటిత రంగ కార్మికుల సమస్యలను మ్యానిఫెస్టోలో పొందుపర్చామని తెలిపారు. వాటన్నింటిపైనా పార్టీలు తమ వైఖరిని స్పష్టంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు.

24 గంటల్లో 9.69 కోట్లు స్వాధీనం

(మొదటిపేజీ తరువాయి)

31,961 లీటర్ల మద్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. దీని విలువ రూ.1.35 కోట్లు ఉంటుందని అధికారులు తెలిపారు. దీనితో ఈనెల 9 నుంచి 21వ తేదీ వరకు మొత్తం రూ.13.58 కోట్లు విలువైన 72,302 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. అలాగే గడచిన 24 గంటల్లో రూ.72.34 లక్షలు విలువైన 232.73 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. దీనితో ఎలక్షన్ కోడ్ అమల్లోకి వచ్చినప్పటి నుంచి ఈనెల 21వరకు మొత్తం రూ.15,23 కోట్లు విలువైన 3,672.795 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్టు అధికారులు తెలిపారు. ఈనెల 20వతేదీ ఉదయం 9 నుంచి 21వ తేదీ ఉదయం 9 గంటల వరకు జరిగిన తనిఖీల్లో రూ.3.81 కోట్ల విలువైన 3.162 కిలోల బంగారం, 11.407 కిలోల వెండిని జప్తు చేశారు. దీనితో ఈనెల 9 నుంచి 21వ తేదీ వరకు మొత్తం రూ.145.67 కోట్లు విలువైన బంగారం, వెండి, వజ్రాలను స్వాధీనం చేసుకున్నట్టు ఎన్నికల సంఘం అధికారులు తెలిపారు. అలాగే ఉచితాల పేరుతో ప్రజలకు పంచేందుకు సిద్ధం చేసిన రూ.26.93 కోట్లు విలువైన బియ్యం, చీరలు, ల్యాప్‌టాప్‌లు, కుక్కర్లు, క్రీడా సామాగ్రిని స్వాధీనం చేసుకున్నారు. గడచిన 24 గంటల్లో మొత్తం స్వాధీనాల విలువ రూ.18.01 కోట్లు కాగా, ఈనెల 9 నుంచి 21వ తేదీ వరకు స్వాధీనం చేసుకున్న వాటి విలువ రూ.307.02 కోట్లుగా ఉన్నదని అధికారులు తెలిపారు.

ఎన్నికల ఏర్పాట్లు పూర్తిచేయండి:
క్షేత్రస్థాయి అధికారులకు సీఈఓ వికాస్‌రాజ్ ఆదేశాలు

అసెంబ్లీ ఎన్నికల నోటిఫికేషన్ తేదీకి గడువు సమీపిస్తున్నందున అన్ని రకాల ఏర్పాట్లు త్వరితగతిన పూర్తిచేయాలని ప్రధాన ఎన్నికల అధికారి (సీఈఓ) వికాస్‌రాజ్ క్షేత్రస్థాయి అధికారుల్ని ఆదేశించారు. శనివారంనాడాయన ఆయా జిల్లాల్లోని ఈఆర్‌ఓలు, ఆర్‌ఓలు, సీనియర్ అధికారులతో తన కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. పలుచోట్ల పనులు ఇంకా అసంపూర్తిగా ఉన్నాయనీ, వాటిని తక్షణం పూర్తిచేయాలని చెప్పారు. ప్రజలు, రాజకీయపార్టీల నుంచి వస్తున్న ఫిర్యాదులను వారి దృష్టికి తెచ్చారు. జిల్లా గ్రీవెన్స్ కమిటీని అవసరాన్ని బట్టి సమావేశపర్చాలనీ, హేతుబద్ధమైన కేసులను పరిష్కరించాలని ఆదేశించారు. తనిఖీల్లో జప్తు చేస్తే, తప్పనిసరిగా రశీదులు ఇవ్వాలనీ, దానికి సంబంధించి ఎవరైనా అసంతృప్తితో ఉంటే ఎవరికి అప్పీలు చేసుకోవాలో కూడా చెప్పాలని సూచించారు. ఫిర్యాదుల కమిటీ గురించి ప్రజల్లో విస్తృత ప్రచారం చేయాలన్నారు. డీజీపీ అంజనీకుమార్ మాట్లాడుతూ ఓటర్లలో విశ్వాసాన్ని పెంచేలా చర్యలు తీసుకోవాలన్నారు. పోలీసు నిఘా, పనితీరు ప్రజల దృష్టిని ఆకర్షించేలా ఫ్లాగ్‌మార్చ్, డ్రోన్లతో చిత్రీకరణ వంటి చర్యలు చేపట్టాలన్నారు. నగదు, మద్యం, బంగారం వంటివి పట్టుబడినప్పుడు తప్పకుండా రశీదులు ఇవ్వాలని రాష్ట్ర వ్యయ పర్యవేక్షణ నోడల్ అధికారి మహేశ్ భగవత్ చెప్పారు. ఎన్నికల విధుల్లోని అధికారులు అసంపూర్తి నివేదికలు కాకుండా, స్పష్టమైన తీర్మానాలను పంపాలని అడిషనల్ సీఈఓ లోకేష్‌కుమార్ కోరారు. ఏఏ ఫారాల్ని దేనికోసం వినియోగించాలనే వివరణల్ని జాయింట్ సీఈఓ సర్ఫరాజ్ అహ్మద్ తెలిపారు. పోస్టల్ బ్యాలెట్ అవసరమైన వారికి 12-డి ఫారమ్‌ను వెబ్‌సైట్లలో అప్‌లోడ్ చేయాలని డిప్యూటీ సీఈఓ సత్యవాణి కోరారు.

త్యాగాలతోనే విజయాలు సాధ్యం

(మొదటిపేజీ తరువాయి)

అమరవీరుల సంస్మరణ, ఫ్లాగ్‌డే కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. దేశానికి స్వాతంత్ర్యం లభించాక అంతర్గత భద్రతలు సుభీక్షంగా ఉంచడానికి వందలాది మంది పోలీసులు విధి నిర్వహణలో తమ ప్రాణాలను అర్పించారని ఆయన కొనియాడారు. దేశవ్యాప్తంగా ఈ సంవత్సరం ఇప్పటి వరకు విధి నిర్వహణలో 189 మంది పోలీసులు అమరులయ్యారని ఆయన వారికి శ్రద్ధాంజలి ఘటించారు. ఎన్ని అవాంతరాలు వచ్చినా మొక్కవోని దీక్షతో పోలీసులు శాంతిభద్రతల పరిరక్షణ కోసం నిరంతరం కృషి చేస్తున్నారని తెలిపారు. మారుతున్న కాలానికి అనుగుణంగా పోలీసులు సాంకేతిక పరిజ్ఞానాన్ని ఆసరాగా చేసుకొని నేరస్థుల కుట్రలను ఎప్పటికప్పుడు భగ్నం చేయాల్సినవసరం ఉన్నదని అన్నారు. దేశంలోనే అత్యుత్తమ పోలీసు వ్యవస్థగా రాష్ట్ర పోలీసు శాఖ నిలిచిందనీ, ముఖ్యంగా షీ టీమ్స్ మహిళల భద్రత విషయంలో సాధిస్తున్న విజయాలకు దేశవ్యాప్తంగా గుర్తింపు లభించిందనీ, పలు అవార్డులు కూడా లభించాయని ఆయన అన్నారు. అలాగే, పాస్‌పోర్టు జారీ వ్యవస్థలో పోలీసు శాఖ విధులు అత్యంత చురుకుగా సాగి అందరి మన్ననలు అందుకున్నాయని ఆయన అన్నారు. అంతకుముందు పోలీసు అమరవీరుల స్థూపం వద్ద డీజీపీ అంజనీకుమార్‌తో పాటు నగర పోలీసు కమిషనర్లు సందీప్ శాండిల్య, ఇంటెలిజెన్స్ అదనపు డీజీ అనిల్ కుమార్, ఇతర సీనియర్ ఐపీఎస్ ఆఫీసర్లు శివధర్‌రెడ్డి, సౌమ్య మిశ్రా, జితేందర్, కె. శ్రీనివాస్‌రెడ్డి, సంజయ్ జైన్ లు పుష్ప గుచ్చాలుంచి శ్రద్ధాంజలి ఘటించారు. వీరితో పాటు పలువురు రిటైర్డ్ డీజీపీలు, సీనియర్ ఐపీఎస్ అధికారులు కూడా స్థూపం వద్ద పుష్ప గుచ్చాలుంచి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం సాయుధ పోలీసులు నిర్వహించిన అమరవీరుల సంస్మరణ కవాతు అత్యంత ఆకర్షణీయంగా నిలిచింది. ఈ కార్యక్రమంలోనే 'అమరులు వీరు' అనే పుస్తకాన్ని డీజీపీ ఆవిష్కరించారు. అలాగే, పోలీసు అమరవీరులకు శ్రద్ధాంజలిగా పలువురు పోలీసులు రక్తదానం చేశారు.

మేమే ముందుంటాం

(మొదటిపేజీ తరువాయి)

ఉద్యోగ నియామకాలు, సంక్షేమ ం, రాష్ట్ర స్థూల ఉత్పత్తి తదితరాం శాలు ఎలా ఉన్నాయి..? రాష్ట్రం వచ్చిన తర్వాత వాటి పరిస్థితేంటి..? అనే విషయాలను ఆయన ఈ సందర్భంగా ఏకరువు పెట్టారు. ప్రతిపక్ష కాంగ్రెస్‌పైన, ఆ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ, పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిపైనా కేటీఆర్ విరుచుకుపడ్డారు. 2004 నుంచి 2014 వరకూ కాంగ్రెస్ హయాంలో ఏపీపీఎస్సీ ద్వారా 24 వేల ఉద్యోగాలను ఇస్తే, తమ హయాంలో 2014 నుంచి ఇప్పటి దాకా లక్షా 34 వేల కొలువులను ఇచ్చామంటూ గుర్తు చేశారు. ఇంకా 90 వేల నియామకాలు వివిధ దశల్లో ఉన్నాయని వివరించారు. ఈ రకంగా చూసినప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వంలో ఏడాదికి కేవలం వెయ్యి ఉద్యోగాలను మాత్రమే ఇస్తే.. బీఆర్ఎస్ సర్కారు సంవత్సరానికి 13 వేల ఉద్యోగాలను ఇచ్చిందని చెప్పుకొచ్చారు. విద్య, వైద్యం, మౌలిక వసతుల కల్పన, తాగు, సాగునీరు, పెట్టుబడులు, సంక్షేమం... ఇలా ఏ రంగంలోనూ కాంగ్రెస్ తమతో పోటీ పడలేదని విమర్శించారు. ఈ వాస్తవాలన్నింటినీ మరిచిన కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ... బీఆర్ఎస్‌ది కుటుంబ పార్టీ, కేసీఆర్ హయాంలో ఇసుక మాఫియా, అవినీతి పెరిగిందంటూ వ్యాఖ్యానించటం విడ్డూరంగా ఉందన్నారు. ఈసారి రాష్ట్రానికి వచ్చేటప్పుడు కొంచెం తెలుసుకుని రండంటూ రాహుల్‌కు చురకలంటించారు. కర్నాటక ఎన్నికల్లో అనేక హామీలను గుప్పించిన కాంగ్రెస్... ఇప్పుడు అక్కడ ఐదు గంటలపాటు కరెంట్ కోతలు విధిస్తోందని విమర్శించారు. తెలంగాణలో మాదిరిగా చత్తీస్‌ఘడ్‌లో పండిన ప్రతీ గింజనూ అక్కడి ప్రభుత్వం కొంటున్నదా..? అని ప్రశ్నించారు. వీటిపై సమాధానం చెప్పకుండా సుద్దులు చెబితే ఎలా అంటూ నిలదీశారు.



ఎన్నికల సమయం కాబట్టి వివిధ పార్టీల్లో చేరికలు కొనసాగుతుండటం సహజమేనని కేటీఆర్ ఈ సందర్భంగా అభిప్రాయపడ్డారు. అయితే బీఆర్ఎస్ నుంచి నాయకులు వెళ్లిపోయినంత మాత్రాన ఓటర్లు మాత్రం మారబోరని చెప్పారు. గత ఎన్నికల్లో ఖమ్మం జిల్లాలో పార్టీకి నేతలు అనేక మంది ఉన్నా... ఒక్క సీటును గెలిచాం, కానీ ఇప్పుడు అనేక మంది పార్టీని వీడారు, అందువల్ల అక్కడ సీట్లు పెరుగుతాయని భావిస్తున్నామని వ్యాఖ్యానించారు. వ్యక్తులు మారినంత మాత్రాన వ్యవస్థ మారబోదని యన కామెంట్ చేశారు. ఖమ్మం జిల్లాలో కొంత మంది నేతలు పార్టీని శాసించే స్థితికి వెళ్లిపోయారు, అందువల్ల కఠినంగా ఆలోచించి ధృడ నిర్ణయాలు తీసుకోవాల్సి వచ్చిందని పేర్కొన్నారు. లెఫ్ట్ పార్టీలను ఎందుకు దూరం చేసుకున్నారంటూ విలేకరులు అడగ్గా... 'వామపక్షాలంటే మాకు గౌరవం లేక కాదు.. లెక్క కుదరలేదంతే...ప్రతిపక్షాలకు అవకాశమివ్వకూడదని భావించాం. ఏదేమైనా ఆయా పార్టీలకు బీఆర్ఎస్ దూరమవటం దురదృష్టకరం...' అని సమాధానమిచ్చారు. రాష్ట్రంలో బీజేపీకి వ్యతిరేకంగా పోరాడుతున్నది బీఆర్ఎస్, వామపక్షాలేనని చెప్పారు. రాష్ట్ర ప్రజలకు సీఎం కేసీఆర్ నాయకత్వ పటిమపై ఉన్న అచంచల విశ్వాసమే తమ పార్టీని విజయ తీరాలకు చేరుస్తుందని కేటీఆర్ ఈ సందర్భంగా ఆశాభావం వ్యక్తం చేశారు.

ఈ సారొస్తే..జాబ్ క్యాలెండర్

రాష్ట్రంలో ఇప్పటికే అమలవుతున్న పథకాలపై ఎన్నికల సంఘం ఆంక్షలు విధించటం గురించి ప్రస్తావించగా...'పథకాలొక్కటే కాదు, కరెంటు ఇవ్వొద్దంటూ డిస్కామ్‌ల మీద ఒత్తిడి తెస్తున్నారు.. నిధులు విడుదల చేయొద్దంటూ ఆర్థిక సంస్థల మీద ఆంక్షలు విధిస్తున్నారు.. గత తొమ్మిదిన్నరేండ్లుగా అనేక రకాల ఇబ్బందులు పెట్టారు...' అంటూ కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. మూడోసారి అధికారంలోకి వచ్చాక ఉద్యోగాలకు సంబంధించి జాబ్ క్యాలెండర్‌ను కచ్చితంగా అమలు చేస్తామన్నారు. 'ఉద్యమకారులందర్నీ బీఆర్ఎస్‌లో చేర్చుకుంటున్నారు కదా..? మరి కోదండరామ్‌ను చేర్చుకుంటారా..?' అని అడగ్గా... ఆయన ఇప్పటికే రాహుల్ గాంధీని కలిశారు కదా..? అని ఎదురు ప్రశ్నించారు. కాంగ్రెస్ అనేది కుంభకోణాల కుంభమేళా అంటూ ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ నేతలు మాట్లాడితే బీఆర్ఎస్ అనేది బీజేపీకి బీ-టీమ్ అంటున్నారనీ, వాస్తవానికి మహారాష్ట్రలో మతతత్వ పార్టీ అయిన శివసేనతో కలిసి నిన్నటిదాకా ప్రభుత్వంలో ఉన్నది కాంగ్రెస్ కాదా..? అని ప్రశ్నించారు. మేఘాలయలో మొన్నటిదాకా కాంగ్రెస్, బీజేపీ కలిసే పని చేశాయని గుర్తు చేశారు. మక్తల్, మణికొండ మున్సిపాల్టీల్లో ఇప్పుడు కూడా ఆ రెండు పార్టీలు కలిసే పని చేస్తున్నాయని విమర్శించారు. కాంగ్రెస్, బీజేపీల రాష్ట్ర నేతలు ఢిల్లీకి బానిసలంటూ ఆయన ఈ సందర్భంగా ఘాటుగా వ్యాఖ్యానించారు. ఎంఐఎం అనేది మతతత్వ పార్టీ కాదనీ, అది తమకు ఫ్రెండ్లీ పార్టీ అని చెప్పుకొచ్చారు.

కుంగిన లక్ష్మీగడ్డ బ్యారేజీ వంతెన

- భారీ శబ్దంతో అడుగుమేర వాలిన బ్రిడ్జీ
- తెలంగాణ- మహారాష్ట్ర మధ్య నిలిచిన వాహనాల రాకపోకలు



భూపాలపల్లి: కాళేశ్వరం ప్రాజెక్టులోని లక్ష్మీ(మేడిగడ్డ) బ్యారేజీ వంతెన కుంగిపోయింది. బ్యారేజీ బీ బ్లాక్‌లోని 18,19,20,21 పిల్లర్ల మధ్య ఈ ఘటన చోటుచేసుకుంది. బ్యారేజీ మీదుగా రాకపోకలు సాగించేందుకు నిర్మించిన వంతెన ఒక అడుగు మేర కుంగినట్లు స్పష్టంగా కనిపిస్తోంది. శనివారం రాత్రి 7 గంటల సమయంలో ఒక్కసారిగా భారీ శబ్దం రావడంతో వంతెన మీదుగా రాకపోకలు సాగిస్తున్న వాహనదారులు గమనించి అధికారులకు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న సంబంధిత అధికారులు, పోలీసులు అక్కడికి చేరుకుని కుంగిన ప్రదేశాన్ని పరిశీలించారు. వెంటనే వంతెన పైనుంచి రాకపోకలను నిలిపివేశారు. దీంతో తెలంగాణ- మహారాష్ట్ర మధ్య వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. వంతెనకు, బ్యారేజీకి కలిపి పిల్లర్లు కలిసే ఉంటాయి. దీంతో బ్యారేజీకి, ప్రాజెక్టుల గేట్లకు ప్రమాదం పొంచి ఉన్నట్లు అనుమానాలకు తావిస్తోంది. దీనిపై ఈఈ తిరుపతిరావు వివరణ కోరగా ప్రస్తుతం ప్రమాదమేమీ లేదని, వంతెన ప్రాంతం చీకట్లో ఉండటంతో స్పష్టత లేదని పేర్కొన్నారు. ఆదివారం ఉదయం ఇంజినీరింగ్ అధికారులు, నిపుణులతో క్షేత్రస్థాయిలో పరిశీలించి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. ఈ విషయమై అనుమానాలు ఉన్నాయని మహదేవపూర్, సిరోంద పోలీసులకు ఫిర్యాదు చేయాలని ఈఈ తిరుపతిరావు ఆదేశించామని ఈఎన్‌సీ నల్లా వెంకటేశ్వర్లు తెలిపారు.

ఉద్యోగాలు తగ్గుతున్నాయ్

న్యూఢిల్లీ : దేశంలో ఉపాధి రంగం కుదేలు అవుతోంది. ప్రభుత్వ ఆర్థిక విధానాలు కొత్త ఉద్యోగాల సృష్టికి ఎలాంటి ఉత్సాహాన్ని ఇవ్వకపోవడంతో సంఘటిత రంగంలో కొత్త ఉద్యోగాలు తగ్గాయి. ప్రస్తుత ఏడాది ఆగస్టులో కొత్త ఉద్యోగాల నమోదులో తగ్గుదల చోటు చేసుకుందని ఎంప్లాయిస్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్ (ఈపీఎఫ్) గణంకాలు వెల్లడించాయి. ఈ ఏడాది జులైతో పోల్చితే గడిచిన ఆగస్టులో కొత్త ఉద్యోగాల కల్పన 13.3 శాతం పతనం చోటు చేసుకుంది. జులైలో 10.6 లక్షల కొత్త ఈపీఎఫ్ చందాదారులు నమోదు కాగా.. ఆగస్టులో ఇది 9,25,984కు పడిపోయింది. ఈపీఎఫ్ఓ శుక్రవారం విడుదల చేసిన పేరోల్ డేటా ప్రకారం.. జులైలో 2,85,424 మహిళ సబ్‌స్రయిబర్లు నమోదు కాగా.. ఆగస్టులో 26.7 శాతం పతనమై 2,43,510గా ఉన్నారు. జులైలో 18-28 ఏండ్ల యువ చందాదారులు 7,26,415తో 67.97 శాతం వాటాను కలిగి ఉన్నారు. ఆగస్టులో 6.32 లక్షలతో 68.3 శాతం వాటాను కలిగి ఉన్నారు. పేరోల్ డేటా సంఘటిత రంగంలో ఉపాధి కల్పనను ట్రాక్ చేయడానికి సహాయపడుతుంది. నేషనల్ స్టాటిస్టికల్ ఆఫీస్ (ఎన్ఎస్ఓ) కూడా దేశంలో ఉపాధి పోకడలను విశ్లేషించడానికి ఈపీఎఫ్ఓ డేటాను ఉపయోగిస్తుంది. మరోవైపు గడిచిన ఆగస్టులో ఈపీఎఫ్ నికర చందాదారులు 0.8 శాతం పెరిగి 16.9 లక్షలుగా నమోదయ్యారు. జులైలో ఇది 16.8 లక్షలుగా ఉంది. ప్రస్తుత పండగ సీజన్‌లో కొత్త చందాదారుల్లో పెరుగుదల చోటు చేసుకోవచ్చని టీమ్‌లీజ్ సర్వీసెస్ ప్రతినిధి రితుపర్ణ చక్రవర్తి తెలిపారు. సెంటర్ ఫర్ మానిటరింగ్ ఇండియన్ ఎకానమీ (సీఎంఐఈ) ప్రకారం.. ఆగస్టులో దేశంలో నిరుద్యోగం జులైలో 7.9 శాతం నుంచి 8.1 శాతానికి పెరిగింది. ఆర్థిక వ్యవస్థ కొత్త ఉద్యోగాలను సృష్టించలేకపోయిందని పేర్కొంది.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.

'గగన్‌యాన్' టీవీ-డి ప్రయోగం విజయవంతం



సూళ్లూరుపేట .భారత అంతరిక్ష పరిశోధన సంస్థ చంద్రయాన్-3, ఆదిత్య-ఎల్1 ప్రయోగ విజయాలతో రెట్టింపు ఉత్సాహంతో చేపట్టిన సరికొత్త ప్రయోగంలో రాకెట్ తొలుత మొరాయించింది. ఆ తర్వాత కొద్దిసేపటికే లోపాన్ని సరిచేసి విజయవంతంగా ప్రయోగించారు. తిరుపతి జిల్లా సూళ్లూరుపేటలోని సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ నుంచి శనివారం ఉదయం 8.45 గంటలకు ప్రయోగించాలనుకున్న టివి డి1 రాకెట్ పైకి లేవకపోవడంతో ప్రయోగాన్ని వాయిదా వేసినట్లు షార్ అధికార వర్గాలు తొలుత ప్రకటించాయి. ఆటోమేటిక్ లాంచ్ సీక్వెన్స్‌లోని ఆన్ బోర్డ్ కంప్యూటర్ ప్రయోగాన్ని ఆపేశారు. కౌన్‌డౌన్ పూర్తయినప్పటికీ సాంకేతిక లోపం వల్ల అనుకున్న సమయానికి రాకెట్ ప్రయోగం చేయలేకపోయారు. ఈ లోపాన్ని సరిచేసి గంటా 15 నిమిషాలు లేటుగా మళ్లీ ప్రయోగించారు. శ్రీహరికోట రాకెట్ ప్రయోగ కేంద్రంలోని మొదటి ప్రయోగ వేదికపై నుండి ఉదయం పది గంటలకు ప్రయోగాన్ని విజయవంతం చేశారు. భవిష్యత్తులో మానవ సహిత రాకెట్ ప్రయోగాల కోసం జరిపే పరిశోధనల్లో భాగంగా మానవ రహిత క్రుమాడ్యులును ప్రయోగించారు. 4,520 కిలోల బరువున్న ఈ మాడ్యూల్ 17 కిలోమీటర్ల ఎత్తు వరకు వెళ్లి అక్కడ నుండి ప్యారాచూట్ల సహాయంతో శ్రీహరికోటకు సరిగ్గా పది కిలోమీటర్ల దూరంలో బంగాళాఖాతం సముద్రంలో పడిపోయింది. నేవీ సహాయంతో తిరిగి ఈ మాడ్యూల్‌ను వెనక్కు తీసుకురావడంతో ప్రయోగం విజయవంతమైనట్లు షార్ అధికారులు ప్రకటించారు. భవిష్యత్‌లో ఇలాంటి మాడ్యూళ్లలో మనుషులను పెట్టి పైకిపంపనున్నారు. అవి తిరిగి సురక్షితంగా భూమి మీదకు చేరుకునేలా పరీక్షల నిమిత్తం ఈ ప్రయోగాన్ని ఇస్రో నిర్వహించింది. ఇలాంటి ప్రయోగాలు విజయవంతమైతే అంతరిక్ష పర్యటనలు సులభతరం కానున్నాయి.

బీఆర్ఎస్ పార్టీలో చేరిన డాక్టర్ చెరుకు సుధాకర్

- గులాబీ కండువా కప్పిన కేటీఆర్. హరీశ్ రావు



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

నల్లగొండ జిల్లాకు చెందిన సీనియర్ నాయకులు, టీపీసీసీ ఉపాధ్యక్షులు డాక్టర్ చెరుకు సుధాకర్ బీఆర్ఎస్ పార్టీలో చేరారు. శనివారం హైదరాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మంత్రి హరీశ్ రావు కలిసి ఆయన గులాబీ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. బీసీ నేతల విషయంలో పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డితోపాటు కాంగ్రెస్ నేతల తీరును నిరసిస్తూ డాక్టర్ చెరుకు సుధాకర్ ఆ పార్టీకి రాజీనామా చేసిన విషయం తెలిసిందే. ఏ పదవీ లేకపోయినా భరించవచ్చు గానీ ఆత్మగౌరవం లేని రాజకీయ ప్రయాణం నిష్ప్రయోజనం అని భావించి రాజీనామా చేస్తున్నట్టు శుక్రవారం ఆయన ప్రకటించిన సంగతి తెలిసిందే. కాంగ్రెస్ పార్టీలో ఆర్థిక పరిపుష్టి కలిగిన పొంగులేటి శ్రీనివాసరెడ్డి వంటి వారికే ప్రాధాన్యం ఇస్తున్నారనీ, మధుయాష్కీ వంటి బీసీ నేతల స్థాయిని తగ్గిస్తూ అవమానకరంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. కాంగ్రెస్ చెప్తున్న సామాజిక న్యాయం కేవలం రాహుల్‌గాంధీ, ప్రియాంకాగాంధీ మాటల్లో తప్ప ఆచరణలో లేదని విమర్శించారు. ఉదయపూర్ డిక్లరేషన్ ప్రకారం బీసీలకు సీట్లు ఇస్తామన్న కాంగ్రెస్ పార్టీ చివరకు మోసం చేసిందని దుయ్యబట్టారు. బీసీలకు కేటాయించిన 12 సీట్లలో ఐదు చోట్ల ఎప్పుడూ కాంగ్రెస్‌కు డిపాజిట్ రాలేదని చెప్పారు. వీటిని పట్టుకుని బీసీలకు 12 సీట్లు ఇచ్చామంటూ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి వెక్కిరింపు మాటలు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. పొన్నాల లక్ష్మయ్య రాజీనామా సమయంలో రేవంత్‌రెడ్డి అత్యంత అవమానకరంగా మాట్లాడారని ఆగ్రహం వ్యక్తంచేశారు.

ఈ కార్యక్రమంలో మంత్రి జగదీశ్ రెడ్డి, ఎమ్మెల్యేలు గొంగిడి సునీత, చిరుమర్తి లింగయ్య, గాయకుడు ఏపూరి సోమన్నతో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

భూపాలపల్లిలో ఉద్రిక్తత

- పేదల గుడిసెలను తొలగించే యత్నం
- డోజర్‌ను అడ్డుకున్న గుడిసెవాసులు

నవతెలంగాణ-భూపాలపల్లి

భూపాలపల్లిలో పేదలు గుడిసెలు వేసుకున్న ప్రాంతంలో శనివారం ఉద్రిక్తత ఏర్పడింది. గుడిసెలను రెవెన్యూ, మున్సిపల్, పోలీస్ అధికారులు తొలగించే ప్రయత్నం చేశారు. డోజర్‌ను గుడిసెవాసులు అడ్డుకోవడంతో అధికారులు వెనుదిరిగారు.

జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని పాత ఎర్ర చెరువు సర్వే నంబర్ 280లో సీపీఐ ఆధ్వర్యంలో ఏడాది కిందట పేదలు గుడిసెలు వేసుకున్నారు. శనివారం రాత్రి భూపాలపల్లి తహసీల్దార్ శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ కె.అనిల్ కుమార్ ఆధ్వర్యంలో అధికారులు పోలీసు బందోబస్తు నడుమ డోజర్‌తో గుడిసెలను తొలగించే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో గుడిసెవాసులు డోజర్‌కు అడ్డంగా నిలబడ్డారు. డోజర్ ముందుకు కదలకుండా సీపీఐ పట్టణ కార్యదర్శి సొత్కు ప్రవీణ్ కుమార్ పడుకొని నిరసన వ్యక్తం చేశారు. గుడిసెలను తొలగిస్తే ఆత్మహత్య చేసుకుంటామని పేదలు హెచ్చరించారు. దీంతో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. సంవత్సర కాలంగా స్పందించిన అధికారులు ఇప్పుడు గుడిసెలను తొలగించడం ఏంటని సీపీఐ నాయకులు ప్రశ్నించారు. పై అధికారుల ఆదేశం మేరకు తొలగిస్తున్నామని రెవెన్యూ అధికారులు చెప్పారు. కలెక్టర్‌ను కలిసి వివరిస్తామని సీపీఐ నాయకులు చెప్పడంతో అధికారులు వెనుదిరిగారు.

ఢిల్లీలో స్విట్జర్లాండ్ మహిళ హత్య.. అనుమానమే కారణం..

న్యూఢిల్లీ: ఢిల్లీలోని తిలక్ నగర్ ప్రాంతంలో శుక్రవారం స్విట్జర్లాండ్ మహిళ హత్యకు గురైంది. ఈ కేసును పోలీసులు ఛేదించారు. ఈ కేసులో ఓ వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. లీనా బెర్గర్(30) అనే మహిళ మతదేహాన్ని శుక్రవారం ఉదయం ప్రభుత్వ పాఠశాల సమీపంలోని బ్యాగులో గుర్తించారు. ఈ కేసులో గురుప్రీత్ సింగ్ అనే వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. స్విట్జర్లాండ్ లో పరిచమైన లీనాతో గురుప్రీత్ సింగ్ రిలేషన్‌షిప్ లో ఉన్నాడు. వీరిద్దరి మధ్య గత కొంతకాలంగా ఎఫైర్ నడుస్తోందని పోలీసులు తెలిపారు. అయితే ఆమెకు వేరే వ్యక్తితో అక్రమ సంబంధం ఉందని అందుకే హత్య చేసినట్లు పోలీసులు తెలిపారు. తరుచుగా గురుప్రీత్ ఆమెను కలుసుకునేందుకు స్విట్జర్లాండ్ వెళ్లే వాడని, అయితే ఆమెపై అనుమానం పెంచుకున్న నిందితుడు ఈ సారి లీనాను ఇండియాకు వచ్చే విధంగా ప్లాన్ చేసి హత్య చేశాడు.



టీడీపీ ఎన్‌టీఆర్ భవన్‌లో బతుకమ్మ సంబురాలు

నేతల 'ఆత్మీయత'

ప్రముఖుల ఇండ్ల చుట్టూ చక్కర్లు

- పోటాపోటీగా చేర్పులు
- దీటుగా సమావేశాలు..సమ్మేళనాలు
- ఆరోపణలు,ప్రత్యారోపణలు





నవతెలంగాణ - ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి

నేతలు ఎన్నడూ లేని ఆత్మీయత ఒలకబోస్తున్నారు. ప్రముఖుల ఇండ్ల చుట్టూ చక్కర్లు కొడుతూ 'నా కోసం మీరు.. మీ కోసం నేను' అన్నట్టుగా నమ్మబలుకుతున్నారు. ఏ హామీలు ఇస్తున్నారో.. ఏమి చేస్తున్నారో తెలియదుకానీ రోజుకు ఒకరిద్దరు ప్రముఖులైనా పార్టీలు మారుతున్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పట్టణ ప్రాంత నియోజకవర్గాలతో పాటు రాష్ట్రంలోనే హాట్ సీటు పాలేరులో చేర్పులు మార్పులు గణనీయంగా జరుగుతున్నాయి.

మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఖమ్మం అసెంబ్లీ నియోజకవర్గంపై ఫోకస్ చేసినప్పటి నుంచి ఆత్మీయ కలయికలపై దృష్టి సారించారు. రోజూ పలువురు వ్యాపార, రాజకీయ, ఉద్యోగసంఘాలు, వివిధ రంగాల ప్రముఖుల ఇండ్లకు వెళ్లి భేటీ అవుతున్నారు. మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ సైతం ఇదే పని మీద ఉన్నారు. మొన్నటి వరకు ఆత్మీయ సమ్మేళనాలకు ప్రాధాన్యత ఇచ్చిన పువ్వాడ.. ఇప్పుడు ఆత్మీయ కలయికలూ చేపడుతున్నారు. ఇదే ప్రక్రియను కొత్తగూడెం, సత్తుపల్లి, పాలేరు, ఇల్లెందు తదితర నియోజకవర్గాల బీఆర్ఎస్ అభ్యర్థులు సైతం ముమ్మరం చేశారు.

నచ్చజెప్పుతూ.. బుజ్జగిస్తూ..

సొంత పార్టీ నేతలు, న్యూట్రల్‌గా ఉండే ప్రముఖుల ఇండ్లకు తరచూ వెళ్తున్నారు. మంచి చెడులు మాట్లాడుతున్నారు. నెగ్గితే తన నుంచి ఎలాంటి సహాయ సహకారాలు అందుతాయో వివరిస్తున్నారు. గతంలో తమకు ఎదురైన అవమానాలు, పరాభవాలను ఆయా ప్రముఖులు నేతల దృష్టికి తీసుకొస్తున్నారు. ఖమ్మం నియోజకవర్గంలో అధికార బీఆర్ఎస్ నేతల కారణంగా తాము పడిన ఇబ్బందులను మాజీ మంత్రి తుమ్మలకు పలువురు ప్రముఖులు ఏకరువు పెడుతున్నారు. దీనిపై ఆయన ఆత్మీయ సమ్మేళనాల్లో తీవ్రంగా స్పందిస్తున్నారు. ఖమ్మంలో ఇంతటి తీవ్ర పరిస్థితులు ఉన్నాయని తాము ఊహించలేదని.. అవినీతి, అక్రమార్కులు, కబ్జాకోరుల నుంచి ఖమ్మం ప్రజలు స్వేచ్ఛ కోరుకుంటున్నారని ఆయన అంటున్నారు. ప్రజలు హాయిగా జీవించేందుకు కావాల్సిన వాతావరణాన్ని కల్పిస్తానని హామీ ఇస్తున్నారు. మరోవైపు బీఆర్ఎస్ అభ్యర్థి అజయ్ తన పాలనా తీరుపై ప్రత్యర్థులు ఉద్దేశపూర్వకంగా విషం చిమ్ముతున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. లేనిపోని ఆరోపణలు చేస్తూ తన స్థాయిని తగ్గించే కుట్రలు చేస్తున్నా రంటున్నారు. కొత్తగూడెం, ఇల్లెందుల్లో సైతం అధికారపార్టీ అభ్యర్థులపై ఇలాంటి ఆరోపణలే ప్రత్యర్థుల నుంచి వస్తు న్నాయి. దీనిపై వారికి నచ్చజెప్పే ప్రయత్నాలు సాగుతు న్నాయి. పలుచోట్ల అసంతృప్తితో ఉన్న అధికారపార్టీ నేతల ను అభ్యర్థులు, ఎన్నికల ఇన్‌చార్జీలు బుజ్జగిస్తున్నారు. మరీ వినకపోతే కేటీఆర్, హరీశ్‌రావుతో ఫోన్‌లో మాట్లాడిస్తు న్నారు. అయినప్పటికీ కొందరు పార్టీ వీడుతుండటం గమనార్హం.

ఆత్మీయ సమ్మేళనాలతో అభయం

రోజుకు ఐదారు ఆత్మీయ సమ్మేళనాల చొప్పున నేతలు నిర్వహిస్తున్నారు. కులాలు, ప్రాంతాలు, వర్గాల వారీగా చేపడుతున్నారు. బీఆర్ఎస్ అభ్యర్థులను ముందుగానే ప్రకటించడంతో ఎక్కువ ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహించే వెసులుబాటు లభించింది. కాంగ్రెస్ ఖమ్మం, పాలేరు మరికొన్ని నియోజకవర్గాల్లో ఇప్పుడిప్పుడే ఈ ఆత్మీయ సమావేశాలు నిర్వహిస్తోంది. ఆత్మీయ సమ్మేళనాల్లో బీఆర్ఎస్ నేతలు తమ లోపాలను సరిచేసుకుంటామని, గతంలో జరిగిన లోటుపాట్లను సరిదిద్దుకుంటామని, ఎలాంటి కష్ట నష్టాలు చోటుచేసుకోకుండా చూస్తామని అభయమిచ్చి ప్రముఖులు, వారి తరఫు ఓట్లకు గాలం వేస్తున్నారు. గత పాలనా వైఫల్యాలు, ఎవరెవరు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కొన్నారో వివరిస్తూ.. భవిష్యత్‌లో బీఆర్ఎస్ నుంచి అలాంటి పరిణామాలు చోటుచేసుకోవని గ్యారెంటీ ఏంటి? ఆలోచించి తమను సపోర్టు చేయాలని కాంగ్రెస్, విపక్షాలు కోరుతున్నాయి.

గత ఆదివారం ఖమ్మంలో మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి, మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆధ్వర్యంలో కొనసాగించిన స్టింగ్ ఆపరేషన్.. పండుగ తర్వాత మళ్లీ ఉంటుందని కాంగ్రెస్ శ్రేణులు చెబుతున్నాయి. ఈసారి పాలేరు నియోజకవర్గంలో ఆకస్మిక ఆపరేషన్ భారీగా ఉంటుందని, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పార్టీ వీడతారని సమాచారం. ముందుగా తిరుమలాయపాలెం మండలం నుంచి ఇది ప్రారంభమవుతుందని చర్చసాగుతోంది. మొన్న ఇల్లెందు నియోజకవర్గం గార్లలో బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు పలువురు పార్టీ వీడినట్టుగానే.. పాలేరులోనూ పునరావృతం అవుతుందని కాంగ్రెస్ శ్రేణులంటున్నాయి. ఈ నేపథ్యంలో అధికార పార్టీ అప్రమత్తమై బుజ్జగింపుల పర్వం కొనసాగిస్తోంది. నజరానాలు, భరోసా హామీలు ఇస్తోంది. అవసరమైతే ఆర్థిక మూలాలను దెబ్బతీస్తామని నేతలు బెదిరింపులకు కూడా దిగుతున్నట్టు తెలుస్తోంది.

భారత్‌తో దౌత్యవివాదం.. కెనడాకు మద్దతుగా అమెరికా, యూకే..

న్యూఢిల్లీ: ఖలిస్తాన్ ఉగ్రవాది హర్దీప్ సింగ్ నిజ్జర్ హత్య ఇండియా-కెనడా దేశాల మధ్య తీవ్ర దౌత్య వివాదానికి కారణమైంది. ఈ మంటలు ఇప్పట్లో చల్లారేలా కనిపించడం లేదు. పదేపదే కావాలనే కెనడా, ఇండియాను టార్గెట్ చేస్తూ పలు వ్యాఖ్యలు చేస్తోంది. ఇదిలా ఉంటే దౌత్య సమానత్వం కోసం ఇండియా, కెనడాకు సంబంధించిన 41 మంది దౌత్యవేత్తలను ఉపసంహరించుకోవాని కోరింది. అక్టోబర్ 10 వరకు డెడ్ లైన్ విధించింది. లేకపోతే వారికి దౌత్యవేత్తలకు ఇస్తున్న రక్షణలను తొలగిస్తామని తెలిపింది. అయితే ఇరు పక్షాల చర్యల కారణంగా ఇది అక్టోబర్ 20 గడువు ఇచ్చింది. ఈ నేపథ్యంలో నిన్న కెనడా తన 41 మంది దౌత్యవేత్తలను ఇండియా నుంచి తిరిగి రప్పించుకుంది. ఇదిలా ఉంటే భారత్ వియన్నా కన్వెన్షన్ ను ఉల్లంఘిస్తుందని కెనడా గగ్గోలు పెడుతోంది. అయితే దౌత్య సమానత్వాన్ని కోరుకోవడాన్ని నిబంధనల ఉల్లంఘనగా చెప్పుకోవద్దని భారత్ కెనడాకు సూటిగా సూచించింది. ప్రస్తుతం భారత్, కెనడాల్లో ఇరు వైపుల 21 మంది దౌత్యవేత్తలు ఉన్నారు. ఈ నేపథ్యంలో మరోసారి కెనడాకు అమెరికా, యూకే దేశాలు వత్తాసు పలికాయి. వియన్నా ఒప్పంద సూత్రాలను, దౌత్యసంబంధాలపై భారత్ తన బాధ్యతలను నిర్వర్తించాలని తాము ఆశిస్తున్నట్లు అమెరికా వ్యాఖ్యానించాంది. మరోవైపు యూకే కూడా కెనడాకు మద్దతు ప్రకటిస్తూ వ్యాఖ్యానించింది. "భారత్ నుంచి కెనడా దౌత్యవేత్తలను వెనక్కి పిలిపించాలనే భారత నిర్ణయాన్ని మేం అంగీకరించలేము. దౌత్యపరమైన రక్షణలను ఏకపక్షంగా ఎత్తివేయడం, వియన్నా ఒప్పందానికి అనుగుణంగా లేదు" అంటూ యూకే విదేశాంగ కార్యాలయ అధికార ప్రతినిధి వెల్లడించారు. "కెనడా-ఇండియాల మధ్య పరిణామాలు ఆందోళన కలిగిస్తున్నాయి. విభేధాల పరిష్కారానికి దౌత్యవేత్తలు ఉండటం చాలా అవసరం. దౌత్యవేత్తలను తగ్గించుకోవాలని కెనడాపై భారత్ ఒత్తిడి చేయవద్దని న్యూఢిల్లీని కోరాం. నిజ్జర్ హత్య కేసులో కెనడాకు సహకరించాలని అభ్యర్థించాం. 1961 నాటి వియన్నా ఒప్పంద సూత్రాల కింద దౌత్య సంబంధాలపై భారత్ తన బాధ్యతను నిర్వర్తించాలి" అని అమెరికా విదేశాంగ శాఖ ప్రతినిధి మాథ్యూ మిల్లర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఖలిస్తాన్ ఉగ్రవాది హర్దీప్ సింగ్ నిజ్జర్ ని గుర్తుతెలియని వ్యక్తులు జూన్ నెలలో కెనడాలో కాల్చి చంపారు.

అయితే ఈ హత్యలో భారత ఏజెంట్ల ప్రమేయం ఉందని కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో ఆరోపించారు. ఇదే కాకుండా కెనడాలోని భారత దౌత్యవేత్తను బహిష్కరించారు. భారత్ కూడా సీనియర్ కెనడియన్ దౌత్యవేత్తను దేశం వదిలివెళ్లాని ఆదేశించింది.

ఈ నేపథ్యంలో ఇటీవల కెనడా, భారత్ దేశాల్లో దౌత్యవేత్తల సమానం కొరకు ఇండియాలో ఎక్కువగా ఉన్న కెనడియన్ దౌత్యవేత్తలను ఉపసంహరించుకోవాలని కెనడాకు సూచించింది. ఈ నిర్ణయం రెండు దేశాల్లోని లక్షల మంది ప్రజల్ని ఇబ్బందులకు గురిచేస్తుందని జస్టిన్ ట్రూడో అన్నారు.

తనిఖీల్లో నగదు పట్టివేత



నవతెలంగాణ - బంజారాహిల్స్/విలేకరులు

రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల అధికారులు, పోలీసులు ఎక్కడికక్కడ విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో భారీగా నగదును పోలీసులు పట్టుకుంటున్నారు. శనివారం తెల్లవారుజామున 4 గంటల సమయంలో బంజారాహిల్స్‌లో తనిఖీలు నిర్వహిస్తుండగా ఏఎమ్మార్ గ్రూప్ సంస్థల చైర్మన్ మహేశ్ రెడ్డి కారులో సుమారు రూ.3. 50 కోట్లు లభ్యమైంది. ఎటువంటి పత్రాలు లేకపోవడంతో ఎన్నికల రిటర్నింగ్ అధికారికి అప్పగించారు. పక్క రాష్ట్రాల నుంచి డబ్బులు తీసుకొచ్చి రాజకీయ పార్టీలకు అందజేస్తున్నట్టు తెలిసింది. ఈ నేపథ్యంలో మహేశ్ రెడ్డికి సంబంధించిన ఏఎంఆర్ గ్రూప్ సంస్థల్లో కూడా తనిఖీలు చేపట్టారు. ఆయన ఏ పార్టీ కోసం డబ్బులు తెస్తున్నారనే దానిపై ఐటీ అధికారులు ఆరా తీస్తున్నారు. రంగారెడ్డి జిల్లా కొత్తూరు మున్సిపాలిటీ పరిధిలోని జహంగీర్ పీర్ దర్గా రోడ్డులో పోలీసుల తనిఖీల్లో రూ.రెండు లక్షలు పట్టుబడ్డాయి. కుమ్మరిగూడెం గ్రామానికి చెందిన కుమ్మరి భిక్షపతి బ్యాగును తనిఖీ చేయగా నగదు లభ్యమైంది. వాటికి ఎలాంటి పత్రాలూ లేకపోవడంతో స్వాధీనం చేసుకున్నట్టు సీఐ శంకర్‌రెడ్డి తెలిపారు. ఆదిలాబాద్ జిల్లా బేల మండల సరిహద్దులో ఉన్న శంకర్‌గూడ చెక్‌పోస్టు వద్ద రూ.10లక్షలను పోలీసులు పట్టుకున్నారు. గడ్‌చందూర్ నుంచి నాందేడ్ వెళుతున్న హరిబాబు వద్ద ఈ నగదు లభ్యమైనట్టు ఎస్ఐ రాధిక తెలిపారు. ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్(టి) మండలంలో అంతర్రాష్ట్ర రహదారిలోగల వెంకట్‌రావ్‌పేట్ గ్రామం వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు వద్ద ఎస్ఐ దీకొండ రమేష్ వాహనాలు తనిఖీ చేస్తుండగా రూ.4.20 లక్షలు పట్టుకున్నారు. పెద్దపెల్లి జిల్లాకు చెందిన కుర్ర రమేష్ వద్ద ఉన్న నగదును సీజ్ చేశారు.

పురుగుల మందు డబ్బాతో మోత్కుపల్లి

కేసీఆర్ దళితులను మోసం చేశాడు

- ఎన్టీఆర్ ఘాట్ దగ్గర హల్‌చల్
- కేసీఆర్ దళితులను మోసం చేశాడు
- ప్రవళిక ఆత్మహత్యకు ఆయనే కారణం
- బీఆర్ఎస్‌ను ఓడించేది కాంగ్రెస్సే



నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

ట్యాంక్‌బండ్ ఎన్టీఆర్ ఘాట్ దగ్గర మాజీ మంత్రి మోత్కుపల్లి నరసింహులు పురుగుల మందు డబ్బాతో హల్‌చల్ చేశారు. సీఎం కేసీఆర్‌ను సమర్థించి తప్పుచేశానని మోత్కుపల్లి పశ్చాత్తాపం వ్యక్తం చేశారు. శనివారం హైదరాబాద్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. "దళితబంధు అమలు కాకుంటే చస్తానని గతంలో చెప్పాను. ఇప్పుడది అమలు కావటం లేదు. నన్ను చనిపోమ్మని దళిత యువత నాకు మెసేజ్‌లు చేస్తున్నారు. యాదగిరిగుట్ట దగ్గర చెప్పిన మాటను నిలబెట్టుకోమని దళిత యువత కోరుతున్నది. కేసీఆర్ ముహూర్తం పెడితే మందు తాగి చనిపోతాను. దళితులకు అన్యాయం జరిగితే పురుగుల మందు తాగి చచ్చిపోతాను. కేసీఆర్ గట్టిగా ఉన్నాడు. ఆయన ఎలాగూ చావడు. నేనైనా చచ్చిపోతాను. నా పెద్దన్న కేసీఆర్ మాటకు విలువే లేదు. మోసాలకు కేరాఫ్ అడ్రస్ సీఎం కేసీఆర్. మా ఇద్దరికీ మాటలు లేకున్నా.. దళితబంధు పెడుతున్నా.. రావాలని స్వయంగా కేసీఆర్ పిలిస్తే వెళ్లాను. దళితబంధుతో దళిత జాతికి మేలు జరుగుతుందని కేసీఆర్‌ను సమర్థించాను.కానీ, మాదిగ కులానికి కేసీఆర్ మంత్రి పదవి కూడా ఇవ్వలేదు." అని మోత్కుపల్లి ఆవేదన వ్యక్తం చేశారు.

కేసీఆరే కారణం

"ప్రవళిక ఆత్మహత్యకు కేసీఆరే కారణం. తెలంగాణలో ఆల్రెడీ బీఆర్ఎస్ ఓడిపోయింది. చంద్రబాబు అరెస్ట్‌తో గ్రేటర్ చుట్టూ బీఆర్ఎస్ 30 సీట్లు కోల్పోనుంది. సోనియా తెలంగాణ ఇచ్చినందుకు కాంగ్రెస్ నష్టపోయింది. కాంగ్రెస్‌కు తెలంగాణ ప్రజలు ఒక్క అవకాశం ఇవ్వాలి. ప్రజలు కాంగ్రెస్‌కు పట్టం కట్టాలని నిర్ణయించుకున్నారు . కానీ సీనియర్లు కలిసి పనిచేయకుంటే నష్టం తప్పదు. రేవంత్ రెడ్డి అందరి ఇండ్లకు పోతున్నాడు. దళితుడైన నా ఇంటికి మాత్రం రావటం లేదు. దళితుల ఓట్లు పడకపోతే ఏ పార్టీ అధికారంలోకి రాదు. తుంగతుర్తి సీటు నాకివ్వకపోతే కాంగ్రెస్‌కు నష్టమే. బలహీన అభ్యర్థిని పెడితే సీటు బీఆర్ఎస్ గెలుచుకుపోతుంది. నేను మద్దతు ఇస్తానంటే కాంగ్రెస్ పెద్దలు తీసుకోవటం లేదు. ప్రస్తుత పరిస్థితుల్లో కాంగ్రెస్ మాత్రమే బీఆర్ఎస్‌ను ఓడించగలదు." అని వ్యాఖ్యానించారు.

చంద్రబాబును చంపాలనుకుంటున్నారు

రాజమండ్రి సెంట్రల్ జైలులో ఉన్న టీడీపీ అధినేత చంద్రబాబుకు ఏదైనా జరిగితే ఏపీ సీఎం జగన్‌దే బాధ్యత అని మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు అన్నారు. ఆరోగ్యాన్ని దెబ్బతీసి చంపాలనుకుంటున్నారని వ్యాఖ్యానించారు. 'చంద్రబాబు ఆరోగ్యాన్ని దెబ్బతీసి చంపాలని చూస్తున్నారు..ఆయన్ను హింసించి బాధపెడుతున్నారు.జగన్ చర్యలను తీవ్రంగా ఖండిస్తున్నా.రాజధాని లేని రాష్ట్రాన్ని పాలిస్తున్న ఏకైక సీఎం జగన్. చంద్రబాబు కుటుంబానికి భద్రత లేదు. ఏపీలో పేద ప్రజలు బతికే పరిస్థితి లేకుండా చేశారు..చంద్రబాబును బయటకు రాకుండా చేసి ఓట్లను సాధించాలని ప్రయత్నమా ? ఎన్నికల్లో డబ్బులు ఇచ్చి జగన్ మళ్లీ గెలవాలని చూస్తున్నారు" అని మోత్కుపల్లి విమర్శించారు.

నూతన అధ్యాపకులకు ఏహెచ్ఆర్ఏ, ఎస్‌సీఏ అలవెన్సులివ్వాలి

- డైరెక్టర్ ఆఫ్ ట్రెజరీకి ఎమ్మెల్సీ నర్సిరెడ్డి వినతి



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ప్రభుత్వ కళాశాలల్లో నూతన అధ్యాపకులుగా చేరిన ఏజెన్సీ ప్రాంతాల్లో పనిచేస్తున్న నూతన అధ్యాపకులకు అడిషనల్ హౌస్ రెంట్ అలవెన్స్ (ఏహెచ్ఆర్ఏ), స్పెషల్ కంపెన్సెటరీ అలవెన్స్ (ఎస్‌సీఏ) ఇవ్వాలని ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి డిమాండ్ చేశారు. శనివారం హైదరాబాద్‌లో డైరెక్టర్ ట్రెజరీని తెలంగాణ గెజిటెడ్ జూనియర్ లెక్చరర్ల అసోసియేషన్ (టీజీజేఎల్ఏ-475) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొప్పిశెట్టి సురేష్‌తో కలిసి ఆయన వినతిపత్రం సమర్పించారు. మేలో రాష్ట్రవ్యాప్తంగా సుమారు మూడు వేల మందికి పైగా కాంట్రాక్టు అధ్యాపకులు క్రమబద్ధీకరణ అయ్యారని వివరించారు. వారు ప్రభుత్వ కళాశాలల్లో పనిచేస్తున్నారని తెలిపారు. ఏజెన్సీ ప్రాంతాల్లో పనిచేస్తున్న నూతన అధ్యాపకులకు కొన్ని జిల్లాల్లో కోశాధికారులు ఏజెన్సీ అలవెన్సులు చెల్లించడంలో ఇబ్బందులు జరుగుతున్నాయని పేర్కొన్నారు. ఈ విషయంపై ట్రెజరీ శాఖ అధికారులు సానుకూలంగా స్పందించారనీ, అతి త్వరలో ఈ సమస్యను పరిష్కరిస్తామంటూ హామీ ఇచ్చారని తెలిపారు. అనంతరం డాక్టర్ బిఆర్ అంబేద్కర్ సచివాలయంలో నూతన అధ్యాపకుల పెండింగ్ వేతనాలను చెల్లించాలని కోరుతూ ఆర్థిక శాఖ ఉన్నతాధికారులను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈనెల ఒకటి, రెండు తేదీల్లో పాఠశాల విద్య పరిధిలో స్కూల్ అసిస్టెంట్ క్యాడర్ ఉపాధ్యాయుల బదిలీలు అయ్యాయని తెలిపారు. వారు ఈనెల మూడు నుంచి ఎనిమిదో తేదీ మధ్య బదిలీ అయిన బడుల్లో చేరారని పేర్కొన్నారు. వారికి గతనెల 30 వరకు జీతం బదిలీకి ముందు పాఠశాలలో చెల్లించారని వివరించారు. వారికి చివరి జీతం సర్టిఫికెట్ గతనెల 30 వరకు చెల్లించినట్టు ఈనెల రెండు నుంచి ఏడురోజులపాటు జీతం చెల్లించలేదని నాన్ డ్రాయల్ సర్టిఫికెట్ ఇచ్చారని తెలిపారు. కొత్త చేరిన పాఠశాల డ్రాయింగ్ ఆఫీసర్ ఈనెల ఒకటి నుంచి బిల్లులు చేసేందుకు ఐఎఫ్ఎంఐఎస్ పోర్టల్ అనుకూలంగా లేదని పేర్కొన్నారు. కావున ఆ పోర్టల్‌లో తగు మార్పు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు కె జంగయ్య, నాయకులు శ్రీనివాస్ రెడ్డి, సత్యనారాయణ, మల్లయ్య, బండి ప్రసాద్, అడపాల ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

నీట్‌కు వ్యతిరేకంగా..
సంతకాల ప్రచారాన్ని ప్రారంభించిన డీఎంకే

చెన్నై: దేశ వ్యాప్తంగా ప్రముఖ వైద్య విద్యా సంస్థల్లో వైద్య కోర్సుల ప్రవేశం కోసం నిర్వహించే నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రన్స్ టెస్ట్(నీట్)కు వ్యతిరేకంగా తమిళనాడు ప్రభుత్వం పోరాడుతున్నది. ఇందులో భాగంగా అధికార డీఎంకే శనివారం రాష్ట్ర వ్యాప్తంగా సంతకాల ప్రచారాన్ని ప్రారంభించింది. డీఎంకే అధ్యక్షుడు, సీఎం ఎంకే స్టాలిన్ తొలి సంతకం చేశారు. నీట్‌కు వ్యతిరేకంగా 50 రోజుల్లో 50 లక్షల సంతకాలు సేకరించి రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు పంపనున్నారు. కాగా, నీట్ పరీక్ష రాసి అర్హత సాధించని సుమారు 22 మంది తమిళ విద్యార్థులు ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఈ నేపథ్యంలో ఆ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన డీఎంకే ప్రభుత్వం నీట్‌కు వ్యతిరేకంగా గళమెత్తింది. సామాజిక న్యాయానికి విరుద్ధంగా ఇది ఉందని విమర్శించింది. పట్టణ విద్యార్థులు, కోచింగ్ సెంటర్‌లకు అనుకూలంగా ఉన్న నీట్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేసింది. అలాగే తమిళనాడుకు నీట్‌ను మినహాయించాలని కోరుతూ అసెంబ్లీలో తీర్మానించిన బిల్లును రాష్ట్రపతికి పంపింది. ఈ బిల్లు ఆమోదం కోసం డీఎంకే ప్రభుత్వం ఎదురుచూస్తున్నది.

రాజస్థాన్‌లో ఎట్టకేలకు తొలి జాబితా ప్రకటించిన కాంగ్రెస్..
సదర్‌పుర నుంచే సీఎం గెహ్లాట్ పోటీ

జైపూర్: రాజస్థాన్ అసెంబ్లీ ఎన్నికలకు షెడ్యూల్ విడుదలై రెండు వారాలు కావస్తున్నా ఎమ్మెల్యే అభ్యర్థుల ఎంపికపై కసరత్తు పూర్తి చేయని ఆ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ఎట్టకేలకు ఇవాళ అభ్యర్థుల తొలి జాబితాను ప్రకటించింది. తొలి జాబితాలో మొత్తం 33 అసెంబ్లీ స్థానాలకు అభ్యర్థులను ఖరారు చేసింది. రాజస్థాన్ ముఖ్యమంత్రి అశోక్ గెహ్లాట్ ఈసారి కూడా సదర్‌పుర అసెంబ్లీ స్థానం నుంచే బరిలో దిగనున్నారు. అదేవిధంగా రాజస్థాన్ మాజీ ఉప ముఖ్యమంత్రి సచిన్ పైలట్ టోంకు నియోజకవర్గం నుంచి, అసెంబ్లీ స్పీకర్ సీపీ జోషి నత్‌ద్వారా అసెంబ్లీ స్థానం నుంచి, యువ నాయకురాలు దివ్య మాడెర్నా ఓసియన్ స్థానం నుంచి, పీసీసీ అధ్యక్షుడు గోవింద్ సింగ్ దొతసారా లచ్‌మన్‌గఢ్ అసెంబ్లీ స్థానం నుంచి, డిస్కస్ త్రో క్రీడాకారిణి, అంతర్జాతీయ టోర్నీలో గోల్డ్ మెడలిస్ట్ కష్ణ పూనియా సాదుల్‌పూర్ నుంచి బరిలో దిగబోతున్నారు.

పాక్‌లో గుర్తు తెలియని వ్యక్తుల కాల్పులు..!

- ఉగ్రవాది మసూద్ అజార్ సన్నితుడు దావూద్ మాలిక్ హతం..!

లాహోర్ : మోస్ట్ వాంటెడ్ టెర్రరిస్ట్, జైష్ ఏ మహ్మద్ ఉగ్రవాది మసూద్ అజార్‌కు అత్యంత సన్నిహితుడు, లష్కర్ ఏ జబ్బార్ వ్యవస్థాపకుడు దావూద్ మాలిక్ హత్యకు గురయ్యాడు. పాకిస్థాన్‌లోని ఉత్తర వజీరిస్థాన్ దావూద్ మాలిక్‌పై గుర్తు తెలియని వ్యక్తులు తుపాకీతో కాల్పులు జరిపారు. ముసుగులు ధరించిన వ్యక్తులు అతనిపై కాల్పులు జరుపడంతో ప్రాణాలు కోల్పోయాడు. దావూద్ మాలిక్ ఓ ప్రైవేట్ క్లినికల్‌లో ఉండగా గుర్తు తెలియని వ్యక్తులు అతనిపై కాల్పులు జరిపి.. అక్కడి నుంచి పారిపోయారని తెలుస్తున్నది. ఇదిలా ఉండగా.. భారత్ మోస్ట్ వాంటెడ్ టెర్రరిస్టుల జాబితాలో ఇటీవల పాక్‌లో హత్యకు గురవుతున్నారు.

ఇప్పటికే పఠాన్‌కోట్ దాడి సూత్రధారి షాహిద్ లతీఫ్‌తో పాటు ఐఎస్ఐ ఏజెంట్ ముల్లా బహూర్ అలియాస్ హెూర్మూజ్‌పై కాల్పులు మతి చెందారు. తాజా లతీఫ్‌కు అత్యంత సన్నిహితుడైన దావూద్ మాలిక్‌పై గుర్తు తెలియని వ్యక్తులు కాల్పులు జరిపారు. దావూద్ మాలిక్‌కు లష్కరే జాంగ్వీలతో సంబంధాలున్నాయి.

మసూద్ అజార్, హఫీజ్ సయీద్, లఖ్వీ, దావూద్ ఇబ్రహీంతో పలువురిని భారత ప్రభుత్వం ఉగ్రవాదులుగా ప్రకటించింది. పుల్వామా దాడి తర్వాత బాలాకోట్‌పై భారత సైన్యం వైమానిక దాడులు చేసిన విషయం తెలిసిందే. ఆ సమయంలో దావూద్ మాలిక్ అక్కడే ఉన్నాడు. దాడి నుంచి తప్పించుకున్నట్లు తర్వాత తేలింది. ఈ ఉగ్రవాదులకు పాక్ ఐఎస్ఐ రక్షణ కల్పిస్తున్నట్లుగా విమర్శలున్నాయి.

కర్ణాటకలో వింత నిరసన.. కరెంట్ ఇవ్వలేదని సబ్ స్టేషన్లో మొసలిని వదిలిన రైతు

బెంగళూరు : సకాలంలో కరెంటు ఇవ్వకపోవడంతో కర్ణాటక రైతులు విసుగు చెందిపోయారు. దీంతో హెస్కామ్ సబ్ స్టేషన్ యూనిట్ ఆవరణలోకి మొసలిని తీసుకొచ్చిన ఘటన విజయపూర్ జిల్లా కొల్హార తాలూకా రోనిహాల్ గ్రామంలో చోటుచేసుకుంది. రాత్రుళ్లు ఆలస్యంగా కరెంటు ఇస్తున్నారని, చీకట్లో పొలాలకు వెళ్లి నీరందిస్తే ఎలా అని రైతులు వాపోయారు. చీకట్లో జలచరాల నుంచి ఇబ్బందులు ఎదురవుతున్నాయని.. వారికి కూడా ఇలాంటివి గుర్తు చేసేందుకు రైతు ఈ చర్యకు పాల్పడ్డాడు. రాత్రిపూట కరెంటు ఇస్తే ఏం లాభం? మా సమస్యను అధికారులు అర్థం చేసుకునేందుకే మొసలిని తీసుకొచ్చామన్నారు. రైతుల భూములకు పగటిపూట త్రీఫేజ్ విద్యుత్ అందడం లేదు.

బిజినెస్

రెట్టింపైన సెంట్రల్ బ్యాంక్ లాభాలు



న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగంలోని సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆకర్షణీయ ఆర్థిక ఫలితాలు సాధించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 2023-24 సెప్టెంబర్‌తో ముగిసిన ద్వితీయ త్రైమాసికం (క్యూ2)లో 90 శాతం వృద్ధితో రూ.605.4 కోట్ల నికర లాభాలు ప్రకటించింది. గతేడాది ఇదే త్రైమాసికంలో రూ.318.2 కోట్ల లాభాలు నమోదు చేసింది. ప్రధాన ఆదాయాలు పెరగడానికి తోడు మొండి బాకీలు తగ్గడంతో ఆకర్షణీయ ఫలితాలు వచ్చాయని ఆ బ్యాంక్ తెలిపింది. 2022-23 క్యూ2లో 9.67 శాతంగా ఉన్న జీఎన్‌పిఎ గడిచిన త్రైమాసికంలో 4.62 శాతానికి తగ్గింది. నికర ఎన్‌పిఎలు 2.95 శాతం నుంచి 1.64 శాతానికి పరిమితమయ్యాయి. క్రితం క్యూ2లో బ్యాంక్ మొత్తం ఆదాయం 11.51 శాతం పెరిగి రూ.6,02,284 కోట్లకు చేరింది. రిటైల్, వ్యవసాయ, ఎంఎస్ఎంఇ రుణాల జారీలో 14.24 శాతం వృద్ధి చోటు చేసుకుంది. ప్రతీ ఉద్యోగి సగటు వ్యాపారం రూ.18.60 కోట్లకు చేరింది. 2022-23 ఇదే క్యూ2లో రూ.17.13 కోట్లుగా ఉంది.

తగ్గిన ఐడిబిఐ బ్యాంక్ మొండి బాకీలు

న్యూఢిల్లీ : ప్రస్తుత ఆర్థిక సంవత్సరం సెప్టెంబర్‌తో ముగిసిన ద్వితీయ త్రైమాసికం (క్యూ2)లో ఐడిబిఐ బ్యాంక్ నికర లాభాలు 60 శాతం పెరిగి రూ.1,323 కోట్లకు చేరాయి. మొండి బాకీలు తగ్గడంతో ఎల్ఐసి ఆధ్వర్యంలోని ఈ బ్యాంక్ మెరుగైన ఫలితాలను సాధించింది. గతేడాది ఇదే త్రైమాసికంలో రూ.828 కోట్ల లాభాలు నమోదు చేసింది. 2023 సెప్టెంబర్ ముగింపు నాటికి బ్యాంక్ స్థూల నిరర్థక ఆస్తులు ఏకంగా 4.90 శాతానికి తగ్గాయి. 2022 ఇదే సమయం నాటికి ఏకంగా 16.51 శాతం జిఎన్‌పిఎతో తీవ్ర ఒత్తిడిలో ఉంది. నికర నిరర్థక ఆస్తులు 1.15 శాతం నుంచి 0.39 శాతానికి పడిపోయాయి. బ్యాంక్ నిరర్థక ఆస్తులు తగ్గడం, ఆదాయం పెరగడంతో ఐడిబిఐ లాభాల్లో మెరుగుదల కనబడింది.

ఐసిఐసిఐ బ్యాంక్‌కు రూ.10,261 కోట్ల లాభాలు

ముంబయి : ప్రయివేటు రంగంలోని ఐసిఐసిఐ బ్యాంక్ 2023-24 జులై నుంచి సెప్టెంబర్ త్రైమాసికం(క్యూ2)లో 35.8 శాతం వృద్ధితో రూ.10,261 కోట్ల లాభాలు నమోదు చేసింది. గతేడాది ఇదే త్రైమాసికంలో రూ.7557.84 కోట్ల లాభాలు ఆర్జించింది. క్రితం క్యూ2లో బ్యాంక్ నికర వడ్డీ ఆదాయం (ఎన్ఐఐ) 23.8 శాతం పెరిగి రూ.18,308 కోట్లకు చేరింది. బ్యాంక్ మొత్తం ఆదాయం రూ.31,088 కోట్ల నుంచి రూ.40,697 కోట్లకు పెరిగింది. బ్యాంక్ జిఎన్‌పిఎ 2.76 శాతం నుంచి 2.48 శాతానికి తగ్గింది. నికర ఎన్‌పిఎలు 0.61 శాతం నుంచి 0.43 శాతానికి పరిమితమయ్యాయి.

రుణాల జారీకి హెచ్‌డిఎఫ్‌సి 'ఎక్స్‌ప్రెస్‌వే'

ముంబయి : బ్యాంకింగ్ ఉత్పత్తులను అందించడానికి, వేగంగా రుణాలు జారీ చేయడానికి ఎక్స్‌ప్రెస్‌వే వేదికను అందుబాటులోకి తెచ్చినట్లు హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ తెలిపింది. ఈ వేదికపై సులభంగా వ్యక్తిగత, వ్యాపార, వాహన, గృహ, క్రెడిట్ కార్డ్ తదితర రుణాలు పొందవచ్చని పేర్కొంది. వినూత్న పద్ధతుల్లో ఖాతాదారులకు వేగవంతమైన సేవలు అందించడమే తమ లక్ష్యమని పేర్కొంది.

800 స్టోర్లకు మెట్రో బ్రాండ్ విస్తరణ

హైదరాబాద్ : ప్రముఖ పాదరక్షల బ్రాండ్ మెట్రో బ్రాండ్ 800 స్టోర్లకు విస్తరించినట్లు ప్రకటించింది. బంజారాహిల్స్‌లో తమ బ్రాండ్ ఫిట్ ఫ్లాప్ నూతన స్టోర్‌ను తెరవడం ద్వారా ఈ మైలురాయికి చేరినట్లు పేర్కొంది. ఇది తమ వృద్ధికి నిదర్శనమని వెల్లడించింది. ఈ బ్రాండ్ కింద ఫిట్‌ఫ్లాప్, ఫిలా, మెట్రో స్టోర్స్ విస్తరించి ఉన్నాయి.

పాలస్తీనియన్లకు మద్దతుగా ఈజిప్ట్‌లో భారీ ప్రదర్శన

కైరో : 'మీ కోసం మేం త్యాగాలు చేస్తాం పాలస్తీనా' అంటూ శుక్రవారం లక్షల మంది ఈజిప్షియన్లు నినదించారు. సమిష్టి ప్రార్థనల అనంతరం 'ఈజిప్ట్ ఫ్రైడే' పేరుతో ప్రదర్శన నిర్వహించారు. పాలస్తీనా పతాకాలు, 'సేవ్ గాజా' పోస్టర్లు ధరించి ప్రదర్శకులు పాల్గొన్నారు. కైరోలోని నాసర్ సిటీ జిల్లాలో ప్రధాన వీధిలో ఈ ప్రదర్శన జరిగింది. మరోవైపు ఇజ్రాయిల్ దురాక్రమణ ఫలితంగా సినాయ్ ద్వీపకల్పంలోకి చొచ్చుకురావాలని ప్రయత్నిస్తున్న వేలాదిమంది పాలస్తీనియన్లను ఈజిప్ట్ తిరస్కరిస్తోంది. నిర్వాసితులైన పాలస్తీనియన్లకు ఈజిప్ట్ ఆతిథ్యమివ్వాల్సి వస్తే, సినాయ్ ప్రతిఘటనా కార్యకలాపాల క్షేత్రంగా మారగలదని, ఈజిప్ట్ భూభాగంపై ఇజ్రాయిల్ దాడి చేయగలదని ఈజిప్ట్ అధ్యక్షుడు అల్ సిసి హెచ్చరించారు. అవసరమైతే వేలాదిమంది ఈజిప్టియన్లు వీధుల్లోకి వచ్చి ప్రభుత్వ వైఖరిని సమర్థిస్తారని ఆయన పేర్కొన్నారు. పాలస్తీనియన్ల ప్రయోజనాలకు మద్దతుగా, గాజాలో జరుగుతున్న ప్రతిదాన్నీ వ్యతిరేకిస్తూ, ఈజిప్ట్ నేతకు ఆమోద ముద్ర తెలియచేస్తూ ఈ ప్రదర్శనలో పాల్గొన్నట్లు జిహాద్ మహమూద్ అనే మహిళ తెలిపారు.

లండన్‌లో భారీ ప్రదర్శన

గాజాలో తక్షణమే కాల్పుల విరమణను అమలు చేయాలని, మానవతా సాయాన్ని అందజేయాలని కోరుతూ లండన్‌లో పాలస్తీనా అనుకూల మద్దతుదారులు ప్రదర్శన నిర్వహించారు. గత శనివారం జరిగిన ప్రదర్శనలో దాదాపు లక్షా 50వేల మంది పాల్గొన్నారు. ఈసారి అంతకంటే ఎక్కువమందే హాజరయ్యారని పాలస్తీనా సంఘీభావ కేంపైన్ డైరెక్టర్ బెన్ జమాల్ ఎక్స్‌లో పోస్టు పెట్టారు. హింసకు మూల కారణాన్ని పరిష్కరించనిదే ఈ ఉద్రిక్తతలు చల్లారవని జమాల్ పేర్కొన్నారు.

గాజాపై బాంబు దాడుల్లో కాలిన గాయాలతో బాధపడుతున్న వారిలో 80శాతం మంది చిన్నారులేనని, వారికి కనీసం డ్రెస్సింగ్‌లు కూడా అందుబాటులో లేవని గాజాలో డాక్టర్లు తెలిపారు.

పాలస్తీనాకు గ్రెటా థన్‌బర్గ్ సంఘీభావం

ఇజ్రాయిల్ దాడుల్లో ప్రాణాలు కోల్పోతున్న పాలస్తీనా, గాజా వాసులకు వాతావరణ కార్యకర్త గ్రెటా థన్‌బర్గ్ మద్దతునిచ్చారు. తనతోపాటు మరో నలుగురు కార్యకర్తలు పాలస్తీనా, గాజాకు సంఘీభావం తెలుపుతూ ప్లకార్డు పట్టుకుని ఉన్న ఫొటోలను గ్రెటా తన ఎక్స్‌లో పోస్ట్ చేశారు. గ్రెటా పాలస్తీనాకు సంఘీభావం తెలపడంపై ఇజ్రాయెల్ ఆగ్రహం వ్యక్తం చేసింది. 'అమాయక ఇజ్రాయెల్‌లను చంపిన హమాస్.. తమ రాకెట్ల కోసం స్థిరమైన పదార్థాలను ఉపయోగించలేదు. హమాస్ ఊచకోత బాధితులు మీ స్నేహితులు కావొచ్చు. దీనిపై మాట్లాడండి.' అని ఇజ్రాయెల్ ఎక్స్‌లో పోస్ట్ చేసింది. హమాస్ దాడిలో హత్యకు గురైన ముగ్గురు 19 ఏండ్ల ఇజ్రాయిలీల ఫొటోలను పోస్ట్ చేసింది. ఇజ్రాయిల్ స్పందనపై గ్రెటా తీవ్రంగానే స్పందించారు. 'స్టాండ్ విత్ గాజా' అనే ప్లకార్డును తాను పట్టుకుని ఉన్న ఫొటోను ఎక్స్‌లో పోస్టు చేశారు. 'ఈరోజు మేము పాలస్తీనా, గాజాకు సంఘీభావంగా సమ్మె చేస్తున్నాం. తక్షణమే కాల్పులు విరమించండి. పాలస్తీనియన్లకు, బాధిత పౌరులకు స్వేచ్ఛ, న్యాయం కోసం ప్రపంచం మాట్లాడాలి' అని పేర్కొన్నారు. సోషల్‌మీడియాలో గ్రెటా థన్‌బర్గ్ పోస్ట్ వైరల్‌గా మారింది. నెటిజన్లు గ్రెటాకు మద్దతునిస్తున్నారు.

పాలస్తీనియన్లకు క్యూబా సంఘీభావం

హవానా : పాలస్తీనియన్లకు క్యూబా సంఘీభావం ప్రకటించింది. పాలస్తీనా ప్రజలకు మద్దతుగా హయ్యర్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంటర్నేషనల్ రిలేషన్స్‌కి చెందిన విద్యార్థులు, కార్యకర్తలు హవానాలో సంఘీభావ సభ నిర్వహించారు. ఈ సభలో క్యూబా రాయబారి, క్యూబా, అరబ్ ఫ్రెండ్‌షిప్ అసోసియేషన్ అధ్యక్షులు ఎమిలియో కాబలెరోతోపాటు క్యూబా విద్యార్థులు, ప్రొఫెసర్లు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. క్యూబాలో చదువుతున్న పాలస్తీనా విద్యార్థులు కూడా పాల్గొన్నారు. క్యూబాలో పాలస్తీనా రాయబారి అక్రమ్ సంహాన్ మాట్లాడుతూ, గాజాలో ఇజ్రాయిల్ బాంబుదాడుల్లో మరణించిన, గాయపడిన వారి వివరాలు తెలియజేశారు. తమ ప్రజలకు మద్దతును ప్రకటించినందుకు క్యూబా నేతలకు, ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం క్యూబా విద్యార్థులు, ప్రొఫెసర్లు ప్రసంగించారు. వారిలో కొంతమంది తాము రాసిన కవితలను చదివి వినిపించారు.

చిన్నారులకు పోషకాహారం అందేదెన్నడో...!?

ఆహార అలవాట్లపై దుష్ప్రచారాలు...అశాస్త్రీయ వైఖరులు



- శాపంగా మారిన పెడ ధోరణులు
- అధిక పనిభారంతో

కుదేలవుతున్న అంగన్‌వాడీలు

న్యూఢిల్లీ : చిన్నారుల్లో పోషకాహార లోపాన్ని ఎలా నివారించాలన్న విషయంపై కేంద్ర మంత్రి స్మృతి ఇరానీ ఈ నెల 11న నూతన ప్రొటోకాల్ విడుదల చేశారు. ఆరోగ్యం, అభివృద్ధి విషయాలలో పౌష్టికాహారం కీలక పాత్ర పోషిస్తుందని అంగీకరిస్తూనే దేశం ఎదుర్కొంటున్న ముఖ్యమైన సవాళ్లలో ఇది కూడా ఒకటని ప్రొటోకాల్ తెలిపింది. పోషకాహార లోపం కారణంగా తలెత్తే స్వల్పకాలిక, దీర్ఘకాలిక పరిణామాలను సరిచేయడం కష్టమేనని కూడా తేల్చింది.

చిన్నారుల్లో పౌష్టికాహార లోపం ఏర్పడడానికి అనేక కారణాలు ఉన్నాయి. ఆదాయాలు తక్కువగా ఉండడం, కుటుంబాలు పెద్దవిగా ఉండడం, లింగ వివక్ష, పంట విధానాలలో మార్పులు, అవగాహనా లోపం, ఆరోగ్యం సరిగా లేకపోవడం వంటి కారణాల వల్ల ఆహార అసమతుల్యత ఏర్పడుతుంది. పిల్లలకు ఆహార లభ్యత తగ్గిపోతుంది. వారు సంప్రదాయక ఆహార అలవాట్లకు దూరమవుతారు. 0-6 సంవత్సరాల మధ్య వయసున్న పిల్లలకు పౌష్టికాహారాన్ని అందించేందుకు కేంద్ర ప్రభుత్వం 2018లో చేపట్టిన పోషణ్ అభియాన్ కార్యక్రమం ఆశించిన స్థాయిలో ఫలితాన్ని ఇవ్వలేకపోయింది. ఈ కార్యక్రమంలో కొన్ని మార్పులు చేరుస్తూ తాజాగా ప్రభుత్వం ప్రొటోకాల్‌ను విడుదల చేసింది.

ప్రొటోకాల్ ఏం చెబుతోంది?

పిల్లలకు అందించే ఆహారంలో విధిగా పాలు, గుడ్లను చేర్చాలని ప్రొటోకాల్ సూచించింది. పోషకాహార లోపంతో బాధపడుతున్న చిన్నారులకు మాత్రమే కాకుండా పిల్లలందరికీ వారంలో అన్ని రోజులూ గుడ్లను ఇవ్వాలి. ఒకవేళ కుల, మత, ఆరోగ్య పరమైన ఆంక్షలు ఉన్నట్లయితే అలాంటి పిల్లలకు అదనంగా మరో గ్లాసు పాలు లేదా ఓ కప్పు పెరుగు ఇవ్వవచ్చు.

తీవ్రమైన పోషకాహార లోపంతో బాధపడుతున్న పిల్లలకు అంగన్‌వాడీ కార్యకర్తలు 'ఆకలి' పరీక్ష జరపాలని తాజా ప్రొటోకాల్ సూచించింది. ఇందుకోసం బాగా వేడిచేసిన ఆహారాన్ని ఉపయోగిస్తారు. ఈ పరీక్షలో ఫెయిల యిన చిన్నారులను మాత్రమే పోషకాహార పునరావాస కేంద్రాలకు (ఎన్ఆర్‌సీలు) పంపుతారు. పరీక్షలో ఉత్తీర్ణులైన వారిని అనుబంధ పోషకాహార కార్యక్రమంలో నమోదు చేసి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి వద్దకు పంపుతారు. అయితే ఈ పరీక్ష అంత విశ్వసనీయమైనది కాదు.

అడ్డంకులు...అవరోధాలు

సంప్రదాయ ఆహారాన్ని తినాలని పెద్దలు తరచూ చెబుతుంటారు. అయితే ఆర్థిక, రాజకీయ, సామాజిక కారణాల వల్ల చాలా మందికి అది సాధ్యపడడం లేదు. కొన్ని కులాలు, జాతుల వారు జంతు వనరుల నుండి లభించే ఆహారాన్ని తీసుకుంటారు. అయితే అదేదో పెద్ద నేరమైనట్లు కొందరు దుష్ప్రచారం చేస్తున్నారు. మన దేశంలో ఈ ధోరణి బాగా కన్పిస్తోంది. ఉదాహరణకు అక్షయ పాత్ర వంటి సంస్థలు అనేక రాష్ట్రాల్లో మధ్యాహ్న భోజన కాంట్రాక్టులు తీసుకుంది. అయితే ఈ సంస్థ అశాస్త్రీయమైన సాత్వికాహార వైఖరిని అవలంబిస్తూ పిల్లలకు మాంసం, గుడ్లు ఇవ్వడం లేదు. దీంతో చిన్నారుల్లో పౌష్టికాహార లోపం తలెత్తుతోంది.

> **పోషకాహారం లోపిస్తే...**
>
> పోషకాహారం లోపిస్తే పిల్లల్లో అనేక అనారోగ్య సమస్యలు కన్పిస్తాయి. రక్తహీనత, రేచీకటి, మానసిక వైకల్యం, చర్మ వ్యాధులు, శ్వాసకోశ సమస్యలు, ఉదర సమస్యలు వంటివి చిన్నారుల్ని పట్టి పీడిస్తుంటాయి. పోషణ్ అభియాన్ కార్యక్రమంలో పోషకాహార లోపం కలిగిన చిన్నారులను ఆధార్ ఆధారంగా గుర్తిస్తున్నారు. దీనివల్ల లక్షలాది మంది పిల్లలకు ఈ పథకం అందుబాటులో లేకుండా పోతోంది.

గోవధ నిషేధం, ముస్లింలను ఆర్థికంగా బహిష్కరించడం, మాంసం దుకాణాలను నిషేధించడం వంటి మతపరమైన చర్యలు, పెడ ధోరణుల కారణంగా చిన్నారులు పోషకాహారానికి దూరమవుతున్నారు. ఒకవైపు పిల్లలకు పోషకాహారం అందించాలని చెబుతున్న ప్రభుత్వమే మరోవైపు ఇలాంటి చర్యలను ప్రోత్సహిస్తోంది.

అంగన్‌వాడీలపై అదనపు భారం

నూతన ప్రొటోకాల్ ప్రకారం పోషకాహార లోపాన్ని అనేక కేటగిరీలు విభజించారు. పిల్లలు ఏ కేటగిరీకి చెందుతారో అంగన్‌వాడీలే నిర్ణయించాలి. దీనివల్ల వారిపై మరింత పనిభారం పడుతుంది. అసలు అంగన్‌వాడీ కేంద్రాలలోనే సరైన సౌకర్యాలు లేవు. 21% కేంద్రాలలో మరుగుదొడ్డి లేదు. పిల్లలు ఆరుబయటే కాలకృత్యాలు తీర్చుకోవాల్సి వస్తోంది. కేవలం 87.5% కేంద్రాలకు మాత్రమే తాగునీటి సౌకర్యం ఉంది. మిగిలిన కేంద్రాలలో అపరిశుభ్రమైన నీటితోనే పిల్లలకు వంట చేసి పెడుతున్నారు. మరుగుదొడ్లు, తాగునీరు లేని అంగన్‌వాడీ కేంద్రాలు తల్లులకు, సమాజానికి ఏ విధంగా వాటి ప్రాధాన్యతపై బోధించగలవు? పిల్లలకు చదువు చెప్పడం, వండి వార్చడం వంటి పనులకే అంగన్‌వాడీ కార్యకర్తలు పరిమితం కావడం లేదు. పోషకాహార లోపంతో బాధపడుతున్న పిల్లల ఇళ్లకు వెళ్లి తల్లిదండ్రులకు అవగాహన కల్పించాల్సి ఉంటుంది.

చిరుధాన్యాల వినియోగం మంచిదేనా?

అంగన్‌వాడీ కేంద్రాలలో పిల్లలకు అందిస్తున్న చిరుధాన్యాల ఆహారంలో అమినో యాసిడ్లు పూర్తి స్థాయిలో ఉండవు. పైగా ఆ ఆహారంలో ఉండే అధిక పీచు పదార్థం కారణంగా పిల్లలకు ఉదర సంబంధమైన సమస్యలు వచ్చే అవకాశం ఉంది. వారానికి ఒక రోజు చిరుధాన్యాలతో చేసిన ఆహారాన్ని అందించాలని ప్రొటోకాల్ చెబుతోంది. అలవాటు లేని ఆహారాన్ని అందించడం వల్ల పిల్లలకు పోషకాహారం అందే సంగతి ఏమో కానీ ఆరోగ్య సమస్యలు తలెత్తడం మాత్రం ఖాయం.

బ్యాంక్ ఆఫ్ బరోడా మొబైల్ యాప్ కుంభకోణం

రిజిస్టర్ కాని నెంబర్లకు బ్యాంక్ ఖాతాల అనుసంధానం

- కొందరు ఉద్యోగుల సస్పెన్షన్



న్యూఢిల్లీ : ప్రభుత్వ రంగంలోని బ్యాంక్ ఆఫ్ బరోడా (బీఓబీ) యాప్‌లో చోటుచేసుకున్న కుంభకోణం బ్యాంకింగ్ వ్యవస్థ మూలాలనే కుదిపేస్తోంది. బ్యాంక్ నూతన వినియోగదారులకు ఈ మొబైల్ యాప్ సదుపాయం కల్పించకుండా రిజర్వ్‌బ్యాంక్ నిషేధం విధించింది. రిజిస్టర్ కాని మొబైల్ నెంబర్లకు బ్యాంక్ ఖాతాలను బీఓబీ అనుసంధానించిందంటూ ఓ వార్తా సంస్థ బయటపెట్టిన మూడు నెలలకు ఆర్‌బీఐ ఈ చర్య తీసుకుంది. కుంభకోణం వెలుగు చూసిన నేపథ్యంలో వినియోగదారులకు కల్పించిన యాప్ సదుపాయాన్ని బ్యాంక్ ఉపసంహరించుకుంది. అయితే అప్పటికే డౌన్‌లోడ్లు, సైన్-అప్‌ల సంఖ్య కృత్రిమంగా పెరిగిపోయింది.

'బీఓబీ వరల్డ్' యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని నూతన వినియోగదారులు భావిస్తే ముందుగా బ్యాంకులు జరిగిన లోపాలను గుర్తించి సరిచేసి, సంబంధిత ప్రక్రియలను పటిష్టవంతం చేయాల్సి ఉంటుంది. ఆర్‌బీఐని సంతృప్తి పరచే విధంగా బ్యాంక్ ఈ చర్యలు చేపట్టాలి.

గత వారం ఆర్‌బీఐ చర్యలు తీసుకున్న తర్వాత బ్యాంక్ అధికారులు కొందరు ఉద్యోగులను సస్పెండ్ చేశారు. భోపాల్, బరోడా, రాజస్థాన్‌లో పనిచేస్తున్న ఉద్యోగులను సస్పెండ్ చేసి విచారణ ప్రారంభించామని ఈ ప్రక్రియతో సంబంధమున్న ఓ అధికారి తెలిపారు. మొబైల్ యాప్‌లు ఉన్న బ్యాంకుల్లో ఇన్ఫర్మేషన్ సెక్యూరిటీ (ఐఎస్) ఆడిట్ వ్యవస్థను అమలు చేయాలని ఆర్‌బీఐ గవర్నర్ శక్తికాంత దాస్‌ను ఓ పౌర సమాజ వేదిక కోరింది. ఈ వ్యవస్థను అమలు చేయడం ద్వారా అవకతవకలు ఏమైనా జరిగాయా అనే విషయాన్ని కనిపెట్టాల్సిందిగా బ్యాంకులను కోరాలని సూచించింది.

'అనేక బ్యాంకులు బిజినెస్ కరస్పాండెంట్లు, ఉద్యోగుల ద్వారా కస్టమర్లకు మొబైల్ యాప్ సదుపాయాన్ని అందిస్తున్నాయి. దీంతో మోసగాళ్ల వలలో పడి వినియోగదారులు తమ సొమ్మును పోగొట్టుకుంటున్నారు. బ్యాంకులు తమ బిజినెస్ కరస్పాండెంట్లకు అసాధ్యమైన లక్ష్యాలు నిర్దేశిస్తుంటాయి. ఉద్యోగులు ఆ లక్ష్యాలను సాధించారా లేదా అనే విషయం పైనే బ్యాంకులు దృష్టి పెడుతున్నాయి తప్ప మోసాలను గుర్తించడం లేదు' అని ఈ నెల 14న ఆర్‌బీఐకి రాసిన లేఖలో బ్యాంక్ బచావో దేశ్ బచావో మంచ్ సంస్థ వివరించింది. బీఓబీ వరల్డ్ యాప్‌లో జరిగిన కుంభకోణం ప్రారంభం మాత్రమేనని, వాస్తవ కుంభకోణం భారీ స్థాయిలోనే ఉండవచ్చునని తెలిపింది.

పూణె - ఢిల్లీ విమానానికి బాంబు బెదిరింపు..

- ముంబయిలో ఎమర్జెన్సీ ల్యాండింగ్

ముంబై : పూణె నుంచి ఢిల్లీ వెళ్తున్న ఆకాశ విమానానికి బాంబు బెదిరింపు కాల్ వచ్చింది. దీంతో విమానాన్ని ముంబయి ఎయిర్‌పోర్టులో అత్యవసరంగా ల్యాండింగ్ చేశారు. ఓ ప్రయాణికుడి తన బ్యాగులో బాంబు ఉందని బెదిరించడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. ఈ క్రమంలో విమానాన్ని ముంబయి ఎయిర్‌పోర్టుకు మళ్లించి, ల్యాండ్ చేశారు. 40 నిమిషాల పాటు క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించారు. ఎలాంటి బాంబు లభ్యం కాకపోవడంతో పోలీసులు, అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.

అనంతరం విమానం ఢిల్లీకి బయల్దేరింది. అయితే బాంబు ఉందని బెదిరించిన ప్రయాణికుడు, తనకు ఛాతీలో నొప్పి వస్తుందని చెప్పడంతో, ముంబయిలో విమానం ల్యాండైన వెంటనే ఆస్పత్రికి తరలించారు. అనంతరం అతనికి మెడిసిన్స్ ఇచ్చి పంపించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

3 వేలమందిని ప్రశ్నించి ఆకలి సూచీ ఇస్తారంటూ

మంత్రి వ్యాఖ్య.. భగ్గుమన్న విపక్షాలు

న్యూఢిల్లీ: 140 కోట్లమంది దేశ ప్రజల్లో 3000 మందిని పిలిచి, ఆకలేస్తుందా అని వారిని పశ్నించి ఆకలి సూచీని లెక్కిస్తారంటూ కేంద్రమంత్రి స్మృతి ఇరానీ చేసిన వ్యాఖ్యలపై విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ఆమె మాటల్లో దయ లేదని, అజ్ఞానం కనిపిస్తోందని కాంగ్రెస్ దుయ్యబట్టింది. ఈ ఏడాది విడుదలైన హంగర్ ఇండెక్స్ నివేదిక ప్రకారం భారత్ 111వ స్థానంలో ఉంది. ఆకలి సూచీలో పాకిస్థాన్(102) కంటే వెనకబడి ఉండటాన్ని ప్రశ్నిస్తూ.. స్మృతి స్పందించారు. 'భారతదేశ స్టోరీని ఇలాంటి సూచికలు అంచనావేయవు. ఉద్దేశపూర్వకంగా అలా జరగొచ్చు. గ్లోబల్ హంగర్ ఇండెక్స్ లెక్కలను చాలామంది తోసిపుచ్చుతుంటారు. ఇండెక్స్ రూపకర్తలు.. భారత్‌లోని 140 కోట్ల మంది ప్రజల్లో 3000 మందిని పిలిచి, ఆకలి వేస్తుందా..? అని ప్రశ్నించి ఈ సూచీని రూపొందిస్తారు. ఆ ఇండెక్స్ ప్రకారం.. భారత్ కంటే పాకిస్థాన్ మెరుగ్గా ఉంది. అది సాధ్యమా..?' అని మంత్రి వ్యాఖ్యలు చేశారు. 'ఇంతకంటే సిగ్గుచేటు ఏమీ ఉండదు. మీ మాటల్లో మీ అజ్ఞానం కనిపిస్తోంది. కొంతమందిని పిలిచి, ఆకలిగా ఉందా అని అడిగి, ఈ సూచీని సిద్ధం చేస్తారని మీరు నిజంగా భావిస్తున్నారా..?'అని కాంగ్రెస్ నేత సుప్రియా ష్రినేట్ ట్వీట్ చేశారు. 'మీరు భారత ప్రభుత్వంలో మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రిగా ఉన్నారు. మీ నుంచి ఇలాంటి మాటలు వినడం దిగ్భ్రాంతి కలిగిస్తోంది. పిల్లల్లో వయసుకు తగ్గ ఎదుగుదల, పౌష్టికాహారలోపం వంటి నాలుగు సూచికల ఆధారంగా ఈ సూచీని రూపొందిస్తారు' అని గట్టి కౌంటర్ ఇచ్చారు. 'ఆకలిని అపహాస్యం చేయొద్దు. మీరు ఎక్కడికి వెళ్లినా తగినంత ఆహారం అందుబాటులో ఉంటుంది' అని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. 'మంత్రిగారు.. అహంకారానికి మరో రూపంగా ఉన్నారు' అంటూ శివసేన నేత ప్రియాంకా చతుర్వేది మండిపడ్డారు.



ఐదు కోట్లకుపైనే పెండింగ్ కేసులు

న్యాయస్థానాల్లో సత్వర విచారణ జరగాలి

- పాత కేసులను పరిష్కరించాలి
- గడువులోగా వాటిని పూర్తి చేయాలి
- దేశవ్యాప్తంగా పేరుకుపోతున్న కేసులపై సుప్రీం తాజా ఆదేశాలు



న్యూఢిల్లీ : దేశవ్యాప్తంగా న్యాయస్థానాల్లో పెండింగ్ కేసులు కోట్ల సంఖ్యలో పేరుకుపోతున్నాయి. పరిష్కారాలు లభించక తుది తీర్పుల కోసం ఎదురు చూస్తున్నాయి. పిటిషనర్లు సైతం ఈ పెండింగ్ కేసులతో విసిగెత్తిపోతున్నారు. అందుబాటులో ఉన్న సమాచారం ప్రకారం దేశవ్యాప్తంగా పలు కోర్టుల్లో దాదాపు 5 కోట్లకు పైగా కేసులు పెండింగ్‌లో ఉన్నట్టు సమాచారం.

ఈ నేపథ్యంలో సుప్రీంకోర్టు న్యాయస్థానాలకు కీలక ఆదేశాలు జారీ చేసింది. పాత కేసులను సత్వరమే విచారించి, పరిష్కరించాలని వెల్లడించింది. న్యాయవిచారణ ప్రక్రియ ఇలాగే నత్తనడకన కొనసాగితే పిటిషనర్లు తప్పుగా భావించే అవకాశమున్నదని ఆందోళన వ్యక్తం చేసింది. గడువులోగా న్యాయ విచారణను పూర్తి చేయాలని తెలిపింది. సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎస్ రవీంద్ర భట్ నేతృత్వంలోని బెంచ్.. జిల్లా, తాలూకా స్థాయిల్లోని అన్ని కోర్టులను ఆదేశించింది. సమన్లను సక్రమంగా అమలు చేయాలనీ, రాతపూర్వక వాంగ్మూలాలను గడువులోగా దాఖలు చేయాలనీ, ప్లీడింగ్స్ పూర్తయిన తర్వాత నిర్ణీత రోజున ఇరుపార్టీలను పిలవాలని స్పష్టం చేసింది. విచారణ ముగిసిన తర్వాత మౌఖిక వాదనలు తక్షణ వినాలనీ, కేసు విచారణ ముగిసిన తేదీ నుంచి 30 రోజులలో సాధారణంగా తీర్పులు వెలువడాలని తెలిపింది.

ఐదు సంవత్సరాలు దాటిన ప్రతి కోర్టులో పెండింగ్‌లో ఉన్న కేసులకు సంబంధించి గణాంకాలను ప్రతి ప్రిసైడింగ్ అధికారి నెలకు ఒకసారి ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ జడ్జికి పంపాలనీ, వారు (ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ జడ్జి లేదా జిల్లా జడ్జి) వాటిని క్రోడీకరించి తదుపరి చర్యలు తీసుకోవడానికి వీలు కల్పించటం కోసం సంబంధిత హైకోర్టుల ద్వారా ఏర్పాటైన రివ్యూ కమిటీకి పంపాలని వెల్లడించింది.

నేషనల్ జ్యుడీషియల్ డేటా గ్రిడ్ ప్రకారం.. జిల్లా కోర్టుల్లో 4,37,35,155 కేసులు (3,30,43,812 క్రిమినల్, 1,06,91,343 సివిల్) పెండింగ్‌లో ఉన్నాయి. ఇక దేశవ్యాప్తంగా 25 హైకోర్టుల్లో 84,68,084 కేసులు (17,36,714 క్రిమినల్, 67,31,370 సివిల్ కేసులు) పెండింగ్‌లో ఉండటం గమనార్హం.

నెల్లూరులో కెజిఎఫ్!

- భారీ మైనింగ్ కుంభకోణం శ్రీ రూ.10 వేల కోట్ల సంపదపై మాఫియా కన్ను
- 500 హిటాచీలతో పహారా
- వైసిపి, టిడిపి నేతల లాలూచీ

నెల్లూరు : కెజిఎఫ్ సినిమా గుర్తుంది కదా..! దానిని తలదన్నేలా నెల్లూరు జిల్లాలో సాగుతున్న మైనింగ్ కుంభకోణం ఇది! ఒకప్పుడు అభ్రకం (మైకా)కు ప్రసిద్ధమైన నెల్లూరు జిల్లాలోని సైదాపురం మండలంలో తాజాగా తెల్లరాయి (వైట్ స్టోన్) వెలుగులోకి వచ్చింది. ఆ రాయి కేంద్రంగా ఇక్కడ మాఫియా దందా సాగుతోంది. ప్రతి చిన్న విషయానికి ఒకరిపై ఒకరు విరుచుకుపడే వైసిపి, టిడిపి నాయకులు ఈ తెల్లరాయి విషయంలో పరస్పరం చేతులు కలిపి గుట్టుచప్పుడు కాకుండా దందా సాగిస్తున్నారు. కెజిఎఫ్ సినిమాలో మాదిరే మైనింగ్ జరుగుతున్న వైపు సామాన్యులు కన్నెత్తి చూడటానికి కూడా వీలులేకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేసుకున్నారు. ఈ మాఫియాను కాదని ఎవ్వరూ ఆ ప్రాంతంలో అడుగుపెట్టలేని పరిస్థితి నెలకొంది. అధికార, ప్రధాన ప్రతిపక్ష నాయకుల లాలూచీతో జరుగుతున్న వ్యవహారం కావడంతో అధికారయంత్రంగా కిమ్మనకుండా ఊరుకుంది. రెవెన్యూ, పోలీసు, మైనింగ్, అటవీశాఖ, ఎస్ఇబి ఇలా అనేకశాఖలకు ఇక్కడ నుండి తరలిపోతున్న వేల కోట్ల రూపాయల సంపద విషయం తెలిసినా, మొద్దు నిద్ర నటిస్తున్నారు. ఇప్పటికే ఇక్కడి నుండి చెన్నయ్ ఓడరేవు ద్వారా వెయ్యికోట్ల రూపాయల తెల్లరాయి చైనాకు తరలివెళ్లినట్లు సమాచారం.

ఐదు నెలల నుంచి ....

సైదాపురం ప్రాంతంలో ఐదు నెలల నుండి మైనింగ్ మాఫియా దందా ప్రారంభమైంది. చైనాకు చెందిన కొందరు వ్యాపారవేత్తలు, స్థానిక రాజకీయనేతలు తమ అనుచరులు, మందీ మార్బలంతో అప్పటి నుండి ఈ ప్రాంతంలో మకాం పెట్టారు. మండలంలోని పెరుమళ్లపాడు, చాగణం, గులించర్ల, కృష్ణారెడ్డిపల్లి, మర్లపూడి, పిచ్చిరెడ్డిపల్లి, పాలూరు, గ్రామాల్లో కొండలు, అడవులు, ప్రభుత్వ భూమి, పెద్ద ఎత్తున ఉన్నాయి. అధికారికంగా పదిమంది పేర్లతో ఈ ప్రాంతంలో మైనింగ్ లీజుకు తీసుకుని విచ్చలవిడిగా తవ్వకాలు చేస్తున్నారు. ఒకప్పుడు భారీఎత్తున సాగి, ఇప్పుడు నామమాత్రానికే పరిమితమైన మైకా మైనింగ్‌ను కూడా అడ్డుపెట్టుకుని తెల్లరాయి వెలికితీత సాగిస్తున్నారు. ఐదు నెలల క్రితం వరకు ఒక టన్ను కేవలం రూ.2 వేలు మాత్రమే ధర ఉండగా చైనాలో డిమాండ్ పెరగడంతో రాయి నాణ్యతను బట్టి రూ.10 వేల నుంచి రూ.22 వేలకు ధర పలుకుతోంది. దీంతో ఆ దేశానికి చెందిన వ్యాపార వేత్తలు నేరుగా ఇక్కడకు వచ్చి బేరసారాలు మొదలు పెట్టారు.

తరలింపు ఇలా....

తవ్వకాలు జరపడానికి సుమారు 500 హిటాచీలు సైదాపురంలో తిరుగుతున్నాయి. జెసిబి, హిటాచీ సహయంతో రాళ్లను బయటకు తీస్తారు.అక్కడ నుంచి టిప్పర్లతో క్రషింగ్ పాయింట్ వద్దకు చేర్చుతారు. అక్కడ చిన్నముక్కలుగా చేసి లారీల్లో తరలిస్తారు. ఒక్కలారీలో సుమారు 24 టన్నులు తరలిపోతుంది. ఒక్కలారీ లోడ్ తెల్లరాయి విలువ సుమారు రూ.మూడు లక్షలు. రోజుకు వంద నుంచి నూటయాభై లారీలు తరలిపోతున్నట్లు తెలుస్తోంది. అక్రమ పర్మిట్‌లు, పాత పర్మిట్‌లతో చెన్నయ్ ఓడరేవుకు వెళ్లి అక్కడ నుంచి చైనాకు ఎగుమతి అవుతున్నాయి. ఇప్పటి వరకు అనధికార లెక్కల ప్రకారం రూ.750 నుంచి వెయ్యి కోట్ల విలువైన తెల్లరాయి తరలిపోయింది. సుమారు 5 నుంచి 10 లక్షల టన్నుల వరకు తెల్లరాయి నిల్వలున్నట్లు తెలుస్తోంది.

విభేదాలు విస్మరించి

భారీగా లాభాలు వస్తుండటంతో అధికార, ప్రతిపక్ష నేతల కన్ను ఈ ప్రాంతంపై పడింది. అధికార వైసిపి నేతలు రాష్ట్ర స్థాయి నుంచి గద్దల్లా వాలిపోయారు. వైసిపికి చెందిన మంత్రి ఒకరు, ఎంఎల్ఎలు, నేతలు నేరుగా రంగంలోకి దిగినట్లు తెలుస్తోంది. వారికి స్థానిక టిడిపి నేతల సహకారం పూర్తిస్థాయిలో లభిస్తున్నట్లు సమాచారం. మంత్రి బినామీ పేర్లతో ఈ వ్యవహారాన్ని నడిపిస్తున్నట్లు చెబుతున్నారు. ఈ తవ్వకాలను అన్ని స్థాయిల్లో అధికార యంత్రాంగం చూసీ చూడనట్లు ఊరకుంటోంది. వీరికి సంబంధం లేకుండా ఇతరులెవరైనా తవ్వకాలు ప్రారంభిస్తే మాత్రం వెంటనే రంగంలోకి దిగి సీజ్ చేస్తున్నట్లు చెబుతున్నారు.